

వెలుగుల వెనుక
కథలు
రూ॥160/- పేజీలు:160
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



తొలివారం 'వాష్‌ఔట్'
ప్రధాన్ ఒక నేరపూరిత మంత్రి
రాహుల్‌గాంధీ మండిపాటు

లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుకు
కేంద్ర కేబినెట్ ఆమోదం
07



సంపుటి 09, సంచిక: 235 | శనివారం | 25-07-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## ప్రధాని మోదీ అర్ధరాత్రి వీడియో

'నీట్' పేపర్ లీకేజీపై కఠిన చర్యలు తీసుకుంటామని సందేశం



పరీక్షా పత్రాల లీకేజీ (పేపర్ లీక్) ఘటనలపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పించే బిల్లును వచ్చేవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం అర్ధరాత్రి ప్రకటించారు. శుక్రవారం కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ బిల్లుకు సంబంధించిన ముసాయిదాపై చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నట్లు మోదీ ఒక వీడియో సందేశంలో తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో పేపర్ లీక్ అంశంపై తరువాయి 8లో

## పార్లమెంటులో కాకుండా 'ఎక్స్'లో ప్రకటనలా?

ప్రధాని మోదీ తీరుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శ



పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో, సభలో కాకుండా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తప్పుపట్టారు. నీట్ పరీక్షా పేపర్ల లీకేజీ, విద్యార్థుల ఆందోళనలపై మోదీ స్పందించిన తీరును ఆయన 'ఏకపక్ష మన్‌కీ బాత్'గా అభివర్ణించారు. పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం మోపడానికి ఒక ప్రత్యేక బిల్లును ప్రవేశపెడతామని గురువారం రాత్రి 'ఎక్స్'లో మోదీ ఒక వీడియో పెట్టడంపై స్పందించిన ఖర్గే, పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో, సామాజిక తరువాయి 8లో



## వాంగ్‌చుక్ నిరశన విరమణ

- డిమాండ్లను నెరవేరుస్తామని ప్రభుత్వం హామీనివ్వడంతో దీక్షను ముగించిన పర్యావరణ కార్యకర్త
- భవిష్యత్ పోరాటాల కోసం జీవించడమే ముఖ్యమని వ్యాఖ్య
- ప్రధాన్ రాజీనామా చేసే వరకు శాంతియుత నిరసన : సిజెపి

**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్, పరీక్షల్లో అవకతవకలపై జవాబుదారీతనం ఉండాలని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) జంతర్ మంతర్ వద్ద గత నెలలో నిరసన చేపట్టింది. అయితే ఈ నిరసనలకు సంఘీభావంగా పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధి నిరాహారదీక్షకు దిగారు. అయితే 26 రోజుల తరువాత గురువారం అర్ధరాత్రి ఆయన దీక్ష విరమించారు. తన డిమాండ్లను నెరవేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన తర్వాత ఆయన తన నిరవధిక నిరాహార దీక్షను విరమించారు. గురువారం అర్ధరాత్రి సమయంలో గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, జితేంద్ర సింగ్ వాంగ్‌చుక్‌ను కలిసి ప్రభుత్వ హామీలను తెలియజేసిన తర్వాత, ఆయన తన దీక్షను ముగిస్తున్నట్లు ప్రకటించారు. 'కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, డాక్టర్ జితేంద్ర సింగ్, లేహ్-లఢాఖ్ 'అపెక్స్ బాడీ'కి చెందిన సీనియర్ నాయకుల సమక్షంలో 26 రోజుల తర్వాత నా దీక్షను విరమించాను' అని వాంగ్‌చుక్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తాను ఎందుకు దీక్ష విరమించాల్సి వచ్చిందో వెల్లడించారు. 'నా దగ్గర రెండే దారులున్నాయి. ఒకటి నిరాహార దీక్ష కొనసాగించడం లేదా దీక్ష ముగించి ఉద్యమాన్ని కొనసాగించడం. వేలాది మంది నేను దీక్ష విరమించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. ప్రాణాన్ని పణంగా పెట్టడంకంటే ఉద్యమాన్ని కొనసాగించడమే ముఖ్యమని చాలామంది సూచించారు. భవిష్యత్ పోరాటాల కోసం నేను జీవించి ఉండటం చాలా ముఖ్యం. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయనంతమాత్రాన ఈ ఉద్యమం విఫలమైనట్లు కాదు. ఆయన తరువాయి 8లో

## ధర్మేంద్ర రాజీనామాపై

# రాజీ ప్రసక్తే లేదు

- విద్యార్థులపై దాడులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాల్సిందే
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం
- నిరసనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ
- తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెగేసి చెప్పిన సిజెపి ప్రతినిధులు

నేడు మరోసారి చర్చలు



**న్యూఢిల్లీ :** పేపర్ లీక్ ఘటనలతో దేశవ్యాప్తంగా నిరసనలు చేలరేగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) మధ్య చర్చలు జరిగాయి. శుక్రవారం ఢిల్లీలోని విఠల్‌భాయి పటేల్ హౌస్‌లో జరిగిన చర్చలకు కేంద్ర తరుపున మంత్రులు జెపి నడ్డా, జితేంద్రసింగ్ హాజరయ్యారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో నీట్ పేపర్ లీక్, పరీక్షా విధానంలోని ఇతర అక్రమాలపై జరుగుతున్న నిరసనలకు సామరస్యపూర్వక పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నం జరిగింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్ విషయంలో ఎలాంటి రాజీ లేదని, ఈనెల 20న దారుణం దాడికి గురైన నిరసనకారులైన విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సిజెపి ప్రభుత్వానికి స్పష్టం చేసింది. మే 3న నీట్ పరీక్ష రద్దయిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇవ్వాలని కూడా డిమాండ్ చేసినట్లు సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్ తరువాయి 8లో

## కేంద్రానికి వీకెండ్ టెన్షన్!

జంతర్‌మంతర్‌కు భారీగా జనం వస్తారని ఆందోళన

17 మెట్రో స్టేషన్‌ల మూసివేత

కేంద్రానికి వీకెండ్ టెన్షన్ పట్టుకుంది. నేడు, రేపు (శని, ఆదివారాలు) సహజంగా సిబిఎస్ఇ పాఠశాలలకు, విద్యా సంస్థలకు సెలవులు ఉంటాయి. అలాగే సాఫ్ట్‌వేర్, ఇతర ప్రైవేటు కంపెనీల్లో పనిచేసే వారికి కూడా ఆ రెండు రోజులు హాలీడేస్. దీంతో జంతర్‌మంతర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ధర్నా శిబిరం వద్దకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున యువత వస్తారని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో వారిని ఎలా నిలవరించాలనే ఆందోళనలో ఉంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి ఢిల్లీకి కిక్కిరిసి వస్తున్న రైళ్ళను తరువాయి 8లో






## ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల్లోనే..

వివిధ శాఖల పరిధిలోని నిరుపయోగ స్థలాలను గుర్తించండి
క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

'క్యూర్' పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్లపై సిఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించాలని అధికారులకు సిఎం సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో గుర్తించిన స్థలాల వివరాలను అధికారులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి ఇప్పటికే గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, వేరేచోట సంబంధిత శాఖలకు స్థలాన్ని కేటాయించాలని సిఎం ఆదేశించారు. జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే తరువాయి 8లో


ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణకు ప్రత్యేక బ్యూరో 12


## ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై

# దాడి అమానుషం

- ఎన్‌టిఎను రద్దు చేయడంతో పాటు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- కాక్రోచ్ జనతా పార్టీకి వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు
- విద్యాసంస్థల బంద్ సక్సెస్
- హైదరాబాద్‌లో విద్యార్థి నాయకులు, యువత భారీ ర్యాలీ
- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు




ప్రజాపక్షం/హైదరాబాద్

గత కొద్ది రోజులుగా నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో విద్యార్థులపై పోలీసుల దాడి అమానుషమని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు పేర్కొన్నారు. విద్యార్థులపై జరిగిన పోలీసు దాడులను ఖండిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ని రద్దు చేయాలని, మరణించిన విద్యార్థుల కుటుంటాలకు రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు శుక్రవారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విద్యార్థులు, యువజనులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో బంద్‌లో పాల్గొన్నారు. బంద్‌కు మద్దతుగా విద్యాసంస్థలు స్వచ్ఛందంగా తమ పాఠశాలలకు, కాలేజీలకు సెలవు ప్రకటించాయి. పలు విద్యా సంస్థల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. ఈ మేరకు తరువాయి 8లో

## ఇంటర్నెట్ షట్‌డౌన్ చట్ట విరుద్ధం : డి.రాజా



**న్యూఢిల్లీ :** విద్యార్థి ఉద్యమాన్ని అణచివేసేందుకు ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో విధించిన ఇంటర్నెట్ షట్‌డౌన్ పూర్తిగా చట్టవిరుద్ధం, అహేతుకమని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఖండించారు. ఈ చర్య సమాచారం పొందే పౌరుల హక్కును ఉల్లంఘిస్తుందని, నిరసనకారులు,సంస్థల మధ్య సమాచార మార్పిడికి అంతరాయం కలిగిస్తుందని,గందరగోళం, అరాచకాన్ని సృష్టిస్తుందని ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. చదువు, యుపిఐ చెల్లింపులు, రవాణా, పని, అత్యవసర సమాచార మార్పిడి వంటి నిత్యావసర సేవల కోసం ఇంటర్నెట్‌పై ఆధారపడే సామాన్య ప్రజలను కూడా ఇది ప్రభావితం చేస్తుందన్నారు. కన్నాట్ ప్లేస్ కూడా ప్రభావితం కావడంతో, వేలాది మంది పౌరులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఇంటర్నెట్ సేవలను తక్షణమే పునరుద్ధరించాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడటానికి బిజెపి ప్రయత్నిస్తున్నందుకు ఢిల్లీ ప్రజలను శిక్షించకూడదని ఎద్దేవా చేశారు.

## రూ.1,000 కోట్ల సైబర్ మోసాలపై సిట్

సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు దర్యాప్తు బాధ్యతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఖమ్మం జిల్లాలో సంచలనం సృష్టించిన రూ.1,000 కోట్లకు పైగా విలువైన సైబర్ మోసాల కేసుల దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఆదేశాల మేరకు ఈ కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి, దర్యాప్తు బాధ్యతలను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అప్పగించినట్లు సమాచారం. అందిన వివరాల ప్రకారం, వీఎం బంజారా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుతో పాటు సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసును సైబర్ సెక్యూరిటీ బ్యూరో స్వాధీనం తరువాయి 12లో

## కాళేశ్వరం బ్యారేజీలపై కేంద్రానికి సమగ్ర నివేదిక

రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణ పట్ల కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదికను పంపించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.భవిష్యత్తులో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలను ప్రారంభించాలా?, వద్దా ?అనే విషయంలో కేవలం రాజకీయ ఒత్తిళ్లు లేదా? పైకి కనిపించే పరిస్థితుల ఆధారంగా కాకుండా, అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖిత పూర్వక సిఫారసుల ఆధారంగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ పాటు పలువురు సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. అనంతరం పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కూడా సమీక్షించారు. నీటి కేటాయింపులు, ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న అంశాల కారణంగా తరువాయి 8లో



## కేంద్రం వల్లే సింగరేణికి కొత్త గనులొస్తలేవ్!

- సంస్థలో ఆదానీ, అంబానీ రూపంలో దొంగలు పడ్డారు
- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కూనంనేని విమర్శ

ప్రజాపక్షం/పెద్దపల్లి

సింగరేణి సంస్థలో ఆదానీ, అంబానీల రూపంలో దొంగలు పడ్డారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయుసి) గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం వల్ల సింగరేణికి కొత్త గనులు తరువాయి 12లో

## 27న కలెక్టరేట్‌లు, లోక్ భవన్ వద్ద నిరసనలు

ఆగస్టు 6 నుండి 14 వరకు పాద యాత్రలు, ప్రచార యాత్రలు, సెప్టెంబరు 1వ తేదీన ఛలో ఢిల్లీ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఢిల్లీలో విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా, శాంతియుత విద్యార్థి ఆందోళనపై క్రూరమైన అణచివేతకు నిరసనగా సిపిఐ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈ నెల 27న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద, హైదరాబాద్‌లో గవర్నర్ కార్యాలయం లోక్‌భవన్ వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సిపిఐ మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అధ్యక్షతన సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో తరువాయి 12లో

# కొండంత నిర్లక్ష్యం

ఉన్నత విద్యను తమ చెప్పుచేతల్లో ఉంచుకునేందుకై, సమాఖ్య స్ఫూర్తిని భగ్నం చేస్తూ అఖిల భారత ఎంట్రన్స్ పరీక్షల నిర్వహణకు 'జాతీయ టెస్టింగ్ ఏజన్సీ(ఎన్‌టిఎ)ని 2017లో నెలకొల్పిన నరేంద్రమోదీ ప్రభుత్వం అసమర్థ నిర్వహణ దుష్ఫలితాలు అనుభవిస్తున్న విద్యార్థులు, వ్యంగ్యాత్మకమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో ఆకస్మికంగా ఆన్‌లైన్‌లో ఉద్భవించి విద్యావ్యవస్థపై నవతరం (జన్‌–జీ)లో కుతకుతమంటున్న అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తీకరిస్తూ ప్రభుత్వానికి ముచ్చెమటలు పోయిస్తున్నారు. నెలన్నరరోజులుగా జంతర్‌మంతర్ వేదికగా గాంధేయమార్గంలో నిరసన వ్యక్తం చేస్తుండగా చీమకుట్టినట్లు లేని ప్రభుత్వం సోమవారంనాడు విద్యార్థుల 'పార్లమెంట్ మార్చ్'పై మహాకర్కశంగా వ్యవహరించింది. పోలీసు క్రౌర్యం పట్ల దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు, నిరసన వ్యక్తం కావటం, రెండోవైపున, విద్యార్థి ఉద్యమానికి ప్రతిపక్షాల క్రియాశీల మద్దతుతో సోమవారంనుంచి పార్లమెంటు ఉభయ సభలు ప్రతిష్టంభనలో పడటంతో – పరువు నిలుపుకునే ప్రయత్నంగా ఈ బిజెపి/ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం నిద్రలేని రాత్రులు గడుపుతూ హడావుడి ప్రయత్నాలు మొదలుపెట్టింది. నీట్ తదితర ప్రశ్నాపత్రాల లీకేజి విద్యార్థిలోకంలో కలుగజేసిన క్షోభకు జవాబుదారీగా విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలన్న ఉద్యమకారుల, ప్రతిపక్షాల డిమాండ్‌కు తలొగ్గకుండా ఇతరత్రా కోర్కెల ఆమోదానికి ముందుకు వచ్చింది. హక్కుల ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల నిరాహారదీక్షను విరమించారు. ఉద్యమకారుల ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం అర్థరాత్రి (తెల్లవారితే శుక్రవారం) 12 గంటలకు విద్యార్థి నాయకులకు వీడియో సందేశం పంపటమే ప్రభుత్వంలో బయలుదేరిన బెదురుకు నిదర్శనం. 'పరీక్షా పత్రాల లీకేజి లక్షలాది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎంతో బాధాకరమని అంటూ, లీకేజి మాఫియాలపై కఠిన చట్టం, చర్యలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు' వాగ్దానం చేశారు. పార్లమెంటు సమావేశం జరుగుతుండగా విధాన ప్రకటనలు సభలో చేయకుండా సభవెలుపల చేయటం పార్లమెంటరీ సంప్రదాయాలపట్ల మోదీకున్న అగౌరవాన్ని తెలియజేస్తుంది. లేదా తన అర్థరాత్రి సందేశానికి విద్యార్థులు చలించిపోయి వెంటనే ఉద్యమం విరమిస్తారని భావించి ఉండాలి. ఉద్యమంలో సంఘ వ్యతిరేక, విద్రోహశక్తులు, దేశద్రోహులు ప్రవేశించారని, విదేశీ ప్రమేయం ఉందని బిజెపి నాయకులు దేశం నాల్గుదిశలా తమకు అలవాటైన దుష్ప్రచారం చేయటం వారి నిస్సహాయతకు నిదర్శనం. మోదీ 12 ఏళ్ల పాలనలో ఇటువంటి ఉద్యమాన్ని వారు కలలోకూడా ఊహించలేదు. ఒక పక్క రామాలయంలో భక్తుల కాన్కల దొంగతనం, ఇటేమో తమకు కోటలాంటి హిందీ బెల్టునుంచి జన్–జడ్ తరం తిరుగుబాటు బిజెపి/ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది.

ఉన్నత ఆశయాల ప్రకటనతో నెలకొల్పిన ఎన్‌టిఎ సెంటర్‌ను ఎంత అధ్వాన్నంగా నిర్వహిస్తున్నారో విద్యాశాఖ సహాయమంత్రి సుఖాంత మజుందార్ రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన సమాధానం వెల్లడించింది. ఎన్‌టిఎలో ఏర్పాటు చేసిన 39 పోస్టుల్లో 15ఖాళీగా ఉన్నాయి. కేంద్ర విద్యామంత్రిత్వశాఖకు చెందిన ఈ పరీక్షల నిర్వహణ సంస్థలో ప్రస్తుతం ఉన్న 24 మంది ఉద్యోగులూ వివిధ సంస్థల నుంచి డెప్యుటేషన్‌పై వచ్చినవారే. ఎన్‌టిఎ ఎక్కువగా బయటివారిపై ఆధారపడుతున్నది. కమ్యూనికేషన్ జనరల్ మేనేజర్, సీనియర్ సలహాదారులు, కన్సల్టెంట్స్ సహా 73మంది అధికారులు కాంట్రాక్టుపై, 124మంది పొరుగుసేవల ఉద్యోగులు ఉన్నట్లు సిపిఐ(ఎం) సభ్యుడు వి.శివదాసన్ ప్రశ్నకు మంత్రి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం తెలియజేస్తున్నది. కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ స్థాయిలో 16 పోస్టులు ఏర్పాటు చేశారు. కాని పర్మినెంట్ స్టాఫ్‌ను రిక్రూట్ చేయకుండా డెప్యుటేషన్‌లతోనే సరిపెట్టారు. యూనివర్శిటీ ఎంట్రన్స్, మెడికల్, ఇంజినీరింగ్, ఫెలోషిప్ వంటి 24 ఉన్నతస్థాయి పరీక్షల నిర్వహణ బాధ్యత అప్పగించబడిన ఎన్‌టిఎ నిర్మాణం, నిర్వహణ ఇంత దారుణంగా ఉంటే ఆ శాఖను నిర్వహించే మంత్రి సమర్థుడని ఎవరైనా అంటారా? అతను రాజీనామా చేయాలి లేదా ప్రధాని బర్తరఫ్ చేయాలన్న 'బొద్దింకల' డిమాండ్ న్యాయం, ధర్మం, సమంజసం కాదా?

నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణల తదుపరి ఆ ఏజన్సీ అధికారులు కొందరిని బదిలీ చేశారు. ఇప్పుడు – ఇంతటి ఆందోళన తర్వాత విద్యామంత్రిత్వ శాఖలో ఉన్నత విద్య కార్యదర్శిసహా ఇద్దరు–ముగ్గురు ఉన్నతాధికారులను బదిలీ చేశారు. నీట్‌లీక్ ఆరోపణలపై 47మందిని సాయంత్రం తొలగించారు. విద్యాశాఖమంత్రి ఇన్నాళ్లు నిద్రపోతున్నారనే అర్థం కాదా? ఈ ఉద్యమం గూర్చి నోరువిప్పటానికి ప్రధానమంత్రే నెలన్నరరోజులు తీసుకున్నారు. ఆయన మంత్రులనుంచి మెరుగైన పనితీరు ఊహించగలమా?

నీట్ పరిణామాలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వరుసక్రమంలో పెట్టిన తీరు సమస్యను సూక్ష్మంగా సుబోధక పరుస్తున్నది. "పరీక్షల నిర్వహణకై మోదీ ప్రభుత్వం ప్రత్యేకించి ఎన్‌టిఎ ఏర్పాటు చేసింది....అంతకుముందున్న వ్యవస్థ రద్దు చేసింది...ఎన్‌టిఎ నిర్వహణలో కనీసం 9పేపర్లు లీక్ అయినాయి... సంస్కరణలు సీరియస్‌గా అమలు జరిపే బదులు ప్రధాని అడ్డుపడుతూ వచ్చారు...నీట్–యుజిసి 2026 లీక్ అయింది... ఎన్‌టిఎ, ఉన్నత విద్య డిపార్టుమెంట్ వారు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీముందు, సిగ్గుమాలినతనంతో, ప్రశ్నాపత్రం లీక్ కాలేదని బుకాయించారు... ప్రధానికి సత్యం కన్నా తన ప్రతిష్ట ప్రధానం...పార్లమెంటరీ కమిటీలో ప్రతిపక్ష సభ్యులు కూడా ఉన్నారన్న మిషతో సిఫారసులు అమలు చేయలేదు". అందువల్ల నీట్–యుజి 2026 పేపర్ లీక్ రోగలక్షణం మాత్రమే; జబ్బు చాలా లోతుగా ఉంది అన్నారు రమేశ్. ఆ రోగాన్ని క్షుణ్ణంగా పరీక్షించి, భవిష్యత్ పరీక్షలకు భద్రత కల్పించాలంటే విద్యామంత్రి తొలగింపు అవసరం. ఆ పని చేయకపోతే తమ డిమాండ్ 'ప్రధాన్' నుంచి 'ప్రధాని'కి విస్తరిస్తుందని 'బొద్దింకల' పేరుతో ఉన్న జన్–జడ్ తరం, ప్రతిపక్షాలు హెచ్చరిస్తున్నాయి.

ఎన్‌టిఎని సక్రమంగా నిర్వహించ చేతగాని మోదీ ప్రభుత్వం యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్, అఖిల భారత సాంకేతిక విద్య కౌన్సిల్, ఉపాధ్యాయ విద్యా జాతీయ కౌన్సిల్ చట్టాలను రద్దు చేసి – ఆ అధికారాలతో ఒకే సంస్థ ఏర్పాటు చేసేందుకై "వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్" బిల్లు తెచ్చింది. అది జాయింట్ పార్లమెంటరీ కమిటీ ముందు ఆగింది. ఎందుకీ విద్య కేంద్రీకరణ తపన !

NATIONAL TESTING AGENCY (NTA)

## ఎన్‌టిఎలో భారీ ప్రక్షాళన

జెఇఇ, నీట్ సహా పలు జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ)లో ప్రభుత్వం భారీ ప్రక్షాళన చేపట్టింది. పరీక్షా పత్రాల లీకేజీతో ఈ ఏజెన్సీ పదేపదే వివాదాల్లోకి రావడంతో అందుకు కారకులుగా గుర్తించిన 47 మంది అధికారులను సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో పలువురిపై లీగల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. లీకులకు అస్కారం లేకుండా నిపుణుల కమిటీ సూచనల మేరకు ఔట్‌సోర్సింగ్ విధానంలో మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.



# వీధులు మాట్లాడితే... అధికారం వినాల్సిందే!

ప్రశ్నలు పుట్టని సమాజంలో ప్రజాస్వామ్యం బతకదు.. ప్రశ్నించనివ్వని వ్యవస్థలో స్వేచ్ఛ నిలవదు. చరిత్ర చెబుతున్న అసలు పాఠం ఇదే. భారతదేశంలో మహాత్మా గాంధీ ఉప్పు సత్యాగ్రహం నుంచి జంతర్ మంతర్, రైతు ఉద్యమాల వరకు.. దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా వర్ణవివక్ష వ్యతిరేక పోరాటం నుంచి నేపాల్ ప్రజాస్వామ్య ఉద్యమాలు, టియాన్మెన్ స్క్వేర్ విద్యార్థి నిరసనలు, అరబ్ స్ప్రింగ్, ఇరాన్ మహిళల ఉద్యమాలు, శ్రీలంక ప్రజా నిరసనలు, అమెరికా పౌర హక్కుల ఉద్యమాలు, ఆస్ట్రేలియాలో ఆదివాసీ హక్కులు, పర్యావరణ పరిరక్షణ కోసం జరిగిన శాంతియుత ఉద్యమాల వరకు ప్రపంచ చరిత్ర ఒక విషయాన్ని గుర్తుచేస్తోంది. ప్రజల ఆకాంక్షలను దీర్ఘకాలం అణచివేయడం ఏ వ్యవస్థకూ సాధ్యం కాదని అనేక చారిత్రక అనుభవాలు సూచిస్తున్నాయి. భారత రాజ్యాంగం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుత సమావేశాల హక్కుల ద్వారా ప్రజాస్వామ్య భాగస్వామ్యాన్ని రక్షిస్తోంది. ఈ సమతుల్యతను సుప్రీంకోర్టు మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (2018), రామ్‌లీలా మైదాన్ (2012), అమిత్ సాహ్నీ–షాహీన్ బాగ్ (2020) వంటి కీలక తీర్పుల్లో పునరుద్ఘాటించింది.

**ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాలు.. ఒకే బాధ్యత**

ప్రజాస్వామ్యంలో ప్రజలు, ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, మీడియా పరస్పర ప్రత్యర్థులు కాదు, రాజ్యాంగ విలువలను పరిరక్షించే బాధ్యతాయుత భాగస్వాములు. ప్రజల అసంతృప్తిని ప్రభుత్వం శాంతిభద్రతల సమస్యగా మాత్రమే కాకుండా విధానపరమైన హెచ్చరికగా స్వీకరించి పారదర్శక సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సమయంలో పౌరులు తమ రాజ్యాంగబద్ధ హక్కులను శాంతియుతంగా, ఇతరుల హక్కులకు భంగం కలగకుండా వినియోగించాలి. చట్టపాలన, ప్రజా ఆస్తుల పరిరక్షణ, పరస్పర గౌరవం ప్రజాస్వామ్య సంస్కృతికి అంతర్భాగాలు. హక్కులు, బాధ్యతలు సమతుల్యంగా నడిచినప్పుడే ప్రజాస్వామ్యం పై విశ్వాసం మరింత బలపడుతుంది.

**చైతన్యంతోనే నిజమైన మార్పు**

డిజిటల్ యుగంలో నిరసనలు కేవలం వీధులకే పరిమితం కావడం లేదు, సామాజిక మాధ్యమాల ద్వారా క్షణాల్లో ప్రపంచవ్యాప్త చర్చగా మారుతున్నాయి. దీనితో పాటు తప్పుడు సమాచారం, ద్వేషపూరిత ప్రచారం, సందర్భంలేని ప్రచార కంటెంట్ వంటి సవాళ్లు కూడా పెరిగాయి. అందువల్ల డిజిటల్ అక్షరాస్యత, వాస్తవ నిర్ధారణ,బాధ్యతాయుత సమాచార వినియోగం, నిష్పాక్షిక మీడియా ధోరణి ప్రజాస్వామ్య ఆరోగ్యానికి అత్యవసరం. సినిమా, సాహిత్యం, కళలు సమాజానికి తుది తీర్పు ఇవ్వవు, కానీ ఆలోచింపజేసే ప్రశ్నలను లేవనెత్తుతాయి. 'జవాన్' కూడా ఆ కోణంలో ప్రజాస్వామ్యం, మంచి పాలన, పౌర బాధ్యతపై సంభాషణను విస్తరించిన చిత్రంగా నిలిచింది. చరిత్ర చెబుతున్న శాశ్వత పాఠం ఒక్కటే.. స్థిరమైన ప్రజాస్వామ్య మార్పు హింసతో కాదు, రాజ్యాంగబద్ధ సంభాషణ, చైతన్యవంతమైన పౌర భాగస్వామ్యం, స్వేచ్ఛాయుత ఎన్నికలు, జవాబుదారీతనంతో కూడిన పాలనతోనే సాధ్యమవుతుంది. ప్రభుత్వాలు ప్రజల స్వరాన్ని వినాలి. ప్రజలు చట్టాన్ని గౌరవించాలి, మీడియా సత్యాన్ని కాపాడాలి, న్యాయవ్యవస్థ రాజ్యాంగ విలువలను సంరక్షించాలి. విప్లవం హింసతో కాదు.. చైతన్యంతో రావాలి. ప్రజాస్వామ్యం నినాదాలతో కాదు.. బాధ్యతాయుతమైన పౌరులతో బలపడాలి. ప్రశ్నించే హక్కు ఎంత పవిత్రమో, వినే బాధ్యత కూడా అంతే పవిత్రం.

ఫిరోజ్ ఖాన్, 9640466464

# విద్యారంగ పతనం యువ భారతానికి గాయం



సోనియా గాంధీ
కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్

పరీక్షా పత్రాల లీకేజీలకు, విద్యా వ్యవస్థలోని సాధారణ పతనానికి వ్యతిరేకంగా భారతదేశం నలుమూలలా యువ విద్యార్థులు చేస్తున్న ఆందోళనలు ఊపందుకుంటున్నాయి. భారత ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలని, విద్యా సంస్కరణలు చేపట్టాలనే వారి డిమాండ్లు సూటిగా, స్పష్టంగా ఉన్నాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వం వారి ధైర్యానికి పిరికితనంతో, విచక్షణారహిత క్రూరత్వంతో సమాధానమిచ్చింది. వారిని భవిష్యత్తు వారసులుగా కాకుండా దేశ శత్రువులుగా పరిగణించింది. ఒక అపఖ్యాతి పాలైన రోజు 2026 జూలై 20న ఢిల్లీ పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సిఎపిఎఫ్) క్రూరమైన లాఠీచార్జీలు, భాష్పవాయువును ప్రయోగించి అనవసరమైన హింసతో వారిని అణచివేయడానికి ప్రయత్నించాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిలో చాలా మంది గాయపడ్డారు. ఇళ్లకు తిరిగి వెళ్తున్న విద్యార్థులను కూడా వదల్లేదు. వారి వీపులపైనా, తలలపైనా లాఠీల వర్షం కురిసింది.పెల్లెట్ల వాడకంతో శరీరాలు గాయపడిన యువత వంటి అత్యంత విచారకరమైన దృశ్యాలను దేశం చూసింది. ఇందుకు కేంద్ర హోం మంత్రి స్వయంగా ఆమోదించి ఉంటారని నిస్సందేహం గా చెప్పగలం. ఆనాటి వీడియోలు మన జ్ఞాపకాలలో చెరగని ముద్ర వేసి, మన సామూహిక మనస్సాక్షిని కదిలించాయి. ప్రభుత్వం, దాని ఆధీనంలో ఉన్న మీడియా మాత్ర మే, ఆకస్మికంగా పెరుగుతున్న ఈ నిరసనల వెల్లువ చుట్టూ కట్టుకథలు అల్లుతున్నాయి. ఇకనైనా ఆపండి అని గట్టిగా, స్పష్టంగా చెప్పాలి. వీరు మన కొడుకులు, కూతుళ్లు, మన యువతీ యువకులు.

మోదీ ప్రభుత్వం చర్చలకు బదులుగా హింసను సర్వసాధారణంగా ప్రయోగిస్తుంది. రైతుల నుండి ఉద్యమకారుల వరకు ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. కానీ ఈ వారం, నిరంకుశ పాలనలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిన సున్నితత్వం లేని ప్రభుత్వం మరింత నీచ స్థాయికి దిగజారింది. మన భవిష్యత్ వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, ప్రభుత్వోద్యోగులు, పారిశ్రామికవేత్తలు, దేశనిర్మాతలను అర్థం చేసుకుని వారి పట్ల సానుభూతితో వ్యవహరించడానికి బదులుగా, వారిపై ప్రభుత్వ అణచివేత శక్తిని ప్రయోగించింది. దీనిని క్షమించలేము, మరచిపోలేము.ప్రతీ అసమ్మతిని దేశద్రోహంగా ముద్రవేసే పాత అస్త్రాన్ని, విద్యార్థి ఆందోళనపై బురద చల్లడానికి మళ్ళీ ప్రయోగించారు. నిరసనలకు ప్రేరణగా నిలిచిన తన విధానాలపై ఆత్మపరిశీలన చేసుకోవలసిన మోదీ ప్రభుత్వం, నిందలు వేయడానికి, కుట్ర సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి తన వద్ద ఉన్న అన్ని కుతంత్రాలను ప్రయోగించింది.

**ప్రభుత్వవిద్య పతనం**

ప్రభుత్వ విద్య విషయంలో మోదీ ప్రభుత్వం వెనకడుగు వేయటమే తొలి మౌలిక అంశం. ఈ ప్రభుత్వం తన మొత్తం బడ్జెట్‌లో పాఠశాల విద్యపై వెచ్చించే వాటాను 50 శాతం, ఉన్నత విద్యపై 33 శాతం తగ్గించింది. ఇంతటి అసంబద్ధమైన వెనకడుగులో ఎవరికైనా ఔచిత్యం కనిపిస్తుందా? గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం దాదాపు లక్ష ప్రభుత్వ పాఠశాలలను మూసివేయగా, 43,000 ప్రైవేట్ పాఠశాలల ప్రారంభాన్ని పర్యవేక్షించింది. వీటిలో అధిక భాగం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధర్వ్యంలో నడపబడుతున్నాయి. యాదృచ్ఛికంగా దాని అనుబంధ సంస్థలతో కలిసి భారతదేశంలో అతిపెద్ద ప్రైవేట్ పాఠశాలల నెట్‌వర్క్‌కు నేతృత్వం వహిస్తుంది. ఉన్నత విద్యారంగంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ విశ్వవిద్యాలయాలకు ఇచ్చే గ్రాంట్లను తగ్గించి, అధిక వడ్డీ రేట్లకు రుణాలు తీసుకునేలా వాటిని ప్రోత్సహించింది. వాటిని తిరిగి చెల్లించేందుకు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు తమ ఫీజులను పెంచే మార్గాన్ని ఎంచుకున్నాయి.

అత్యున్నత నాణ్యమైన, సరసమైన ప్రభుత్వ విద్య అందుబాటులో లేకపోవడంతో, భారతదేశంలోని కుటుంబాలు తమ పిల్లల చదువుల కోసం సొంతంగా డబ్బు ఖర్చు చేయవలసి వస్తోంది. కేవలం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) కోచింగ్‌పై కుటుంబాలు ఖర్చు చేసే మొత్తం, మోదీ ప్రభుత్వం ప్రభుత్వ విద్యపై మొత్తంగా పెట్టే పెట్టుబడికి సమానం. ప్రైవేట్ విద్యను అభ్యసించడానికి అయ్యే ఖర్చు, నిరుపేద కుటుంబాల నుండి వచ్చి అపారమైన సామర్థ్యం కలిగిన లక్షలాది ప్రతిభావంతులైన విద్యార్థులను నిరుత్సాహపరుస్తోంది. అయితే, అంతే కీలకమైన విషయం ఏమిటంటే, ఈ ఖర్చులు తీవ్రమైన భారాన్ని మన విద్యార్థులపై అసాధ్యమైనంత అధిక అంచనాలను మోపుతున్నాయి. తమ పిల్లల విద్యా, వృత్తిపరమైన విజయాలనే స్వప్నం కోసం వారి కుటుంబాలు ఎంతగా పెట్టుబడి పెట్టాయో భారతదేశ యువతకు బాగా తెలుసు. మన విద్యార్థులలోని ఈ తీవ్ర నిరాశకు విద్యారంగ ప్రైవేటీకరణ, వ్యాపారీకరణే ప్రత్యక్ష కారణం.



**విఫలమైన పరీక్షా వ్యవస్థ**

ఇక రెండవ అంశం, కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, రాజకీయీకరణ ప్రక్రియలకు గురైన భారతదేశ ప్రభుత్వ పరీక్షా వ్యవస్థ నిర్వీర్యం కావడం.విశ్వవిద్యాలయాలు, రాష్ట్రాలు తమ ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా సొంత పరీక్షలను నిర్వహించుకునే సాంప్రదాయ పద్ధతి స్థానంలో, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సియుఇటి) వంటి కేంద్రీకృత, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) నిర్వహించే పరీక్షలు వచ్చాయి. ఎన్‌టిఎ అనేది ఒక అసమర్థమైన, దీర్ఘకాలంగా సిబ్బంది కొరతతో బాధపడుతున్న సంస్థ. ఇది తన పరీక్షలను నిర్వహించడానికి పూర్తిగా ప్రైవేట్ కాంట్రాక్టర్ల సైన్యంపై ఆధారపడుతుంది. ఎన్‌టిఎ నియమించిన ప్రశ్నపత్రాల రూపకర్తలు, అనువాదకులు, నిపుణులు భారతదేశంలోని ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన ప్రఖ్యాత విద్యావేత్తలు కాదని, చాలావరకు రాజకీయ అనుబంధం కలిగిన సాధారణ వ్యక్తులేనని అందరికీ తెలిసిన విషయమే. ఈ ప్రక్రియ తుది ఫలితం తీవ్రమైన పరిణామాలకు దారితీసింది. గత 12 ఏళ్ళలో దేశవ్యాప్తంగా 152 పేపర్ లీకులు జరిగాయి. వాటిలో 2017లో ఎన్‌టిఎ ఏర్పడిన నాటి నుంచి స్వయంగా తొమ్మిది పేపర్‌లను లీక్ చేసింది. అధికారులు తమ నేరపూరిత చర్యలకు ఎలాంటి తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోకుండా, పరీక్షా విధానం నుండి లాభాలు గడించాలనే మార్గం ఎంచుకుంటున్నందున, అత్యంత ప్రతిభావంతులైన, కష్టపడి చదివే విద్యార్థులు కూడా విఫలమవుతున్నారు.

మూడవ అంశం, భారతదేశ విద్యా వ్యవస్థలో విజయం సాధించడం కష్టంగా ఉండటం. ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న గుత్తాధిపత్యం కారణంగా, పట్టభద్రులైన తర్వాత అత్యంత నాణ్యమైన, మంచి జీతాలు ఇచ్చే ఉద్యోగ అవకాశాలు నేడు అరుదుగా లభిస్తున్నాయి. మన యువ పట్టభద్రులలో నిరుద్యోగ రేటు నిలకడగా అధికంగా ఉంటోంది. గత కొన్ని సంవత్సరాలుగా ఇది సగటున సుమారు 40 శాతంగా ఉంది. మిగిలిన కొన్ని ఉద్యోగాల కోసం పోటీ తీవ్రంగా ఉంది. వాటికోసం పోటీ పడటానికి మన విద్యార్థులు గతంలో మాదిరిగా సన్నద్ధంగా లేరు. పక్షపాత విధేయత ఆధారంగా ఎంపిక చేసిన అసమర్థ వైస్‌ఛాన్సలర్‌ల నియామకం, దాని పర్యవసానంగా రాజకీయ సంబంధాలు కలిగిన అర్హత లేని అధ్యాపకులను నియమించుకోవడం మన ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో బోధన సంక్షోభాన్ని సృష్టించింది. పని ప్రదేశంలో నైపుణ్య అవసరాలు మరింత సవాలుగా మారిన తరుణంలో, భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థ కాలం చెల్లిన పద్ధతులకు, రాజకీయ ప్రేరేపిత పాఠ్యప్రణాళిక మార్పులకు కట్టుబడి ఉంది. ఇది అభివృద్ధి చెందుతున్న పద్ధతులు, ప్రమాణాలకు ప్రమాదకరంగా దూరంగా ఉండి, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ప్రపంచం వేగాన్ని అందుకోలేకపోతుంది. విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సవాళ్లతో నిండిన, రోజురోజుకు పెరుగుతున్న డిమాండ్ ఉన్న వ్యవస్థలో విజయం సాధించడానికి ప్రయత్నిస్తున్నారు.ఇందుకు తగినంత వనరులు లేకపోవడమే కారణం.

కాబట్టి విద్యా వ్యవస్థ రోజురోజుకు ఖరీదైనదిగా, అవినీతికి ఆస్కారం ఉన్నదిగా, అందులో విజయం సాధించడం కష్టంగా మారిపోతోంది. కానీ, జవాబుదారీతనం నుండి తప్పించుకుంటూ, విద్యపై చిత్తశుద్ధితో కూడిన చర్చలను నివారించే మోదీ ప్రభుత్వ స్థిరమైన, ఉద్దేశపూర్వక విధానమే దీనికి చివరి దెబ్బగా నిలిచింది. ఏకాభిప్రాయం కోరకుండా లేదా పార్లమెంటరీ చర్చలకు పెట్టకుండా జాతీయ విద్యా విధానం – 2020 ను ఉద్దేశపూర్వకంగా ఆమోదించింది. ఎన్‌టిఎను అసలు పార్లమెంటు ముందుకు తీసుకురాలేదు. ఎలాంటి జవాబుదారీ యంత్రాంగాలు లేకుండా కేంద్ర మంత్రివర్గం ఏర్పాటు చేసిన ఒక సొసైటీగానే మిగిలిపోయింది. ఎన్‌టిఎను బలోపేతం చేయాలన్న విద్యపై పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సులలో ప్రతిపక్ష సభ్యులు ఉన్నారనే ఏకైక కారణంతో, ఆ సిఫార్సులను బహిరంగంగా తోసిపుచ్చడం ద్వారా విద్యాశాఖ మంత్రి జవాబుదారీతనం పట్ల తనకున్న ధిక్కారాన్ని నిస్సిగ్గు గా ప్రదర్శించారు. ఇన్ని ఘోర వైఫల్యాలు ఎదురైనా పదవికి రాజీనామా చేయడానికి ఆయన ఇష్టపడకపోవడం ప్రజాభిప్రాయాన్ని మరింత రెచ్చగొట్టింది.

**నిరసన మూలాలు**

పరస్పర సంబంధిత శక్తుల సహజ పర్యవసానమే విద్యార్థుల నిరసనలు. అవి నిరాశను మాత్రమే రేకెత్తించే నేటి నిరాశాజనకమైన విద్యా వాతావరణం, మోదీ ప్రభుత్వానికి అలవాటైన అహంకారం, జవాబుదారీతనం లేదా నిర్మాణాత్మక వైఖరి లేకపోవడం. విద్యార్థి నిరసనకారులపై కేంద్ర హోం మంత్రి ప్రత్యక్ష అజమాయిషీ కింద పనిచేస్తున్న పోలీసు సిబ్బంది ప్రదర్శించిన క్రూరత్వం ఈ ప్రభుత్వ హయాంలో కొత్తేమీ కాదు. 2020లో పౌరసత్వ (సవరణ) చట్టం – జాతీయ పౌర పట్టిక నిరసనల సమయంలో సాయుధ పోలీసులు, పారామిలిటరీ బలగాలు విశ్వవిద్యాలయ ప్రాంగణాలపై ఎలా విరుచుకుపడ్డాయో మనందరికీ స్పష్టంగా గుర్తుంది. భారతదేశ మహిళా రెజ్లర్లపై జరిగిన ఆమోదయోగ్యం కాని దురాగతాలు మన స్మృతుల నుంచి ఎప్పటికీ చెరిపివేయలేము.

మోదీ ప్రభుత్వం భారతదేశ విద్యారంగాన్ని దిగజార్చడమే కాకుండా, శిక్షలపై భయం లేనితనంతో, అపారమైన స్వీయ భ్రమలతో, అత్యంత సున్నితత్వం లేకుండా వ్యవహరించడాన్ని అలవాటుగా మార్చుకుంది. భారతదేశ విద్యార్థులు మోదీ ప్రభుత్వ బూటకపుతనాన్ని బట్టబయలు చేశారు. వారికి అండగా నిలబడి, వారి భవిష్యత్తును కాపాడటం మన నైతిక, రాజకీయ, రాజ్యాంగపరమైన బాధ్యత.

(ది హిందూ – తేదీ: 24/7/2026)

# నిర్మాణం బదులు కూల్చివేత బిజెపి అభివృద్ధి



రాం పునియానీ

ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో జౌహర్ యూనివర్శిటీముందు ప్రస్తుతం బైఠాయింపు ఆందోళన జరుగుతోంది. ప్రస్తుతం జైల్లో ఉన్న సమాజ్‌వాదిపార్టీ సభ్యుడు ఆజంఖాన్ ఆ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ట్రస్టు చైర్మన్. యూనివర్శిటీకి చెందిన 40లో 38 భవనాలను కూల్చివేయాలని కోరుతూ రాంపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ జారీచేసిన నోటీసును విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. అది యూనివర్శిటీని మూసివేయటంతో సమానం.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (జులై 20, 2026) ప్రచురించిన వార్తలో, యూనివర్శిటీ లా విద్యార్థి మెహ్‌రోజాఖాన్ ఇలా చెప్పారుః"మా వృత్తి జీవితం, భవిష్యత్ ప్రమాదంలో పడ్డాయి. యూనివర్శిటీని కూల్చివేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరుతూ మేము ఈ బైఠాయింపు జరుపుతున్నాం. మేము ఇతర ప్రదేశాల్లో – కాలేజీలు బహుదూరంలో ఉన్నందున మా చదువులు కొనసాగించలేము. ఇక్కడ ఫీజు రాయితీ పొందటం పెద్ద విషయం. ఎస్‌సి/ఎస్‌టి విద్యార్థులు 50 శాతం రాయితీ పొందుతున్నారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులు కూడా రాయితీ పొందుతున్నారు. ఇక్కడ బి.ఫార్మా, డి.ఫార్మా వంటి కోర్సులున్నాయి, మాలో చాలా మంది వాటిని వేరేచోట చదవటం సాధ్యంకాదు."

రాంపూర్‌లో మహమ్మద్ అలీ జౌహర్ యూనివర్శిటీకి 2006 సెప్టెంబర్ 18న శంకుస్థాపన జరిగింది. మహమ్మద్ అలీ జౌహర్ ట్రస్టు అనేక సంవత్సరాలలో క్యాంపస్ అభివృద్ధి చేసింది. అయితే వివిధ భవనాల కచ్చితమైన నిర్మాణ సమయం తీవ్రమైన లీగల్, అడ్మినిస్ట్రేటివ్ వివాదానికి గురైనాయి.

రాంపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్‌డిఎ) ప్రకారం, యూనివర్శిటీ మెడికల్ కాలేజీ, ఒక అకడమిక్ బ్లాక్‌లకు మాత్రమే చెల్లుబాటైన, ఆమోదం పొందిన ప్రణాళికలున్నాయి; క్యాంపస్‌లోని మిగతా 38 భవనాలను అర్హతగల పౌర పాలనాధికార సంస్థనుండి అనుమతులు లేకుండా నిర్మించారు. అయితే యూనివర్శిటీ అడ్మినిస్ట్రేషన్ వాదన ఏమంటే — అనేక సంవత్సరాల క్రితం నిర్మించబడిన ఈ భవనాల ప్రదేశం వాటి నిర్మాణకాలంలో (సింగన్‌ఖెరాగ్రామం) ఆర్‌డిఎ అధికార పరిధిలో లేదు; అప్పుడు స్థానిక జిల్లా పంచాయత్ అనుమతులు ఇచ్చింది.

ఈ 38 భవనాలు అనుమతులు లేని నిర్మాణాలు, భూ వినియోగ ఉల్లంఘనలకు ఒడిగట్టి నిర్మించినవీ అయినందున వాటి తొలగింపు లేదా కూల్చివేతకు ఉత్తర్వు చేసినట్లు ఆర్‌డిఎ చెబుతోంది. కాగా వివిధ తరగతుల విద్యార్థులకు, ముఖ్యంగా ముస్లింలు, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు విలువైన సేవ చేస్తున్నందున యూనివర్శిటీ భవనాల కూల్చివేత వాంఛనీయం కాదని విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయనాయకులు వాదిస్తున్నారు. ముఖ్యంగా ముస్లింల విద్యను దెబ్బతీయటమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని వారంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అలక్ష్యం చేసిన రంగాల్లో విద్య ఒకటి. ప్రస్తుత విద్యార్థి – యువజన ఆందోళన చెబుతున్నది ఇదే. మైనారిటీ విద్యాసంస్థలకు ప్రభుత్వం మరిన్ని ఆటంకాలు కలిగిస్తోంది.

మరో అంశం – కట్టడాల కూల్చివేతలు ముస్లిం అస్థిత్వంతో ముడిపడి ఉన్నాయి. కాశీ, మథుర, సంభాల్, అజ్మీర్ దర్గా, సహరాన్‌పూర్ మసీదుల కూల్చివేతలు ఇప్పటికే వరుసలో ఉన్నందున ఆ వరుసలో తాజా లక్ష్యం జౌహర్ యూనివర్శిటీ. కమాల్ మౌలా మసీదు వాగ్దేవి దేవాలయం అంటూ ఆ ప్రదేశాన్ని ఇటీవల హిందూ పక్షానికి అప్పగించటం చూశాం. ఇతర మసీదులు బాబ్రీమసీదు మార్గంలో కూల్చివేత ప్రమాదం ఎదుర్కొంటున్నాయి.

రామజన్మభూమి ఉద్యమకాలంలో ఉపయోగించిన ఎత్తుగడలనే ఈ క్లెయిమ్‌లలో వాడుతున్నారు. అవి రాజకీయ, మత లక్ష్యాల కోసం మధ్యయుగాల చరిత్రను ఆయుధంగా మార్చటం. మధ్యయుగాల్లో దేవాలయాలను కూల్చి మసీదులు నిర్మించారనే తప్పు ప్రాతిపదికలనే ఉపయోగిస్తున్నారు. ఈ వాదనలను న్యాయస్థానాలు అనుమతించటం 1991లో పార్లమెంటు ఆమోదించిన 'ఆరాధనా ప్రదేశాల (ప్రత్యేక నిబంధనలు) చట్టాన్ని నేరుగా సవాలుచేయటమే. బాబ్రీ మసీదు కేసు మినహా మిగతా మత ప్రదేశాలకు 1947 ఆగస్టు 15న ఉన్న స్థితిని పరిరక్షించేందుకు ఆ చట్టం ఉద్దేశించింది. 1992 డిసెంబర్ 6న బాబ్రీమసీదు కూల్చివేత బిజెపి పలుకుబడి అమాంతం పెరుగుదలకు, కేంద్రంలో తొలుత 1996లో, తిరిగి 1999లో, అటు తర్వాత 2014 నుంచి అది అధికారంలోకి రావటానికి తోడ్పడింది. ఇది తెచ్చిన మత విభజన హిందూ జాతీయవాదం బలపడేందుకు బాటవేసింది. హిందూ మితవాద మేధావులు ఇప్పుడు ఒక యూనివర్శిటీ కూల్చివేతకు ఎసరుపెట్టారు. ఈ ప్రతిపాదిత కూల్చివేత అదనపు ప్రయోజనం చేకూర్చుతుంది. అది ముస్లిం సమాజాన్ని అప్రతిష్టపాల్జేయటం, వారికి అత్యావశ్యకమైన విద్యను దూరం చేయటం.

ఇదే పద్ధతిలో సహరాన్‌పూర్‌లో కొద్దిపాటి స్థలంలో ఉన్న ఒక పురాతన మసీదుకు కూడా – తగిన అనుమతులు లేవనే కారణంతో ఖాళీ చేయాలని నోటీసులిచ్చారు. అక్రమ నిర్మాణాలని ముస్లిం కట్టడాలకు ముద్రవేయటం, కూల్చివేయటం నిరంతర ప్రయత్నంగా కొనసాగుతున్నది. నిర్దాక్షిణ్యంగా బుల్‌డోజర్లు ఉపయోగించటం, సమాజంలో మరింత ప్రజాదరణ సంపాదించటం ముస్లిం సమాజాన్ని మూలకు నెట్టటానికి సాధనంగా ఉపయోగిస్తున్నారు. కూల్చివేతలే వారి 'దేశ నిర్మాణం'గా కనిపిస్తున్నది.

# ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి



● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్లను కుట్టించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని, దీనిపై జిల్లా, మండల స్థాయి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షించాలని ఆయా జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. 'స్కూల్ యూనిఫామ్ల తయారీ, పంపిణీ, ఎల్నినో' నేపథ్యంలో చేపట్టిన ప్రత్యామ్నాయ ప్రణాళికపై హైదరాబాద్లోని సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐఎండి నివేదికల ప్రకారం దేశంలోనే ఎల్నినో ప్రభావం అధికంగా ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ రాష్ట్రం ఒకటని, ఇప్పటి వరకు రాష్ట్రంలో 27 శాతం లోటు వర్షపాతం నమోదైందని అధికారులు వివరించారు. కేవలం 7 జిల్లాలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైందని, మిగతా 385 మండల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని అధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్జాజుకు వివరించారు. వాతావరణ వివరాలను రైతులకు ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా సమాచారం అందిస్తున్నామని, కర్నాటక, మహారాష్ట్రలలో కూడా వర్షాలు ఆశాజనకంగా లేవని, ప్రస్తుతం మేజర్ రిజర్వాయర్లలో ఉన్న నీటిని తాగునీటికి నిల్వ చేస్తున్నామని వారు తెలిపారు. వరి మినహా ఇతర ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించే విధంగా చూడాలని అధికారులకు సంజయ్జాజు సూచించారు. ఇప్పటివరకు వరి సాగు 24 శాతం కంటే తక్కువ నమోదైందన్నారు. సెప్టెంబర్ మాసంలోనూ వర్షాలు అతి తక్కువగా ఉంటాయని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసిందని, అందుకే వరి పంటకు బదులుగా ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించే విధంగా వాటి ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లభిస్తునే విషయాన్ని రైతులను చైతన్య పర్చాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత సీజన్లో ఫామ్ పాండ్స్ల నిర్మాణం విస్తృతంగా చేపట్టాలన్నారు. ప్రతీ 45 రోజులకు ఒక సారి ఖచ్చితంగా మండల సమావేశాలను నిర్వహించే విధంగా సంబంధిత అధికారులు ప్రణాళికలను రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్లను సంజయ్జాజు ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్ళు, రెసిడెన్షియల్ పాఠశాలలోని ప్రతి విద్యార్థికీ రెండు యూనిఫాముల చొప్పున నెలరోజుల్లోగా యూనిఫాములను అందజేయాలని ఆదేశించారు. యూనిఫామ్లను కుట్టించడానికి 26 వేలమంది స్వయం సహాయక బృందాల మహిళలను గుర్తించామని అధికారులు సిఎస్కు వివరించారు. స్కూల్ యూనిఫామ్ల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని, విద్యార్థులకు అందిన స్కూల్ డ్రెస్లు, షూస్ తదితర స్కూల్ కిట్స్ల నాణ్యతపై నేరుగా పాఠశాల విద్యార్థుల నుండే ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సిఎం ఆదేశించిన విషయాన్ని సంజయ్ జాజు గుర్తుచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్, దానకిషోర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపీ, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ దివ్య, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ పాల్గొన్నారు.

# దేశాన్ని కాపాడేందుకు కాంగ్రెస్తో కలిసి పని చేస్తాం

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
● పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా :ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు
● వరంగల్లో ఘనంగా ఎబి బర్ధన్ భవనం ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/వరంగల్ :** దేశాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం వరంగల్ నగరంలోని మార్కండేయ నగర్లో నిర్మించిన సిపిఐ కార్యాలయం ఏబీ బర్ధన్ భవనాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశాన్ని మతోన్మాద శక్తుల నుండి, కార్పొరేట్ అనుకూల పాలకుల నుండి కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. నేడు అవినీతి, అసమర్థ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశ యువతరం గళం విప్పుతున్నదని, డిల్లీలో నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ రోజుల తరబడి విద్యార్థి, యువకుల ఆందోళనే ఇందుకు నిదర్శనం అని అన్నారు. కేంద్రంలోని అసమర్థ మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పోరాడుతాయని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్న భూములలో పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ మహానగరంలో అనేకమంది భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని వ్యాపారం చేస్తూ చలామనవుతున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిలువ నీడ లేని నిరుపేదలు కిరాయి కట్టలేక ప్రభుత్వ భూములు చెరువులలో గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తుంటే పేదల ఇండ్లను కూల్చివేయడం సరికాదని వారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు ఇస్తామని చెప్తున్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పేదల ఇండ్లను కూల్చడం సరికాదని, తక్షణమే పేదల ఇండ్ల కూల్చివేతను ఆపాలని పేదలు వేసుకున్న ఇళ్లకు ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మాట్లాడుతూ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదేనని, పేదల ఇండ్ల కూల్చివేతను ఆపడం కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం పదిలంగా ఉంటుందని, ఎరుపుకు మరణం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ లు ఐక్యంగా ముందుకు సాగుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయని తెలిపారు మార్కండేయ నగర్ శాఖ కార్యదర్శి ఎండి అక్బర్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్.కె బాస్ మియా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి విజయ్ సారధి, కర్రె బిక్షపతి, నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, తోట బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, పనాస ప్రసాద్ పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు

● మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహిస్తున్న శాంతియుత నిరసనకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల్లో పాల్గొనవద్దంటూ జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్యు) యాజమాన్యం అడ్వైజరీ జారీ చేయడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని, గత 20 రోజులుగా విద్యార్థులు తమకు జరిగిన అన్యాయంపై న్యాయం కోరుతూ ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా స్పందించడం లేదని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. అలాగే ఈ వ్యవహారంతో తీవ్ర మనోవేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఎక్స్గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని కోరారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఉద్యమకారులపై నమోదు చేసిన కేసులను వెంట నే ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం, వారికి న్యాయం జరిగేలా లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేపడుతున్న ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి, నీట్ పేపర్ లీకేజీ బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

# బాధ్యులపై కేంద్రం తక్షణమే కఠిన చర్యలు

● టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున నష్ట పరిహారాన్ని ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'నీట్ పరీక్ష'లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ఢిల్లీలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీని ఖండిస్తూ టిజెఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్, లిబర్టీలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో, ప్రాణాలతో చెలగాటమాడుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని తక్షణమే రద్దు చేసి, పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై క్రూరంగా లాఠీచార్జి చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల పోరాటానికి సంఘీభావం తెలుపుతూ టిజెఎస్ ప్రతినిధి బృందం శనివారం ఢిల్లీలోని జంతర్మంతర్లో జరుగుతున్న నిరసనలో పాల్గొని, తమ మద్దతును ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు ప్రొఫెసర్ పి.ఎల్ విశ్వేశ్వర రావు, సయ్యద్ సలీమ్ పాషా, మాసంపల్లి అరుణ్ కుమార్, అంబటి శ్రీనివాస్, ధర్మార్జున్, బైరి రమేష్, నిజ్జన రమేష్ ముదిరాజ్, ఆశప్ప, పల్లె వినయ్ కుమార్, టీజేఏస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.


# పాత్రికేయులపై దాడులను ఖండించిన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్

● సుమోటోగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయవ్యవస్థకు విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జంతర్మంతర్లో కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనల సందర్భంగా పాత్రికేయులపై జరిగిన దాడులు, బెదిరింపులు, అధిక బలప్రయోగాన్ని ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్యంలో వార్తలను కవర్ చేస్తున్న జర్నలిస్టులపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమని పేర్కొంటూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.
ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను కవర్ చేస్తున్న టివి రిపోర్టర్లు, ఫీల్డ్ జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఫెడరేషన్ అధ్యక్షుడు గౌతమ్ లహిరి, ప్రధాన కార్యదర్శి సౌరభ్ దుగ్గల్ తెలిపారు. ఫీల్డ్ విధులు నిర్వహిస్తున్న రిపోర్టర్లను సంపాదకీయ విధానాలకు బాధ్యులుగా చూడటం సరికాదని, మీడియా సంస్థల యాజమాన్యాలు కూడా తమ ఫీల్డ్ రిపోర్టర్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఎఎఫ్) నిరసనకారులు, జర్నలిస్టులపై షాక్ బాటన్లు, పెల్లెట్ గన్స్, మేకులతో కూడిన బాటన్లను ఉపయోగించడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. ఈ ఘటనల్లో ఔట్లుక్ మ్యాగజైన్కు చెందిన ఒక జర్నలిస్టు పెల్లెట్ గాయాలకు గురైనట్లు ప్రకటనలో వెల్లడించారు. అలాగే, సంఘటనల సమయంలో కొందరు ఆర్ఏఎఫ్, ఢిల్లీ పోలీసు సిబ్బంది తమ నేమ్ బ్యాడ్జ్లు తొలగించుకున్నట్లు వీడియోలు, ఫోటోలు సూచిస్తున్నాయని, ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని ఫెడరేషన్ పేర్కొంది. జూలై 20న ఢిల్లీలో జరిగిన ఘటనల్లో పలువురు జర్నలిస్టులు గాయపడిన నేపథ్యంలో, న్యాయవ్యవస్థ స్వయంప్రేరితంగా (సుయో మోటో) కేసు నమోదు చేసి, స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశాలు ఇవ్వాలని, బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ తన ప్రకటనలో డిమాండ్ చేసింది.

# ధర్నాచౌక్ను ఎత్తేసిన బిఆర్ఎస్కు అక్కడ ధర్నా చేసే హక్కు ఎక్కడిది?


● కెటిఆర్ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలి: టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ధర్నా చౌక్ను ఎత్తివేసిన చరిత్ర బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, ఇప్పుడు అదే పార్టీ ధర్నాల పేరుతో రాజకీయాలు చేయడం విడ్డూరమని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. గాంధీ భవన్లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముందుగా కెటిఆర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ధర్నా చేసే హక్కు గురించి మాట్లాడే ముందు ధర్నా చౌక్ను తొలగించిన విషయాన్ని కెటిఆర్ గుర్తు చేసుకోవాలని, అక్కడ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రస్తుతం ధర్నా చౌక్లో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు ఎలా జరుగుతున్నాయో కెటిఆర్ అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ వయసులోనూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విద్యార్థుల పక్షాన పోరాడుతుంటే, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మాత్రం ఫామ్హౌస్కే పరిమితమయ్యారని విమర్శించారు. బిఆర్ఎస్ పాలనలో ప్రశ్నాపత్రాల లీకుల పరంపర సాగిందని, ఒక్క నోటిఫికేషన్ను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయారని ఆరోపించారు. గ్రూప్1 పరీక్షలు కూడా లీకుల బారిన పడ్డాయని అన్నారు. బిఆర్ఎస్ రాజకీయ డ్రామాల్లో విద్యార్థులు భాగస్వాములు కావద్దని మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# ధర్మేంద్ర క్షమాపణ చెప్పారు

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేపర్ లీక్ వెలుగులోకి వచ్చిన వెంటనే సిబిఐ 11 మంది ఫ్యాకల్టీతో సహా మొత్తం 17 మందిని అరెస్టు చేసిందని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణలు చెప్పి సిబిఐకి స్వయంగా లేఖ రాశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా 40 రోజుల్లోనే పరీక్ష నిర్వహించి ఫలితాలు ప్రకటించామని, రేపటి నుంచి కౌన్సెలింగ్ కూడా ప్రారంభం కానుందన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుందని, ఈ అంశాన్ని రాజకీయం చేస్తూ విద్యార్థుల ముసుగులో కొందరు అసాంఘిక శక్తులు ఢిల్లీలో అల్లర్లు సృష్టించాయన్నారు. ఈ అలజడికి పాకిస్తాన్కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను ఢిల్లీ పోలీసులు బ్లాక్ చేశారని, దేశవ్యతిరేక శక్తుల హస్తం ఉందని అనుమానిస్తున్నామని చెప్పారు. గత యుపిఎ హయాంలో, అలాగే రాజస్థాన్, పంజాబ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో అనేకసార్లు పేపర్ లీకేజీలు జరిగినా అక్కడి సిఎంలు ఎవరూ రాజీనామా చేయలేదని, మరి ఇప్పుడు మాత్రం ప్రధానిని రాజీనామా అడగడం ద్వంద్వ ప్రమాణాలేనని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, పాల్వాయి హరీష్ బాబు, అంజి రెడ్డి, ఎమ్మెల్సీలు మల్కా కొమురయ్య, వేముల అశోక్ పాల్గొన్నారు.

# మోదీ ఎందుకు నోరు విప్పడం లేదు

● బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ పరీక్ష పేపర్ లీక్ విషయంలో విశ్వగురువుగా చెప్పుకునే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎందుకు నోరు విప్పడం లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ప్రశ్నించారు. విద్యార్థుల డిమాండ్ మేరకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్తో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపినట్టు చెప్పుకునే వాళ్లు పిల్లల కన్నీళ్లు ఆపలేరా?, ఆ పిల్లలపై జరుగుతున్న దాడిని ఆపలేరా అని అన్నారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టికానికి నిరసనగా విద్యార్థులకు సంఘీభావంగా బిఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్లోని ఇందిరా పార్కులో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ మంత్రులు జి.జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, వి.శ్రీనివాస్గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని, విద్యార్థులపై చేసిన దాష్టికానికి అక్రమ కేసుల నమోదుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతరాన్ని తీవ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్తానీలు అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. యువత ఆందోళన, ఆగ్రహం కేవలం ఒక పేపర్ లీక్ అంశానికే సంబంధించింది కాదని, 12 ఏళ్లుగా కేంద్రప్రభుత్వం చేస్తున్న మోసాలు, ద్రోహాలపైన ఆగ్రహమని అన్నారు. అసలు పని చేయకుండా కేవలం మతం పేరుతో తప్పించుకుంటున్న తీరును యువతరం అర్థం చేసుకున్నదన్నారు. దేశంలో కేంద్రమంత్రుల కొడుకులు అత్యాచారాలకు పాల్పడితే వెంటనే బెయిల్ వస్తున్నాయని, పేపర్ లీకులపై ఎంత అడిగినా సమాధానం మాత్రం ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఎవరితోనైతే పెట్టుకోకూడదో వారితోనే(యువత) ప్రధాని మోదీ పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ జాగ్రత్త పడాలని, దేశ వ్యాప్తంగా యువత స్వరం మారుతున్నదని, ఇక రాజ్యం ఉలికి పడాల్సిందేనని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ, 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేనందుకే యువతరం బయటికి వచ్చిందన్నారు.
మేకిన్ ఇండియా కావాలని అడిగితే, బిజెపి మాత్రం 'లీక్ ఇన్ ఇండియా'ను ఇచ్చిందని ఎద్దేవా చేశారు. అంబేడ్కర్ స్ఫూర్తితో పోరా టం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ పార్టీగా తాము విద్యార్థుల ఉద్యమానికి అండగా ఉండాలని అనుకున్నామన్నారు. రాజకీయ పార్టీల జెండాలు, ఎజెండాలతో విద్యార్థులు, యువత ఉద్యమాన్ని కలుషితం చేయవద్దని సూచించారు. విద్యార్థులు అడిగిన దాంట్లో అన్యాయం ఏముందని?, వారు కేవలం తమకు న్యాయం చేయాలని, తమ భవిష్యత్తును కాపాడాలని మాత్రమే అడిగారని అన్నారు. నీట్ పరీక్షా పత్రం పేపర్ లీక్తో పాటు విద్యారంగంలో సంస్కరణ రావాలని సోనమ్ వాంగ్చుక్ నిరసనకు కూర్చున్నారని కెటిఆర్ గుర్తు చేశారు. ప్రధాని మోదీని ప్రశ్నిస్తే యూత్ కాంగ్రెస్ను ఎందుకు పంపించి తనను అడ్డుకుంటున్నారో సిఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.



# 'నీట్' విద్యార్థులకు న్యాయం చేయాలి

● ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, అవకతవకలకు వ్యతిరేకంగా ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన అన్నారు. తెలంగాణ హైకోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ, తమ భవిష్యత్తు, విద్యా హక్కుల పరిరక్షణ కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి గళాన్ని అణచివేయడానికి పోలీసు బలగాలను వినియోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. నీట్ పరీక్ష వ్యవస్థలో పూర్తి పారదర్శకత, సమాన అవకాశాలు కల్పించాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ను దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థి సంఘాలు, న్యాయవాదులు ఖండిస్తున్నారని తెలిపారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జ్ ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్య హక్కు కోసం పోరాడుతున్న విద్యార్థులకు న్యాయవాదులు, ప్రజాస్వామ్య శక్తులు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని బొమ్మగాని ప్రభాకర్ స్పష్టం చేశారు.

# సింగరేణి భవిష్యత్కు ప్రభుత్వం అండ

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని సంస్థ భవిష్యత్ కోసం ప్రభుత్వ సంపూర్ణ సహకారం అందుతుందని ఉప ముఖ్యమంత్రి మలు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి కాలరీస్, టిఎస్ జెన్కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థను కాపాడుకోవడం, లాభాల బాటలో నడిపించుకోవడం పోటీ ప్రపంచంలో మరింత బలోపేతం చేయడం అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం అధికారులు ఉద్యోగులు కార్మికులు యాజమాన్య సమిష్టి బాధ్యతని భట్టి అన్నారు. తెలంగాణకు సింగరేణి ఆత్మవంటిదని, 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ సంస్థను కాలానుగుణంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒకప్పుడు బొగ్గు ఉత్పత్తి రంగంలో సింగరేణిదే ఏక ఛత్రాదిపత్యమని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని అమలు చేయడంతో అనేక ప్రైవేటు సంస్థలు రంగంలోకి రావడంతోనే పోటీ తీవ్రంగా పెరిగిందన్నారు. గత దశాబ్ద కాలంలో ఆశించిన పురోగతి లేదని, యాదాద్రి, భద్రాద్రి తదితర థర్మల్ విద్యుత్ కేంద్రాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్తబొగ్గు బ్లాకులను గుర్తించి వేగంగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే 20 ఏళ్లలో ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకోనున్న నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గుకే పరిమితం కాకుండా థర్మల్ పవర్, సోలార్ గ్రీన్ హైడ్రోజన్ బ్యాటరీ స్టోరేజ్ గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో కూడా విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇకపై సింగరేణి బోర్డు సమావేశాలు కేవలం పరిపాలనా అంశాలకు పరిమితం కాకుండా సంస్థ విస్తరణ పెట్టుబడులు సాంకేతిక ఆధునీకరణ అభివృద్ధిపై చర్చించే వ్యూహంగా మారాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సిసిఎల్ చైర్మన్ బుద్ధ ప్రకాష్ జ్యోతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి బొగ్గు ఉత్పత్తి కొత్తగనుల అభివృద్ధి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు ఆధునిక సాంకేతికత వినియోగం ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలు భవిష్యత్ కార్యాచరణ సంస్థ దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్ అంకిత్ వైరా ఎమ్మెల్యే రామ్దాస్ నాయక్, ఎస్సిసిఎల్ డైరెక్టర్ గౌతం పోట్రు, టిఎస్ జెన్కో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్, జనరల్ మేనేజర్లు డైరెక్టర్లు పాల్గొన్నారు.


**వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయము, పెద్దపల్లి**
**జిల్లా : పెద్దపల్లి - 505172**

లేఖ నెం.వ్య.మా.క /పెద్దపల్లి /02/2024-25 | దుకాణా సముదాయం టెండర్ ప్రకటన | తేది: 23.07.2026

ఇందు మూలముగా పెద్దపల్లి పట్టణ వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా, వ్యవసాయ మార్కెట్ కమిటి, పెద్దపల్లి యార్డ్ నందు నిర్మించబడిన మొత్తం (13) వాణిజ్య దుకాణములను రిజర్వేషన్ ప్రాతిపాదికన అద్దె పై BC లకు (02), SC లకు (2) ST లకు (1) మరియు ఇతరులకు (7) దుకాణములను తేది : 03.08.2026 రోజున ఉదయం 11.00 గంటలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ పెద్దపల్లి నందు ఓపెన్ ఆక్షన్ (Open Auction) ద్వారా కేటాయించుటకు వేలం నిర్వహించబడును.
1. ఒక్కొక్క వాణిజ్య దుకాణముకు ప్రభుత్వం నిర్ణయించిన ధర నెలకి అద్దె **రూ.15462/-**
2. దరఖాస్తు ఫారాల అమ్మకము తేది : 25.07.2026 నుండి 31.07.2026 వరకు
3. దరఖాస్తు ఫారాల స్వీకరణ తేది : 26.07.2026 నుండి 31.07.2026 వరకు మాత్రమే

దరఖాస్తు ఫారము మరియు నియమ నిభందనల కొరకు రూ.3,000/- చెల్లించి సంబందిత కార్యాలయ పనివేళలలో పొందవచ్చును ఇతర సమాచారం కొరకు Mobile. No. 7330733468, 7330733318కు సంప్రదించగలరు.
*గమనిక :- 1. దరఖాస్తు ఫారము రూ.3,000/- తిరిగి చెల్లించబడవు.*
*2. వేలం పాట ప్రారంభ ధర రూ.15462/-*

సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి,
వ్యవసాయ మార్కెట్ కమిటి,
పెద్దపల్లి.

DIPR R.O. No. : 6626-PP/CL/ADVT/2026-27, Date: 24-07-2026



**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

| క్ర.సం. | NIT No. | పని పేరు | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 1 | NIQ No. 01/ EE/CIR-32/ GZ/GHMC/ 2026-27, Date: 23.07.2026 | వివిధ ఏజెన్సీలు/ సంస్థలు/ సరఫరాదారుల నుండి(Non-SOR అంశాలకుసంబంధించి) సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించడమైనవి. (మరిన్ని వివరాలను https://ghmc.gov.in/Tenderspage.aspx లోని టెండర్ నోటిఫికేషన్లలో చూడవచ్చు). | ప్రారంభ తేది: 24.07.2026 ఉ.11:00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 30.07.2026 మ.3:00గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, సర్కిల్-32, జిజెడ్, ఖైరతాబాద్ జోన్. సెల్ నెం. 9989930651 |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
సర్కిల్-32, జిజెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 6630-PP/CL/ADVT/2026-27, Date: 24-07-2026

## ద్విచక్ర వాహనాలు ఢీకొని విద్యార్థి మృతి



ప్రజాపక్షం/జమ్మికుంట: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన రావికంటి సుజల్ (18) అనే విద్యార్థి తన స్నేహితుడు అబ్బడి అశ్వితోతో కలిసి గురువారం రాత్రి జగ్గయ్యపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ తరుణంలో రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొనడంతో సుజల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన బాధితున్ని హన్మకొండ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుని తండ్రి రావికంటి వినయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

## సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్ సర్కార్ కక్ష

### స్టేడియం అభివృద్ధికి 11 కోట్లు కేటాయించినా అర్థాంతంగా పనులు నిలిపివేసిన కాంగ్రెస్ :మాజీ మంత్రి హరీష్‌రావు




ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జయశంకర్ అభివృద్ధికి 11కోట్లు కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అర్తాంతంగా పనులు నిలిపివేసిందని..సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మాజీ మం త్రి హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట స్పోర్ట్ హాబ్‌గా దేశానికి ఆదర్శంగా నిలువాలన్నదే నా కల అన్నారు. సిద్దిపేట క్రీడకారులకు అన్ని రకాల ఆటలు అందుబాటులో తెచ్చినట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి సిద్దిపేట అండర్ 13, 15, బాలుర, బాలికల బాడ్మింటన్ పోటీలను మాజీ మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడ్మింటన్ కోర్టును చక్కగా వినియోగించటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఆదర్శంగా అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తే ..ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించటం లేదన్నారు. పుట్‌బాల్ మైదానంలో శిక్షణ పొందిన క్రీడకారులు జాతీయ స్థాయికి ఎదగటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. 50 లక్షలతో రెండు బాడ్మింటన్ కోర్టులు నిర్మించినట్లు తెలిపారు. ఈ స్టేడియం మరింత అభివృద్ధికి అప్పట్లో బిఆర్ఎస్ హయాంలోనే 11.50 కోట్లు మంజూరు చేశామని. టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. కాంట్రాక్టులు ఖరారైన కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే ఆ పనులను అర్థాంతంగా నిలిపివేసినట్లు తెలిపారు. ఆ నిధులతో స్టేడియంలో వాలీబాల్,క్రికెట్, హాకీతో పాటు మరిన్ని క్రీడలకు మౌళిక వసతులు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఎడ్యుకేషన్ హబ్, వాటర్ హబ్‌గా ఎదిగిన సిద్దిపేట స్పోర్ట్స్ హాబ్‌గా దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. బాడ్మింటర్ క్రీడల్లో సైతం ఈ ప్రాంతం నుండి క్రీడకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అందరు కష్టపడి సాధన చేయాలని, సిద్దిపేట పేరును దేశ వ్యాప్తంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపట్ల దృష్టి సారించాలి:ఎమ్మెల్యే



ప్రజాపక్షం/కొత్తపల్లి : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల దృష్టి సారించాలని తద్వారా వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం అన్నారు. కొత్తపల్లి మండలంలోని ఆల్ఫోర్స్ సిబిఎస్ఈ పాఠశాలలో అడిషనల్ కలెక్టర్ డా.అశ్విని తనాజీ వకాడే, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పి.హరిప్రసాద్, రీజనల్ ఆఫీసర్ జంగం సునీల్ కుమార్‌లతో కలిసి క్లస్టర్ 7 ఖోఖో పోటీలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సరస్వతి మాత విగ్రహానికి పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను విద్యార్థుల కేరింతల మధ్య వారిని పరిచయం చేసుకుంటూ అట్టహాసంగా ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం స్ఫూర్తిదాయకంగా ఉంటుందని వాటిలో పాల్గొనడం ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని అన్నారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థలు క్రీడల నిర్వహణకు మారుపేరని ఇదివరకు ఎన్నో జాతీయ స్థాయి టోర్నమెంట్లు నిర్వహించి ప్రశంసలను పొందారని అన్నారు. ఆల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి క్రీడల్లో పాల్గొనుటకై విద్యార్థులకీ ప్రోత్సాహం ఇవ్వడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. అనంతరం అశ్విని తనాజీ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి ప్రదర్శించాలని క్రీడల్లో పాల్గొనడం ద్వారా విషయాలు చక్కగా అర్థం అవుతాయని దాంతో పాటు ఒత్తిడి ఉండదని చెప్పారు. ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని వాటిని అమలు చేయాలని సూచించారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థల్లో క్రీడల పట్ల శ్రద్ధ తీసుకోవడంతోపాటు వారికి వసతులు కల్పించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. విద్యార్థులంతా నియమ నిబంధనలు పాటిస్తూ టోర్నమెంట్‌ను జయప్రదం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబిఎస్ఈ పరిశీలకులు భరత్ కుమార్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు నందెల్లి మహిపాల్, జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.మహేందర్ రావు, వి.సూర్యప్రకాశ్, రెఫరీస్ బోర్డ్ కన్వీనర్, వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్, తల్లిదండ్రులు, కోచ్‌లు, మేనేజర్లు, ఏపీ, తెలంగాణ పలు పాఠశాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి – కునారం రైల్వే గేట్ తాత్కాలిక మూసివేత




ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి కునారం రోడ్డులోని రైల్వే గేట్ వద్ద అత్యవసర రైల్వే ట్రాక్ మరమ్మత్తు పనులు చేపట్టనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.ఈ ట్రాక్ భద్రతా పనుల కారణంగా జూలై 25 ఉదయం 6 గంటల నుండి జూలై 31 సాయంత్రం 7 గంటల వరకు ఆ మార్గంలో రోడ్డు రవాణా రాకపోకలను పూర్తిగా మూసివేయనున్నట్లు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో ప్రయాణికులు,వాహనదారులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు కోరారు.ప్రయాణికులకు కలుగుతున్న అసౌకర్యానికి రైల్వే శాఖ చింతిస్తోందని, తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్ల నిమిత్తం ఈ ముందస్తు సమాచారాన్ని జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో, స్టేషన్ హౌస్ ఆఫీసర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్,ఆర్టీసీ మేనేజర్, లారీ, ఆటో అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ప్రెస్ క్లబ్‌కు లేక ద్వారా తెలియజేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

# ‘సుడా’ పైనే అందరి చూపు



### పెరుగుతున్న ఆశావహులు, ఆచితూచి వ్యవహరిస్తున్న హైకమాండ్








ప్రజాపక్షం/కరీంనగర్: శాతాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ (సుడా) పదవీకాలం ఇటీవల ముగిసింది. ప్రస్తుతం అధికార పార్టీలోని నేతల దృష్టి ఈ పీఠంపైనే పడింది. నిన్న మొన్నటి వరకు ముగ్గురు మాత్రమే పోటీలో ఉన్నట్లు ప్రచారం అయిన విషయం తెలిసిందే. తాజాగా మరికొందరు నేతలు సుడా చైర్మన్ పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరికి వారు తమ నేతల వద్ద లాబియింగ్ గట్టిగానే చేస్తున్నారు... పార్టీ హైకమాండ్ మాత్రం నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సుడా కుర్చీ ఎవరిని వరిస్తోందోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

**పెరుగుతున్న పోటీ:** సుడా చైర్మన్ రేసులో కరీంనగర్ కు చెందిన ముగ్గురు నేతల మధ్యే ప్రధానంగా పోటీ ఉన్నట్లు ప్రచారంలో ఉంది. కానీ ఇటీవల ఆ రేసులో మరికొందరు నేతలు చేరారని తెలుస్తోంది. ప్రధానంగా తాజా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి. నరేందర్ రెడ్డి, కరీంనగర్ నియోజక వర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావులు పోటీలో ఉండగా.. తాజాగా మరికొంత మంది నేతలు ఈ పదవి ఆశిస్తున్నట్లు సమాచారం. పార్టీ కోసం ఏళ్లుగా కష్టపడుతున్నామని... పదేళ్లు పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీ బలోపేతం కోసం ఎంతో కృషి చేశామని.. తమకు న్యాయం చేయాలని అధిష్టానం వద్ద అభ్యర్థిస్తున్నారు. పార్టీలో సీనియర్ నాయకునిగా పేరున్న కోమటి రెడ్డి నరేందర్ రెడ్డికి పార్టీ అధికారంలోకి రాగానే సుడా చైర్మన్ పదవిని కట్టబెట్టింది. రాష్ట్ర మంత్రి శ్రీదర్ బాబుకు అనుచరునిగా పేరున్న కోమటి రెడ్డి మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ మేరకు పార్టీ హైకమాండ్ వద్ద తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. సుడా చైర్మన్ ఆశిస్తున్న మరో నేత అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వుట్కూరి నరేందర్ రెడ్డి.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు అంచుల దాకా వెళ్లి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. అనంతరం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. సుడా చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజక వర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న వెలిచాల రాజేందర్ రావు సుడా చైర్మన్ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు హైకమాండ్ వద్ద తన స్థాయిలో ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**తెరపైకి మరికొందరు:** సుడా చైర్మన్‌గిరి కోసం ఇప్పటికే పలువురు సీనియర్ నేతలు లైన్ లో ఉండగా తాజాగా మరికొందరు నేతలు ఆ వరుసలో చేరుతున్నారు. రాజకీయ, సామాజిక సమీకరణాల నేపథ్యంలో తమకు ఒక అవకాశం ఇవ్వాలని హైకమాండ్ ను కోరుతున్నారు. ఇందులో ప్రధానంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అనుచరునిగా పేరున్న కార్పోరేటర్ మల్లిఖార్జున రాజేందర్ కాగా ఆసంపల్లి లక్ష్మి ఫౌండేషన్ చైర్మన్, మంత్రి శ్రీధర్ బాబు అనుచరుడు ఆసంపల్లి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంలు ఉన్నారు. ఇదిలా ఉండగా గత అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన పురుమల్ల శ్రీనివా స్‌పై ఉన్న సస్పెన్షన్‌ను పార్టీ హైకమాండ్ ఇటీవల ఎత్తివేసింది. దీంతో ఆయన సైతం సుడా చైర్మన్ రేసులో ఉం టున్నట్లు సమాచారం. సుడా చైర్మన్ రేసులో మొదట ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ అనుకున్నప్పటికీ ఆశావహుల సంఖ్య క్రమేపి పెరుగుతుండటం ఆసక్తిని కల్గిస్తోంది.

**ఆచితూచి వ్యవహరిస్తున్న హైకమాండ్:** జిల్లాలోని సుడా చైర్మన్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర నామినేటెడ్ పోస్టులు ఇటీవల భారీగా ఖాళీ అయ్యాయి. వీటన్నిటి భర్తీ విషయంలో హైకమాండ్ ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పోరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టు సాధించలేక పోయింది. మేయర్ పీఠం కాంగ్రెస్ దక్కించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి నేతలకు దిశానిర్దేశం చేసినా కార్పోరేషన్‌లో సత్తాచాటలేక పోయారు. నేతలంతా అంతర్గత విబేదాలు పక్కన పెట్టి సమన్వయంతో పని చేస్తే కార్పోరేషన్ చేజిక్కేదనే అభిప్రాయం వ్యక్తమయింది. కనీసం రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనైనా కరీంనగర్ ను చేజిక్కించుకోవాలనే హైకమాండ్ ఆలోచనగా తెలుస్తోంది. అందుకు కావాలసిన కార్యాచరణ, కసరత్తులో బాగంగానే నామినేటేడ్ పోస్టుల భర్తీ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోందని సమాచారం.

## ఆర్‌టిసి కార్గో హమాలీలకు సామాజిక భద్రత కల్పించాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య



ప్రజాపక్షం/కరీంనగర్: ఆర్టీసీ కార్గో హమాలి పోర్టర్ గా పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని శుక్రవారం రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా కరీంనగర్ 1,2 డిపోల మేనేజర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూ కార్గో లో పనిచేస్తున్న హమాలీల కూలి రేట్లు ఒక ఆర్టికల్ కు 20 రూపాయలు ఇవ్వాలని ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీలకు సామాజిక భద్రత కల్పిస్తూ వీరికి ప్రమాద బీమా,ఇన్సూరెన్స్, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుల కుటుంబాలకు బస్ పాస్ సౌకర్యం అలాగే ప్రతి సంవత్సరం లైసెన్స్ ను యధావిధిగా రెన్యువల్ చేయాలన్నారు. ఆర్టీసీ హాస్పిటల్లో వీరి కుటుంబాలకు వైద్య సౌకర్యం అందిస్తూ ప్రమాదం భీమా సౌకర్యాన్ని కల్పించే విధంగా చర్యలు తీసుకొని ప్రతి డిపోలో కచ్చితంగా విశ్రాంతి భవనం కల్పిస్తూ కార్మికులకు సామాజిక భద్రత కల్పించి వారి సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో లంక దాసరి లక్ష్మణ్, పోశయ్య, ఉమా శంకర్, ఈదయ్య, పప్పు శ్రీనివాస్, టి నరేష్, చిట్టి పోశయ్య, సతీష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ వెల్ఫేర్ హాస్టల్ తనిఖీ

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలోని అరపేటలో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల హాస్టల్‌ను జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్,మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించి దాని నాణ్యతపై ఆరా తీశారు. హాస్టల్‌లోని వసతి సౌకర్యాలు, విద్యాబోధన, పరిశుభ్రత, విద్యార్థినులకు అందుతున్న ఇతర సదుపాయాలను పరిశీలించి వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థినులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, నరేష్, అజయ్, అజీమ్, మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాస్ గౌడ్, రవి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా,ముందస్తు అరెస్టులను ఖండిస్తున్నాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



ప్రజాపక్షం/కరీంనగర్: నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం స్పం దించి సంబంధిత శాఖ మంత్రి ధర్మే ంద్ర ప్రధాన్‌ను తొలగించాలని దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు, పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి కనబడడం లేదా? అదే డిమాండ్‌తో కరీంనగర్‌లో ఆందోళన నిర్వహిసున్న వామపక్ష ఇతర విద్యార్థి సంఘాల నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి ఆందోళన ప్రదేశాల్లో అక్రమంగా, ముందస్తుగా అరెస్టులు చేపించడాన్ని సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి పక్షాన తీవ్రంగా ఖండిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ పేపర్ లీక్ అయినప్పటి నుండి దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఉద్యమాలు నిర్వహిస్తున్నాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చలనం లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇత ర సంస్థల వారు, సామాజిక వేత్తలు గత మూడు రోజుల క్రితం దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తుంటే వారిపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాలతో ఆందోళనకారులపై పాషవికంగా లాఠీఛార్జ్ చేసి, బాష్ప వాయువు ప్రయోగించి, పెల్లెట్ల వర్షం కురిపించి నిరసన కారుల ముఖం, ఛాతీ, మెడ, భుజాల్లో బుల్లెట్స్ ను దింపడం దుర్మార్గమని, ఆ పోరాటంలో ఒక అమ్మాయి మృతి చెందడం అ త్యంత బాధాకరమని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్‌లో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం కాదు బీజేపీ కనుసన్నల్లో పరిపాలన సాగుతుందని, కాంగ్రెస్ కేవలం కీలు బొ మ్మలాగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర వ్యాప్తం గా విద్యాసంస్థలు బంద్‌కు పిలుపునిస్తే ఎక్కడా కూడా విద్యార్థి సంఘాల నేతలను అరెస్ట్ చేయలేద ని, కేవలం కరీంనగర్ లో మాత్రమే బీజేపీ నేతలు చెప్పినట్లు ఇక్కడి పోలీసులు నడుస్తున్నట్లుగా అనుమానం కలుగుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇ క నుండైనా అక్రమ అరెస్టులు చేయవద్దని, విద్యార్థి సంఘాలు నిర్వహించే ఉద్యమాలు కేవలం విద్యార్థుల భవిష్యత్ కోసమే తప్ప స్వార్థ రాజకీయాలు చేయడానికి కాదనే విషయం పాలక ప్రభుత్వాలు గుర్తుంచుకోవాలని పంజాల శ్రీనివాస్ హితవు పలికారు.

## ఆయిల్ పామ్ సాగును రైతులు విస్తరించాలి: కలెక్టర్




ప్రజాపక్షం/పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుని,రైతులకు నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కలను మాత్రమే సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులు,కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు.శుక్రవారం కాల్వ శ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామంలో 128 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ లో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం రైతు గీట్ల పవన్ కుమార్ రెడ్డి 17 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ తోటను పరిశీలించి, సాగు విధానాలు, మొక్కల నాణ్యత, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు, మొక్కల నాణ్యత, తిరుమల ఆయిల్‌కెమ్ ఫ్యాక్టరీ నిర్మాణం, భవిష్యత్తులో ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు వంటి అంశాలపై సంబంధిత అధికారులను, కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. తిరుమల ఆయిల్‌కెమ్ కంపెనీ ఫ్యాక్టరీ నిర్మాణ పనుల పురోగతిపై కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ మనీష్ బురారియాతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి రైతులకు సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.రైతులకు నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కలే అధిక దిగుబడులకు, దీర్ఘకాలిక ఆదాయానికి పునాదిగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో పొడి వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విబిజి రామ్(జీ) పథకం కింద 100 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న ఫార్మ్ పాండ్లను ఆయిల్‌పామ్ రైతులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వర్షపు నీటిని ఫార్మ్ పాండ్లలో నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో ఆయిల్‌పామ్ తోటలకు అందించడం ద్వారా పొడి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్, తిరుమల ఆయిల్‌కెమ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ బురారియా, కేశు కల్యాణ్‌కర్, రైతులు, ఆయిల్‌పామ్ సాగుదారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పైపులైన్ లీకేజీలు, అక్రమ నల్లా కనెక్షన్లను అరికట్టాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రా



ప్రజాపక్షం/కరీంనగర్: ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మిషన్ భగీరథతో పాటు ఇతర తాగునీటి సరఫరా వ్యవస్థల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలో రోజువారీ నీటి అవసరాలు, సరఫరా పరిస్థితులు, నీటి పొదుపు కోసం చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వార్డుల వారీగా పనిచేస్తున్న బోర్లు, వినియోగంలో లేని బోర్లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని కొత్తపల్లి–ఎలగందుల, బొమ్మకల్, విద్యారణ్యపురి, అలుగునూరు, చింతకుంట ప్రాంతాలతో పాటు ఇటీవల విలీనమైన గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండి మున్సిపాలిటీలు, గంగాధర, గన్నేరువరం మండలాల్లో నీటి అవసరాలు, వినియోగం, సరఫరా పరిస్థితులను సమీక్షించారు. ఎల్ఎండీ రిజర్వాయర్‌లో నీటి నిల్వలను ప్రతి రోజూ పర్యవేక్షించాలని, డెడ్ స్టోరేజ్ పరిస్థితి ఏర్పడకముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని హనుమాజిపల్లి – జంగంపల్లి ప్రాం తాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి నీటి వృథాను అరికట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈలు రామ్‌కుమార్, సందీప్ కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్‌రావు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉద్యమానికి కాంగ్రెస్ అండ

### రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్ట్ హేయమైన చర్య

### టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు



ప్రజాపక్షం/పెద్దపల్లి: దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలపై తీవ్ర ఆగ్రహం : ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానాలపై దుద్దిళ్ల శ్రీనుబాబు ఘాటుగా స్పందించారు. ప్రధాని మోదీ అసమర్థ పాలన వల్లనే విద్యార్థులు, నిరుద్యోగులు రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

**కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి:** పరీక్షల నిర్వహణలో వరుసగా జరుగుతున్న అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని దుద్దిళ్ల శ్రీనుబాబు డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ, ప్రవేశ పరీక్షల నిర్వహణలో పూర్తిస్థాయి పారదర్శకతను కాపాడాలని కోరారు.

**రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీల అరెస్ట్ హేమమైన చర్య :** ప్రతిపక్ష నాయుడు రాహుల్ గాంధీ ఎంపీ ప్రియాంక గాంధీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున లను అక్రమంగా ఆరెస్ట్ హెమమైన చర్య అని, వారిని బస్సుల్లో కూడా నిర్బంధించి తీసుకువెళుతుంటే విద్యార్థుల కోసం వారు నినాదించిన తీరు యావత్ దేశాన్ని కట్టిపడేసిందని అన్నారు. విద్యావ్యవస్థలో అక్రమాలను అరికట్టి, దేశ యువతకు న్యాయం జరిగేంత వరకు కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ కార్గే ఆధ్వర్యంలో తామంతా విద్యార్థులకు అండగా నిలిచి పోరాడుతారని శ్రీనుబాబు స్పష్టం చేశారు.

## మెట్‌పల్లి కాల్పుల కేసును ఛేదించిన పోలీసులు




ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలో ఇటీవల సంచలనం సృష్టించిన కాల్పుల ఘటన కేసును జగిత్యాల జిల్లా పోలీసులు విజయవంతంగా ఛేదించారు. కుటుంబ ఆస్తి వివాదాల నేపథ్యంలో సొంత అన్న భార్యను హత్య చేయాలనే ఉద్దేశంతో ముందస్తు పథకం ప్రకారం కుట్ర పన్ని హత్యాయత్నానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ప్రధాన కుట్రదారులతో పాటు మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, హత్యాయత్నానికి ఉపయోగించిన నాటు పిస్టల్, రెండు సజీవ కాట్రిడ్జీలు, హోండా పాషన్ ప్రో మోటార్ సైకిల్, ఐఫోన్11 మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, మెట్‌పల్లి డీఎస్పీ ఎ.రాములు పర్యవేక్షణలో, మెట్‌పల్లి సీఐ బి. సురేష్ బాబు, ఎస్ఐ పి. కిరణ్ కుమార్ నేతృత్వంలోని బృందం సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, శాస్త్రీయ సాక్ష్యాలు, ఆర్థిక లావాదేవీలు, మొబైల్ డేటా విశ్లేషణ ఆధారంగా కేసును ఛేదించింది.దర్యాప్తులో కుటుంబ ఆస్తి వివాదాల కారణంగా గోనెల శంకర్,అతని భార్య అనూష, వారి బంధువు గోపి ముత్తయ్య కలిసి ఉత్తరప్రదేశ్‌కు చెందిన జేసీబీ డ్రైవర్ సచిన్ కుమార్ అలియాస్ సచిన్ వర్మకు సుపారీ ఇచ్చి గోనెల లక్ష్మి ని హత్య చేయించేందుకు కుట్ర పన్నినట్లు వెల్లడైంది. ఇందుకోసం సచిన్ ఉత్తరప్రదేశ్‌లో రూ.40 వేలతో నాటు పిస్టల్, కాట్రిడ్జీలు కొనుగోలు చేసి మెట్‌పల్లికి తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు.తొలుత జూన్ 13న హత్యాయత్నానికి ప్రయత్నించినా విఫలమవగా, జూన్ 15 అర్ధరాత్రి బాధితురాలు ఇంటి వరండాలో నిద్రిస్తున్న సమయంలో నాటు పిస్టల్‌తో కాల్పులు జరిపాడు. అయితే బుల్లెట్ లక్ష్యాన్ని తప్పి బాధితురాలి ఎడమ చెంపను తాకడంతో ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడింది. అనంతరం ఈ ఘటనను గుర్తుతెలియని వ్యక్తుల దాడిగా చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. బాధితురాలికి శస్త్రచికిత్సలో బుల్లెట్ బయటపడడంతో కేసు దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, సాక్షుల వాంగ్మూలాలు, ఆర్థిక లావాదేవీలను విశ్లేషించిన పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు: నాటు పిస్టల్‌రెండు సజీవ కాట్రిడ్జీలుహోండా పాషన్ ప్రో మోటార్ సైకిల్‌ఐఫోన్11 మొబైల్ ఫోన్ ఈ సంచలన కేసును అంతర్రాష్ట్ర స్థాయిలో దర్యాప్తు చేసి ప్రధాన నిందితుడిని ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేసిన మెట్‌పల్లి సీఐ బి. సురేష్ బాబు, ఎస్ఐ పి.కిరణ్ కుమార్‌తో పాటు దర్యాప్తు బృందాన్ని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్, మెట్‌పల్లి డీఎస్పీ ఎ.రాములు ప్రత్యేకంగా అభినందించారు.

## సమగ్రాభివృద్ధి లక్ష్య సాధనకు కృషి

### అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ టౌన్ :** నీతి తారా పోర్టల్ ద్వారా జిల్లాలో సమగ్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నీతి తారా పోర్టల్ వినియోగం, డేటా ఎంట్రీ, పర్యవేక్షణలపై జిల్లా అధికారులు, సాంకేతిక సిబ్బందికి నిర్వహించిన శిక్షణ వివిధ శాఖల పనితీరు సూచికలను పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా అభివృద్ధి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చని తెలిపారు. డేటా ఆధారిత ప్రణాళికలు రూపొందించి లోపాలను తక్షణమే సరిదిద్దడానికి పోర్టల్ ఉపయోగపడుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నాణ్యమైన సమాచారాన్ని సకాలంలో నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈడిఎం గౌతం రాజ్, ఎబిఎఫ్ డాక్టర్ బాల రాజు రాజారాం, ఈడిసిఎల్ మాస్టర్ ట్రైనర్ నర్సింగ్ దాస్, ఎడెల్ టెక్నికల్ అసిస్టెంట్ ఉదయ్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఎల్ నినో'పై అప్రమత్తం



**ప్రజాపక్షం/కాసిపేట :** వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని సహాయ వ్యవసాయ సంచాలకులు వి. రాజా నరేందర్, మండల వ్యవసాయ అధికారి చల్లా ప్రభాకర్ అన్నారు. కాసిపేట మండలంలోని మాల్కేపల్లి గ్రామంలో సహజ వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహజ వ్యవసాయ ప్రాముఖ్యత, నేల ఆరోగ్య పరిరక్షణ, జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం తయారీ విధానాలు, మల్చింగ్, అంతర పంటలు, పంట మార్పిడి విధానాలపై వివరించారు. సహజ వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేల సారవంతత పెరుగుతుందన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కంది, జొన్న, పెసర, మినుము, ఉలవలు వంటి తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. నీటి లభ్యతను బట్టి వరి సాగును పరిమితం చేసుకోవాలని తెలిపారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి యూరియా బుకింగ్ యాప్‌ను వినియోగించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె. నాగ దీప్తి, రైతులు పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాలకు దూరం

### జూనియర్ సివిల్ జడ్జి వెంకటరమణ సుహాస్



**ప్రజా పక్షం/భైంసా :** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని, విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడరాదని భైంసా జూనియర్ సివిల్ జడ్జి శ్రీ ఆర్.కె. వెంకటరమణ సుహాస్ అన్నారు.భైంసా పట్టణంలోని గురుకుల ఒకేషనల్ కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం యాంటీ ర్యాగింగ్ అంశంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని అన్నారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.న్యాయవాదులు అంజద్ షేక్,దుసంవాద్ చిన్నన్న,కళాశాల చైర్మన్ రామకృష్ణ గౌడ్, కళాశాల అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ముగింపులో అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు



**ప్రజాపక్షం/నేరడిగొండ:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య అధికారులను ఆదేశించారు. నేరడిగొండ మండల కేంద్రంలోని నాలుగు పోలింగ్ బూత్‌లలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డితో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. బిఎల్‌ఓలు స్థానికంగా అందుబాటులో ఉంటూ ఓటర్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, నిర్దేశిత గడువులోగా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి, నాయకులు మనోజ్, నరేష్‌రెడ్డి, కపిల్, ఉషన్నా, చంద్రశేఖర్, వసంత్‌రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా కెటిఆర్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/వాంకిడి :** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు 50వ జన్మదిన వేడుకలను వాంకిడి మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ ఇంచార్జి, మాజీ జడ్‌పిటిసి డాక్టర్ అజేయ్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కెటిఆర్ కీలక పాత్ర పోషించారని, ఐటి రంగం, పారిశ్రామిక అభివృద్ధి, పట్టణాభివృద్ధి, యువత ఉపాధి కల్పనలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఆయన మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సర్పంచ్ చూనార్కర్ సతీష్, మాజీ ఎంపిటిసి వినోద్, ఓయు విద్యార్థి నాయకుడు రాజ్‌కుమార్, బిఆర్ఎస్ నాయకులు ఎంగలి రాకేష్ కుమార్, సంతోష్, అషుతోష్, రమేష్, సాయి, అంకిత్, యోగదీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

### కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / నెన్నెల/ మంచిర్యాల:** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నెన్నెల మండలం చిన్న వెంకటాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన రీ సర్వే కార్యక్రమానికి మండల తహసిల్దార్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ద్వారా భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని, భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు లేకుండా స్పష్టమైన రికార్డులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం హద్దులు నిర్ధారిస్తామని, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం నెన్నెల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా సవరణ, సాదాబైనమా, భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పాఠశాలలో అనుమతి లేకుండా గైర్హాజరైన ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వేగవంతంగా 'సర్' నమోదు ప్రక్రియ

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో సర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సంగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్ ఐ ఆర్ నమోదు పై మెదక్ నియోజకవర్గ స్థాయి తాసిల్దారులు, సూపర్వైజర్లు, బిఎల్‌ఓ లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా ఎస్ ఐ ఆర్ నమోదుపై సూపర్వైజర్లు, బి ఎల్ ఓలు క్షేత్రస్థాయిలో చిత్త శుద్దితో పనిచేయాలని వారికి ఇచ్చిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ దాదాపు 97 శాతం వరకు పూర్తయిందని, మిగిలిన మొత్తాన్ని నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. మెదక్ 96 శాతం, పాపన్నపేట95 శాతం, శంకరంపేట100 శాతం, రామాయంపేట97 శాతం, హవేలీ ఘనపూర్98 శాతం, నిజాంపేట్ 96 శాతం, నార్సింగ్99 శాతం, మండలాల్లో శాతం పూర్తికాగా, ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రం వారిగా మ్యాపింగ్ కానీ జాబితా బిఎల్‌ఏలకు ఇవ్వాలని, వారిని భాగస్వాములను చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర నగేష్, ఆర్డీఓ రమాదేవి, ఎన్నికల విభాగం పర్యావేక్షకులు గఫార్ మెదక్ డివిజన్ మండలాల తహసిల్దార్లు పాల్గొన్నారు.

## పాఠశాలలు, కళాశాలలు విజయవంతంగా బంద్

**ప్రజాపక్షం/బోథ్ :** నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి.నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి.ఢిల్లీ జంతర్ మంతర్ లో శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేసిన ఢిల్లీ పోలీసులపై చర్యలు తీసుకోవాలి.దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన నీట్ పేపర్ లీకేజీ ఘటన దేశ విద్యా వ్యవస్థపై తీవ్ర మచ్చ వేసింది.బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ బోథ్ మం డల కమిటీ డిమాండ్ చేస్తోంది.నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం నేప థ్యంలో మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు జరిపిన అమానుష లాఠీచార్జిని ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండి స్తోంది.ఈ ఘటనకు బాధ్యులైన పోలీసుఅధికారులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనకు మ ద్దతుగా, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల,డిగ్రీ కళాశా లల,పాటశాలు బంద్‌కు మద్దతు తెలిపినందుకు ఏఐఎస్ఎఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు, మున్సిఫ్,ప్రేమ్,ప్రశాంత్,విద్యార్థుల పాల్గొన్నారు.

## పుల్కల్ మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** పుల్కల్ మండలంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం విస్తృత పర్యటన నిర్వహించారు.మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బస్వాపూర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించారు. ముందుగా బస్వాపూర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించిన కలెక్టర్ నిర్మాణ పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తదుపరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను సందర్శించిన కలెక్టర్ నూతనంగా నిర్మించిన పి.హెచ్ సి భవనాన్ని పరిశీలించారు. భవనాన్ని త్వరిత గతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకోవాలని త్వరగా మంత్రి చేత ప్రారంభించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. పుల్కల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పాఠశాల ఆవరణ ,డార్మిటరీ తరగతి గదులు, స్టోర్‌రూమ్, వంటశాలలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా నీరు నిల్ల ఉండకుండా చర్యలు తీసుకోవాలని ,ఈగలు, దోమలు, పెరగకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా పరిశుభ్రతను పాటిస్తూ ప్రభుతావ నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని పాఠశాల నిర్వాహకులను ఆదేశించారు. 6వ తరగతి విద్యార్థినులతో ప్రత్యేంగా మాట్లాడిన కలెక్టర్ వారితో పాఠ్యాంశాలను చదివించి అబ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు.లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అదిరోహించవచ్చని వారికి ఉద్బోదించారు. కలెక్టర్ వెంట ఆయా కార్యక్రమాల్లో సంబందిత శాఖల అధికారులు ఎం.ఈ.ఓ కేజీబీవీ ప్రిన్సిపల్ ,ఉపాధ్యాయులు ,ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## 'ఎల్ నినో' ప్రభావంతో ఆరుతడి పంటలపై దృష్టి

### అదనపు కలెక్టర్ భుజంగరావు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఎల్‌నినో ప్ర భావం నేపథ్యంలో రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించేలా అవగాహన కల్పిస్తున్నామని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు అన్నారు. పంటల మార్పిడి విధానంతో సమకూరే ప్రయోజనాలపై వివరిస్తూ రైతులు ముందుకు వచ్చేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు విద్య, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ, పంటల సాగు, సీజనల్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు 2 జతల ఏకరూప దుస్తులు త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 1వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యనభ్యసించే విద్యార్థులందరికి 2 జతల ఏకరూప దుస్తులు ఆగస్టు 25వ తేదీలోగా అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరికి ప్రత్యామ్నాయంగా కల్పించి రైతులను ప్రోత్సహించాలని, కందులు, పెసర్లు, కూరగాయల పంటల సాగు శ్రేయస్కరమని రైతులకు సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వీసి అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. ప్రతి రైతుకు అవగాహన కల్పించేలా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, భూగర్భజల శాఖాధికారులు కృషి చేయాలని, ప్రజాప్రతినిధుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కాన్ఫరెన్స్‌లో నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సా యన్న, జిల్లా వ్యవసాయాధికారి వీరస్వామి, జి ల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా వైద్యారోగ్యాధికారిని డాక్టర్ రాజశ్రీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## 'సర్' ప్రక్రియలో బిఎల్‌ఎలు భాగస్వాములు కావాలి

### ఎంఎల్‌సి దండె విఠల్



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ :** కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్‌ఐఆర్ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్‌ఏలు) చురుగ్గా భా గస్వాములు కావాలని ఎంఎల్‌సి దండె విఠల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఎస్‌ఐఆర్ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ ఎస్‌ఐఆర్ ప్రక్రియ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు నమోదు, సవరణలు, మార్పులు చేర్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. బూత్ స్థా యిలో శ్రమిస్తున్న ఏజెంట్లను అభినందిస్తున్నామని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ తెలిపారు. పెంచికల్పేట్, దహేగాం మండలాల అధ్యక్షులు సముద్రాల రాజన్న, భీమన్న,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వర ఆలయానికి రూ. 20 లక్షల నిధులు



**ప్రజాపక్షం/భైంసా :** కుభీర్ మండలం లోని పార్డి (కె) గ్రామం లో రాజరాజేశ్వరాలయం లో కళ్యాణ మండపం, షెడ్డు నిర్మాణానికి 20 లక్షల రూపాయల నిధులను ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ నిధులను మంజూరు చేయించారు.పార్డి కె గ్రామస్తులకు మంజూరు పత్రాన్ని అందజేశారు.పలు మార్లు కల్యాణ మండపానికి నిధులు ఇవ్వాలని విన్నవించినా అప్పటి పాలకులు నిధులు మంజూరు చేయలేదని, నిధులు మీ హయాంలో మంజూరు అవడం సంతోషంగా ఉందని గ్రామస్తులు అన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ పూర్తి కావడం జరిగిందని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

## భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు

### కలెక్టర ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసి పట్టేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పనిసరి చేయాలని, భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ విడియో కాన్ఫరెన్స్ హాల్ నుందు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధర్వర్యంలో వీబి జీ రామ్‌జీలో భాగంగా భూ గర్భజలాల పెంపు కార్యక్రమంపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలతో మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై కలెక్టర్ సమీక్షించారు. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ (వీబీ జీ రామ్ జీ) పథకం అమలు, జిల్లాలో పటిష్టంగా అమలు కావాలన్నారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. ప్ర జ లందరూ ఇంకుడు గుంతలు నిర్మించేలా యుద్ధ ప్రాతిపదికన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వర్షపు నీటి ప్రతి చుక్కను భూమిలోకి పంపించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, నీటి భద్రత కోసం ఫామ్ పాండ్‌లను, వ్యక్తిగత ఫామ్ పాండ్‌లు, బోరుబావి రీఛార్జ్ పిట్ లు, వర్మికంపోస్ట్ యూనిట్లు, పర్కోలేషన్ ట్యాం కుల నిర్మాణం లక్ష్యాల దిశగా ముందుకు సాగాలన్నారు. కొంటె సాకులతో కాలాన్ని వృధా చేస్తే స హించేది లేదని హెచ్చరించారు. ప్రతి మండలంలో ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓ సమన్వయంతో పటిష్ట కార్యచరణ ద్వారా పూర్తి చేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రకృతి విపత్తును సమిష్టిగా ఎదుర్కోవడానికి ప్రభుత్వ పరంగా మన వంతు సహాకరం అందించాలని రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్డిఎ, పిడి శ్రీనివాసరావు, జడ్పీసీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, అన్ని మండలాల, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.



# నిర్మల్ హత్య కేసులో సుపారీ గ్యాంగ్ అరెస్టు

- రూ. 6 లక్షల సుపారీ ఇచ్చిన సవతి తల్లి
- అదుపులో హంతకులు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించిన అస్లాం ఖాన్ హత్య కేసును జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. ఈ హత్యకు పాల్పడిన అంతర్రాష్ట్ర సుపారీ గ్యాంగ్‌ను నిర్మల్ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా సూపరింటెండెంట్ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీసు బృందాలు విశ్వసనీయ సమాచారం, సాంకేతిక ఆధారాలు,సీసీటీవీ ఫుటేజీలు,కాల్ డేటా విశ్లేషణ ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన ఒక స్కార్పియో కారు, మోటార్ సైకిల్, రెండు కత్తులు ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అక్రమ బంధం.. పరువు పోతుందనే కక్షతోనే హత్యపోలీసుల దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, ఈ హత్యకు ప్రధాన కుట్రదారు మృతుడు అస్లాం ఖాన్ సవతి తల్లి అన్వరీ బేగం. అస్లాం ఖాన్‌తో కొనసాగుతున్న అక్రమ సంబంధం బయటపడటం, కుటుంబంలో వివాదాలు రావడం, అలాగే అస్లాం ఖాన్ మరొకరిని వివాహం చేసుకుని వెళ్ళిపోతాడనే కక్షతో ఆమె ఈ హత్యకు ప్లాన్ చేసింది. మహారాష్ట్రకు చెందిన ముఖీద్ అనే వ్యక్తికి రూ. 6 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుని, రూ. 50 వేల అడ్వాన్స్ చెల్లించింది. తన తమ్ముడు షేక్ మహమ్మద్‌కు కూడా ఆర్థిక సహాయం చేస్తానని చెప్పి ఈ కుట్రలో భాగస్వామిని చేసింది.పక్కా ప్లాన్‌తో దాడిఈ నెల 14న మహారాష్ట్ర నుంచి స్కార్పియో వాహనంలో బయలుదేరిన నిందితులు, 15వ తేదీ ఉదయం నిర్మల్ చేరుకున్నారు. అన్వరీ బేగం నిరంతరం అస్లాం ఖాన్ కదలికలు, ఆయన వేసుకున్న దుస్తులు మరియు ఆటో వివరాలను ఫోన్ ద్వారా నిందితులకు సమాచారం అందించింది. ఈడెన్ గార్డెన్ సమీపంలో మాటు వేసిన నిందితులు,అస్లాం ఖాన్ ఆటోలో ప్రయాణికులతో వస్తుండగా అడ్డగించి కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారు.సీఐ ఎం.విశేష కృషి చేసిన సీఐ రవీంద్ర నాయక్, ఎస్సైలు అశోక్, కృష్ణా రెడ్డి జిల్లా ఎస్పి డా. జి. జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు.

## గురుకుల పాఠశాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హరిత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో నేరుగా ముచ్చటించి, వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. వంటశాల, భోజన వసతులను తనిఖీ చేసిన కలెక్టర్, మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. వంటశాలలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థుల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణలో చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, నాటిన ప్రతి మొక్కను జాగ్రత్తగా సంరక్షించాలని పేర్కొన్నారు. మౌలిక వసతులను మెరుగుపరిచి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# సింగరేణి ప్రయోజనాలే అత్యంత ప్రాధాన్యం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు



ప్రజాపక్షం/మణుగూరు:రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించి విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలను పరిశీలించిన అనంతరం, మణుగూరు ప్రకాశ్ ఖని (పీకే ఓసీ) ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనిని క్షేత్రస్థాయిలో సందర్శించి గని పనితీరు, బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, సంస్థ భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ పర్యటనలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, జిల్లా కలెక్టర్ అంకిత్, ఇల్లందు శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, ఎస్‌సీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, ఐపీఎస్, టీజీజెన్‌కో ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్, ఐఏఎస్, ఎస్‌సీసీఎల్ డైరెక్టర్ (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్) గౌతమ్ పొట్రు తదితరులు పాల్గొన్నారు. ముందుగా భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, బొగ్గు వినియోగం, యంత్రాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ వ్యవస్థలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెంట్రల్ కంట్రోల్ యూనిట్‌ను సందర్శించి విద్యుత్ ఉత్పత్తి, నియంత్రణ వ్యవస్థల పనితీరును పరిశీలించారు. ప్లాంట్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచేందుకు చేపడుతున్న చర్యలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, నిర్వహణలో అనుసరిస్తున్న విధానాలపై అధికారులతో చర్చించారు. అనంతరం భద్రాద్రి పవర్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డి.ఏ.వి. పాఠశాలను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించే దిశగా చేపట్టిన చర్యలను అభినందించారు.తదనంతరం మణుగూరు ప్రకాశ్ ఖని (పీకే ఓసీ) ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనిని సందర్శించిన ఉప ముఖ్యమంత్రి గనిలో జరుగుతున్న తవ్వకాల ప్రక్రియ, బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, యంత్రాల పనితీరు, భద్రతా ప్రమాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ, తాడిచెర్ల బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించడంతో సంస్థ వ్యాప్తంగా అధికారులు, ఉద్యోగులు, కార్మికుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అదేవిధంగా, సంస్థ భవిష్యత్ ఉత్పత్తి అవసరాలు, దీర్ఘకాలిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పీకే ఓసీ డీప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, సింగరేణి ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యుత్ రంగ అవసరాలు తీర్చడంలో, పారిశ్రామికాభివృద్ధికి ఊతమివ్వడంలో, వేలాది మంది కార్మికుల జీవనోపాధికి భరోసా కల్పించడంలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధి, విస్తరణ, కొత్త బొగ్గు బ్లాకుల సాధన, ఉద్యోగుల సంక్షేమం, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు వంటి అన్ని అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. సింగరేణి భవిష్యత్ ప్రయోజనాలను పరిరక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం చేపడుతుందని అధికారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి, టీజీజెన్‌కో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బిజెపి విధానాలను నిరసిస్తూ ఎన్ఎస్‌యుఐ ర్యాలీ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : విద్యార్థుల పట్ల బిజెపి అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ పెద్ద దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ అర్బన్ పార్టీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కష్టపడి చదివి తీరా ప్రవేశ పరీక్షలు రాస్తే పేపర్ లీకులు చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. బిజెపి ప్రభుత్వంలో ఇప్పటికే 151 సార్లు పేపర్ లీకులు జరిగాయన్నారు. విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నగర అధ్యక్షులు పేరం యశ్వంత్, నాయకులు ఈశ్వర్, నవదీప్, శేఖర్, చంద్రమౌళి, సాహేల జావిద్, కొట్టె రాజశేఖర్, కోసూరి ప్రసాద్, బానాల లక్ష్మణ్, నరాల నరేష్, కోనేటి నారాయణ, బొమ్మ ఉదయ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాపక్షం/భద్రాచలం:రామాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కటకం రామిరెడ్డి (40) శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వివరాల ప్రకారం రామిరెడ్డి తన సోదరునితో కలిసి ఏపిలోని నెల్లిపాకకు వెళ్లారు. అక్కడ పని ముగించుకున్న తర్వాత సోదరున్ని అక్కడే వదిలేసిన రామిరెడ్డి తన ద్విచక్ర వాహనంపై భద్రాచలం తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో నెల్లిపాకలోని నాలుగురోడ్ల జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనం బలంగా గుద్దుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రామిరెడ్డి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సర్పంచ్ బలుసుపాటి శేషయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కోయచలక గ్రామంలో సర్పంచ్ బలుసుపాటి శేషయ్య అధ్యక్షతన వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఏఈవో కార్తిక్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అధిక నీటిని వినియోగించకుండా ఆరుతడి పంటలైన అపరాలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన విధంగా సన్న వరి రకాలనే సాగు చేయాలని సూచించారు. మిర్చి, మొక్కజొన్న వంటి పంటలు కాకుండా స్వల్పకాలిక పంటలను సాగు చేయడం వల్ల పెట్టుబడులు తగ్గి ఆదాయం కూడా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాధంశెట్టి హన్మంతరావు, పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు, పశు వైద్యులు రామకృష్ణ, విద్యుత్ శాఖ ఎల్ఐ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

## స్మార్ట్‌కిడ్జ్‌లో బోనాల వేడుకలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఆషాఢమాస అమ్మవారి బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు బోనాలను ఎత్తుకుని డోలు, డప్పు వాయిద్యాలతో, పోతురాజు, అమ్మవారి వేషధారణలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గౌరిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. భవిష్యత్తు తరాలు ఇటువంటి సంప్రదాయాలను మరిచిపోకుండా ఉండేందుకు ఇటువంటి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు చిన్నారులకు తెలియజేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## ఘనంగా కెటిఆర్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ నాయకులు మమత ఆసుపత్రి నందు కేటిఆర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.15వ డివిజన్ పుట్టకోట పాఠశాల నందు 200 మంది విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. గాయత్రి మానసిక వికలాంగుల సదన్ నందు కేక్ కట్ చేసి పిల్లలకు అన్న ప్రసాదం అందజేశారు. కేటిఆర్ జన్మదిన సందర్భంగా ఖమ్మం నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఆర్‌జెసి కృష్ణ, పగడాల నాగరాజు, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఆంధ్రాబ్యాంక్ సొసైటీ ఛైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కర్నాటి కృష్ణ, మగ్బూల్, నాగండ్ల కోటేశ్వరరావు, కూరాకుల వలరాజు, శీలంశెట్టి వీరభద్రం, బిక్కసాని ప్రశాంత లక్ష్మి, దేవభక్తిని కిషోర్, మాటేటి కిరణ్, గొల్లపూడి రాంప్రసాద్, తొట్టి కొమరయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయాలి

తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం



ప్రజాపక్షం/కొణిజర్ల : సీతారామ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించి సత్వరం పూర్తిచేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతురావు అన్నారు. మండల పరిదిలోని తనికెళ్లలోగల నాగార్జునసాగర్ కుడి ఎడమ కాలువల గేట్లు వద్ద ప్రత్యామ్నాయమార్గంలో వస్తున్న గోదావరి జలాలను పరిశీలించారు. సీతారామప్రాజెక్టు కు అరకొరగా నిధలు మంజూరు చేసి పనిపూర్తి కాకపోవటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఖమ్మం జిల్లా వ్యవసాయసాగుకు అవకాశాలు ఉన్నా గోదావరి జలాలను అందించకపోవడం చాలా దురదృష్టకరమని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి సీతారామప్రాజెక్టును పూర్తిచేసి గోదావరి జలాలను జిల్లాకు సంపూర్ణంగా అందించాలని అన్నారు. గోదావరి జలాలు జిల్లా వ్యవసాయానికి అందించటంలో నిర్లక్ష్యం చేయడం సరైందికాదని అన్నారు. కరువునేపథ్యంలో తాగునీటి సమస్యరాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సబ్యులు యర్ర బాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, పివిరావు, స్వర్ణ రమేష్, పెదమళ్ల రత్తమయ్య, యాసా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## సైద్ధాంతిక పునాదితోనే కార్యాచరణ

హక్కులు, సంక్షేమం కోసం ఆందోళన తప్పదు



ప్రజాపక్షం/కామేపల్లి : సైద్ధాంతిక పునాదుల మీద కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఈ దేశంలో వర్గ పునాది కలిగి ప్రజాసంక్షేమం, హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. కామేపల్లి, కారేపల్లి మండలాల సిపిఐ సభ్యుల శిక్షణా తరగతులు శుక్రవారం మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో జరిగాయి. శిక్షణా తరగతులు ప్రారంభించిన హేమంతరావు మాట్లాడుతూ పార్టీ సభ్యులు నిరంతరం రాజకీయ, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయాలన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటాలను చేపట్టాలన్నారు. పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారన్నారు. ఇదే సమయంలో దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులను హరించివేస్తున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయమే ప్రధానం గల మన దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతుందన్నారు. ప్రతి ఏడాది లక్షలాది మంది వ్యవసాయ రంగాన్ని వదిలి ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళ్తున్నారని తెలిపారు. రానున్న కాలం మరింత గడ్డుకాలం కానుందని ఆయన తెలిపారు. హక్కులు హరించడంలో ముందు వరుసలో ఉన్న మోడీ ప్రభుత్వం ఉపాధి, ఉద్యోగ కల్పనలో ఘోరంగా విఫలమైందన్నారు. గ్రామీణ పేదల ఉపాధి కోసం తీసుకు వచ్చిన జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి విబి జీ రాంజీ పథకాన్ని తీసుకు వచ్చిందని హేమంతరావు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిందని పంటల బీమా అమలు చేయలేదని రుణ మాఫీ పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో ప్రస్తుత రాజకీయాలు సిపిఐ కర్తవ్యాలు అనే అంశాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ , భారత జాతీయోద్యం కమ్యూనిస్టు పాత్ర అనే అంశాన్ని జమ్ముల జితేందర్‌రెడ్డి, కులం, మతం వర్గ పోరాటం అనే అంశాన్ని శింగు నర్సింహారావు బోధించారు. యర్రాబాబు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతుల్లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, కామేపల్లి, కారేపల్లి మండల కార్యదర్శులు పుచ్చకాయల వెంకటేశ్వర్లు, పాపినేని సత్యనారాయణ, సిపిఐ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్‌లు హన్మంతరావు, కోటమ్మ, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

ప్రజాపక్షం/కారేపల్లి:నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నిరసనగా విద్యార్థి సంఘాల పిలుపు మేరకు కారేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈసందర్భంగా పీవైఎల్ తెలంగాణ రాష్ట్ర నాయకుడు శివ నాయక్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీకి నైతికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పిడిఎస్యూ నాయకులు నెహ్రూ, గౌతమ్, నవీన్, వినయ్, పద్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

**ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో....**

ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల నిర్బంధకాండకు నిరసనగా, విద్యార్థి సంఘాల పిలుపు మేరకు సింగరేణి మండలం కారేపల్లిలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈసందర్భంగా అంబేద్కర్ సెంటర్ నుంచి కారేపల్లి బస్టాండ్ వరకు విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించి, అనంతరం మానవ హారం చేపట్టారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు కే నరేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కే నాగేశ్వర రావు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు చిలుముల భరత్, కాకాటి పృథ్వీ, ఆదర్ల నాగరాజు, భూక్య శరత్, ఎడారి నవీన్, తదితరులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలపై కలెక్టర్ సమీక్ష



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డా|| పి.శ్రీజతోకలిసి పోలీస్, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో రోడ్డు భద్రత చర్యలపై సమీక్షించారు. తొలుత గత సమావేశంలో ఇచ్చిన ఆదేశాల అమలు నివేదికపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలో చేపట్టిన అన్ని భద్రత పనులు అత్యంత త్వరగా పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారులపై చేపట్టాల్సిన పనులను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తి చేయాలన్నారు. పోలీస్ శాఖ సమర్పించిన గణాంకాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో బ్లాక్ స్పాట్లను గుర్తించి సరిదిద్దే చర్యలు చేపట్టినప్పటికీ ఇప్పటికీ ప్రతి రోజు ఒకరు ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రాణాంతక ప్రమాదాలకు గల కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వేగ నియంత్రణ కోసం ప్రతి చోట స్పీడ్ బ్రేకర్లకే పరిమితం కాకుండా ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో జిగ్‌జాగ్ ట్రాఫిక్ మూమెంట్ వంటి ప్రత్యామ్నాయ చర్యలు పరిశీలించాలన్నారు. హోటళ్లు, దాబాల వద్ద ట్రక్కులు రోడ్లపైనే పార్కింగ్ చేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. అలాంటి వాటిని గుర్తించి ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పదే పదే ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేయాలన్నారు. ఖమ్మం, కల్లూరు, మధిర, సత్తుపల్లి, ఏదులాపురం, వైరా పట్టణాల్లో వీధి వ్యాపారాలకు రెడ్ జోన్ ప్రాంతాలను స్పష్టంగా గుర్తించి ఆ ప్రాంతాల్లో వ్యాపారాలకు అనుమతించరాదన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులకు దేశ వ్యాప్తంగా అమలులో ఉన్న 1.50 లక్షల క్యాష్ లెస్ అత్యవసర వైద్య చికిత్స సదుపాయంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఆర్‌వో సిహెచ్ రామ్మూర్తి, నేషనల్ హైవే పిడి దివ్య, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, ఐఆర్‌ఏడి డిఆర్‌ఎం ఎస్ హరిబాబు, పోలీస్, రోడ్లు భవనాల శాఖాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

## అడవి జంతువులను వేటాడుతున్న ముగ్గురు అరెస్ట్



ప్రజాపక్షం/తల్లాడ: తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కల్లూరు అడవిలో అక్రమంగా కరెంట్ వైర్‌తో అడవి జంతువులను హతమార్చిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తల్లాడ రేంజి అధికారిణి ఉమా తెలిపారు. తల్లాడ ఫారెస్టు రేంజి పరిధిలోని లోకారం రిజర్వ్ ఫారెస్టు, లోకారం సౌత్ బీట్‌లో విశ్వసనీయ సమాచారం మేరకు అటవీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ షెడ్యూల్1 కింద అత్యంత రక్షణ కలిగిన ఎలుగుబంటి మృతి చెందిన స్థితిలో గుర్తించిన అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వెదురుపొదలో సుమారు 2.20కిలోల బైండింగ్ తీగ కాయిల్ స్వాధీనం చేసుకున్నారు. సంఘటనా స్థల పంచనామా నిర్వహించి, పశువైద్యాధికారి ద్వారా పంచనామా నిర్వహించారు. ప్రాథమిక దర్యాప్తులో విద్యుత్ తీగలను అక్రమంగా ఉపయోగించి వేటాడటం వల్ల ఎలుగుబంటి విద్యుద్ఘాతానికి గురై మృతి చెందినట్లు నిర్ధారించి, ధర్యాప్తు చేపట్టి సంఘటనకు బాధ్యులైన ముగ్గురు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం1972, ఇతర సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి సత్తుపల్లి న్యాయస్థానం ఎదుట హాజరు పరుస్తున్నట్లు అధికారులు, అటవీశాఖ వన్యప్రాణుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతిస్తుందని తెలిపారు. విద్యుత్‌లైన్ల ద్వారా వేట, విషప్రయోగం, ఉచ్చులు ఏర్పాటుచేయడం వంటి అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణుల రక్షణలో ప్రజలు సమకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప అటవీ అధికారులకు సమాచారం అదించాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్ఓలు పి.సురేశ్, జీ.బాలాజీ, ఎఫ్ఎస్ఓ కిశోర్‌కుమార్, ఎఫ్‌బీఓలు మహమ్మద్ అజమ్‌అలీ, బీ.భీమా, శ్రీకాంత్, సిద్ధారావు, ఎన్.రమేశ్, ఉమామహేశ్వరరావు, జేఏ షేక్ పాషా, సీఓ నాగరాజు, శ్రీనివాస్, కృష్ణ, నరసిహారావు పాల్గొన్నారు.

## చెరువు ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



ప్రజాపక్షం/సత్తుపల్లి:మండల పరిధిలోని పాకల గూడెం గ్రామపంచాయతీ, సత్యనారాయణపురం గ్రామంలో గల వెనుకకుంట చెరువు ఆంధ్ర వాసుల కబంధహస్తాల్లో చిక్కుకుందని సత్తుపల్లి పర్యటనకు వచ్చిన కలెక్టర్ దివాకర్ టిఎస్ కు సర్పంచ్, ఉప సర్పంచ్, ధారావత్ సునీత కృష్ణ, చిన్నంశెట్టి మాధవరావుల ఆధ్వర్యంలో రైతులు ఆక్రమణకు గురైన చెరువుపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని 133 సర్వే నెంబర్ లో పూర్వీకులు చెరువు నిమిత్తం ఇవ్వటం జరిగిందని, పాకలగూడెం గ్రామపంచాయతీలో ఉన్నవెనుక కుంట చెరువు 100 ఎకరాలకు పైగా పంటలకు సాగునీరు అందిస్తూ రైతులకు అండగా ఉంటుందని. ఇట్టి చెరువుపై సరిహద్దున గల ఆంధ్ర ప్రాంతానికి చెందిన చింతంపల్లి గ్రామ వాసులు కన్నేసి , గతంలో ఇక్కడ పనిచేసిన ఓ తహాశీల్దార్ కు లక్షలు ధారబోసి దాదాపు 25 ఎకరాలకు దొంగ పాస్ పుస్తకాలు పొంది ఆక్రమించుకున్నారని. చెరువు విస్తీర్ణం 32 ఎకరాలని, ఇట్టి చెరువు లోతట్టు ప్రాంతంలో ఆంధ్రవాసులు దొంగ పాస్ పుస్తకాలతో ఆక్రమించుకున్న భూముల్లో పామాయిల్, మొక్కజొన్న, వేరుశనగ, తదితర పంటలు వేసి సాగు చేస్తున్నారని ఇప్పుడు కేవలం చెరువు విస్తీర్ణం ఏడు ఎకరాలు మాత్రమే ఉందని ఆయకట్టు భూముల కు సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు, గ్రామస్తులు, కలెక్టర్కు వివరించారు. రైతులు బాధలు విన్న కలెక్టర్ వెనక కుంట చెరువును తక్షణమే సర్వే చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ప్రీ ప్రైమరీ పాఠశాలలకు పెరుగుతున్న ఆదరణ



ప్రజాపక్షం/కల్లూరు:మండల పరిధిలోని ఆరు పాఠశాలల్లో గత కొద్ది రోజుల క్రితం ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఇన్స్ట్రక్టర్ ఆయా లు ఆధ్వర్యంలో పాఠశాలలు ప్రారంభించారు. ఈ పాఠశాలలో నాలుగైదు సంవత్సరాలు వారు ఈ పాఠశాలల్లో కింది స్థాయి బోధన చేసేందుకు ప్రభుత్వం ఈ పాఠశాలలను ప్రారంభించారు. మొదటిగా ఈ పాఠశాలల్లో ఐదు పది 13 వరకు విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. క్రమేపి ఈ నెల చివరి కల్లా 20 విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఇన్స్ట్రక్టర్ తిరుమల శెట్టి శ్రీదేవి,ఆయా కొంగల లక్ష్మి లు తెలుపుతున్నారు. ప్రతిరోజు చిన్న పిల్లల ఉన్న గృహాలకు ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచుతున్నామని వారు తెలుపుతున్నారు. క్రమేపి సంఖ్య పెరుగుతుందని వివరించారు .పాఠశాల గదిలో విశాలమైన వాతావరణంతో ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం తోపాటు ఆటపాటలు విద్యాబోధన చేస్తున్నామని వారు పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య క్రమేపి పెరుగుతుందని వివరించారు. మర్లపాడు, తో పాటు కొత్త బోడి మల్లె, అంబేద్కర్ నగర్, నారాయణపురం, చిన్న కోరుకొండి, కల్లూరు లలో ఈ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతూ ఆదరణ పెరుగుతుందని వారు వివరించారు. మండల విద్యాశాఖ అధికారి పొదిల పద్మ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణలు ప్రతిరోజు జరుగుతాయని పేర్కొన్నారు.

## చుంచుపల్లి మండలంలో 77 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి



ప్రజాపక్షం/చుంచుపల్లి:చుంచుపల్లి మండలంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా 77 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని మండల తహశీల్ధార్ నాగరాజు తెలిపారు. శుక్రవారం రుద్రంపూర్ ప్రాంతంలో 219, 220, 221, 222, 222, 223, 224, 225 పోలింగ్ బూత్‌లను ఆయన వరుసగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న డిజిటలైజేషన్ ప్రక్రియ, ఎన్యూమరేషన్ ఫారాల నమోదు, పత్రాల పరిశీలన తదితర అంశాలను సమీక్షించారు. ప్రతి అర్హ ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# తొలివారం 'వాష్‌ఔట్'

**ప్రతిపక్ష ఎంపిల నిరసనలు, ఆందోళనలు**
**సాగని కార్యకలాపాలు**
**పార్లమెంట్ ఉభయ సభలో సోమవారం**



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20న ప్రారంభం కాగా, తొలి వారం ఎలాంటి కార్యకలాపాలకు నోచుకోకుండా తుడిచి పెట్టుకుపోయాయి. నీట్ పేపర్ లీక్ వివాదం, విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ అంశాలపై ప్రతిపక్ష ఎంపిల ఆందోళనలు, నిరసనలతో ఉభయ సభలు అట్టుడికాయి. నీట్ పేపర్ లీక్‌పై చర్చకు ప్రతిపక్ష ఎంపిలు పట్టు బిగించాయి. అయితే సమావేశాలు ప్రారంభమైన మూడు రోజుల తరువాత నీట్ పేపర్‌లీక్‌పై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించినప్పటికీ, సంతృప్తి చెందని ప్రతిపక్షాలు మంత్రి ప్రధాన్ రాజీనామానే ముందు, ఆ తరువాత చర్చ అంటూ కొత్త షరతు విధించాయి. ఈ దీంతో ఉభయల్లో వారం రోజుల పాటు ప్రతిష్టంభన కొనసాగింది. శుక్రవారం స్పీకర్, రాజ్యసభ చైర్మన్ సభలను సోమవారానికి వాయిదా వేశారు. కాగా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్, నీట్ పరీక్షా పత్రం లీక్ వ్యవహారం వంటి పలు కీలక అంశాలపై శుక్రవారం నాడు వరుసగా ఐదవ రోజు కూడా లోక్‌సభ, రాజ్యసభ కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చర్చ జరగకుండా సాకులు వెతకడం దేశానికి తప్పుడు సంకేతాన్ని పంపుతుందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, విపక్షాలు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌కు కట్టుబడి ఉండటంతో శుక్రవారం లోక్‌సభ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి మాట్లాడుతూ, పేపర్ లీక్ అంశంపై పార్లమెంటులో చర్చ జరగనిచ్చేందుకు ప్రభుత్వం పదేపదే ప్రతిపక్ష పార్టీలను సంప్రదించిందని చెప్పారు. చర్చ జరగాలని పలువురు ప్రతిపక్ష ఎంపిలు భావిస్తున్నారని, చర్చ ఆవశ్యకతను రాహుల్ గాంధీ తన పార్టీ సభ్యులకు అర్థమయ్యేలా చెప్పాలని ఆయన అన్నారు. చర్చకు ముందే సాకులు చెప్పడం, షరతులు విధించడం దేశానికి తప్పుడు సంకేతాన్ని పంపుతుందని ఆయన పేర్కొన్నారు. పేపర్ లీక్‌లపై కఠినమైన చట్టం తీసుకురావడం, నిందితుల విచారణను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులలో నిర్వహించడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. అలాగే కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను విరమించారని కూడా ఆయన పేర్కొన్నారు. అయితే, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను కొనసాగిస్తూ రాజీనామా చెయ్ వంటి నినాదాలు చేశాయి. సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చేయగా, సభకు అధ్యక్షత వహిస్తున్న జగదాంబికా పాల్, మంత్రి పార్లమెంటరీ పత్రాలను సభలో ప్రవేశపెట్టిన తర్వాత అవకాశం ఇస్తానని చెప్పారు. కానీ ఆ తర్వాత సభ సోమవారం వరకు వాయిదా పడటంతో కాంగ్రెస్ నేత మాట్లాడలేకపోయారు. మరోవైపు రాజ్యసభలో నీట్ పేపర్ లీక్, 'దేశ గౌరవానికి అవమానాలను నివారించే (సవరణ) బిల్లు, 2026' ప్రవేశపెట్టడం సహా పలు అంశాలపై ప్రతిపక్షాలు నిరసన కొనసాగించారు. దీంతో శుక్రవారం మధ్యాహ్న భోజనానంతర సమావేశానికి సభ సమావేశమైన వెంటనే మరసటి రోజుకు సభా కార్యకలాపాలను వాయిదా వేశారు. ఉదయం సభ ప్రారంభమైనప్పటి నుంచి మధ్యాహ్నం వరకు రెండుసార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సభ సమావేశమైనప్పుడు, డిప్యూటీ చైర్మన్ హరివంశ్, కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్‌ను 'దేశ గౌరవానికి అవమానాలను నివారించే (సవరణ) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టాలని కోరారు. ప్రతిపక్ష సభ్యులు, ముఖ్యంగా వామపక్ష పార్టీలకు చెందినవారు, ఈ బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. అయినప్పటికీ, మూజువాణి ఓటు తర్వాత ప్రతిపాదిత చట్టాన్ని ప్రవేశపెట్టారు. బిల్లుపై చర్చ ప్రారంభించాలని చైర్మన్ సభను కోరడంతో, ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించడంతో సభ వాయిదా పడింది.

## ప్రతిపక్ష ఎంపిల నిరసన ప్రదర్శన



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వార్షకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పార్లమెంట్ మకర ద్వారం వద్ద ప్రతిపక్ష సభ్యులు పలు రూపాలుగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నారు. శుక్రవారం కూడా ఆందోళన చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలో, పలువురు ప్రతిపక్ష ఎంపిలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాన్ రాజీనామా చేయాలని, పార్లమెంట్ ఉభయ సభలలో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, 'బర్ఖాస్త్ కరో ప్రధాన్ కో' (ప్రధాన్‌ను బాగు చేయండి) అని రాసి ఉన్న బ్యానర్‌ను కూడా వారు ప్రదర్శించారు. గురువారం అర్ధ రాత్రి సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక వీడియో సందేశం విడుదల చేసిన తర్వాత ఈ నిరసన జరిగింది.

**ప్రధాని క్షమాపణ చెప్పేంత వరకూ చర్చలు జరగవు : రాహుల్**

పరీక్షా పత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకు, అలాగే ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యానికి సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పేంత వరకు ప్రభుత్వంతో ఎటువంటి చర్చలూ జరగవని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం స్పష్టం చేశారు. పార్లమెంట్ భవన సముదాయంలో మీడియాతో మాట్లడుతూ సభలో మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వలేదని ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. 'చర్చను ప్రారంభించాలని కాంగ్రెస్ ఎంపిలను కోరుతూ లోక్‌సభలో (పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్) రిజిజు ఒక ప్రకటన చేశారు. ఎవరి పేరునైనా ప్రస్తావించినప్పుడు, ఆ వ్యక్తి స్పందించాలని కోరడం సహజం. అయితే, రిజిజు వ్యాఖ్యలకు సమాధానం ఇచ్చేందుకు నేను లేచినప్పుడు, నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు, నా మైక్ కట్‌చేశారు' అని అన్నారు. పీరీక్షా పత్రాల లీకేజీ, విద్యార్థుల నిరసన, ఢిల్లీ వీధుల్లో వారిపై పోలీసులు జరిపిన అణచివేత చర్యలకు సంబంధించిన అంశాలపై ప్రతిపక్షం, ప్రభుత్వం మధ్య ప్రతిష్టంభన నెలకొంది. 'ప్రతిపక్షం వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని అనుకున్నాను. విద్యార్థులకు మూడు డిమాండ్లు ఉన్నాయి – అవినీతిపరుడైన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవి నుంచి తప్పుకోవాలి; విద్యార్థులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి; ప్రధాన మంత్రి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. ఇవే ఆ మూడు షరతులు. ప్రధాన్‌ను తొలగించే వరకు మేము ఎటువంటి చర్చ జరపము' అని రాహుల్‌గాంధీ అన్నారు.

### లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుకు
# కేంద్ర కేబినెట్ ఆమోదం

**దోషులకు పదేళ్ల వరకు జైలు, రూ. 10 కోట్ల వరకు జరినామా**



**న్యూఢిల్లీ :** పేపర్ లీక్‌లకు సంబంధించి కఠినమైన శిక్షలను నిర్ధారించే ముసాయిదా బిల్లుకు కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటన చేసిన కొన్ని గంటల తర్వాత ఆ బిల్లుకు ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో, ప్రస్తుతం ఉన్న చట్టాల కంటే పేపర్ లీక్‌లలో పాల్గొన్న వారికి కఠినమైన శిక్షలు విధించే ముసాయిదా బిల్లుకు ఆమోదం లభించిందని ఆ వర్గాలు తెలిపాయి. ప్రశ్నాపత్రాల లీక్ ఘటనలో దోషులకు పదేళ్ల వరకు జైలు, రూ. 10 కోట్ల వరకు జరినామా విధించేలా ముసాయిదా బిల్లును రూపొదించినట్లు తెలుస్తోంది. కాగా, ప్రజా ప్రశ్నపత్రాల లీకేజీ వివాదాలు తీవ్రంగా ఉన్నప్పుడు, 2024లో కూడా కేంద్రం ఒక కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది.

'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్, 2024'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపిన దాదాపు నాలుగు నెలల తర్వాత, నీట్, నెట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణల కారణంగా తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో, 2024 జూన్‌లో ఈ బిల్లును నోటిఫై చేశారు. ఈ చట్టానికి ముందు, కేంద్ర ప్రభుత్వం, ఏజెన్సీలు నిర్వహించే ప్రజా పరీక్షలలో పాలు పంచుకునే వివిధ సంస్థలు అవలంబించే అనుచిత పద్ధతులు లేదా పాల్పడే నేరాలను ఎదుర్కోవడానికి నిర్దిష్టమైన చట్టం ఏదీ లేదు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి), రైల్వేలు, బ్యాంకింగ్ నియామక పరీక్షలు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) వంటి సంస్థలు నిర్వహించే ప్రజా పరీక్షలలో అనుచిత పద్ధతులను నిరోధించడమే ఈ చట్టం లక్ష్యం. మోసాలను అరికట్టడానికి మునుపటి బిల్లులో కనీసం మూడు నుండి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, వ్యవస్థీకృత మోస నేరాలలో పాల్గొన్న వారికి ఐదు నుండి పది సంవత్సరాల జైలు శిక్ష, కనీసం రూ. 1 కోటి జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. ఈ బిల్లులో 'ప్రజా పరీక్షా ప్రాధికార సంస్థ ద్వారా ఇతర ప్రభుత్వ సంస్థల సేవలను వినియోగించుకోవడం', 'నిబంధనలు, ప్రమాణాలు, మార్గదర్శకాలను రూపొందించడం', 'అనుచిత పద్ధతులు లేదా నేరాల సంఘటనలను నివేదించడం' వంటి నిబంధనలు ఉన్నాయి. ప్రజా పరీక్షా కేంద్రాల పరీక్ష సంసిద్ధత కోసం ప్రీఆడిట్, అభ్యర్థుల చెక్‌ఇన్, బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్, భద్రత, స్క్రీనింగ్, సీట్ల కేటాయింపు, ప్రశ్నపత్రాల సెట్టింగ్, లోడింగ్, పరీక్షలో పర్యవేక్షణ, పరీక్షానంతర కార్యకలాపాలు, స్క్రైబ్‌లను అందించడానికి మార్గదర్శకాలు వంటి పరీక్షకు ముందు కార్యకలాపాలు కూడా నిబంధనలలో భాగంగా ఉన్నాయి. ప్రశ్నాపత్రాలను లీక్ చేయడం, ఒఎంఆర్ షీట్లను తారుమారు చేయడం, నకిలీ వెబ్‌సైట్‌లను సృష్టించడం, నకిలీ అడ్మిట్ కార్డులను జారీ చేయడం వంటి 15 చట్టవిరుద్ధమైన చర్యలను ఈ బిల్లు వివరిస్తుంది.

# ప్రధాన్ ఒక నేరపూరిత మంత్రి

**ఆయన భారత విద్యా వ్యవస్థ పతనానికి ప్రతీక**
**రాహుల్‌గాంధీ మండిపాటు**
**పెల్లెట్ గన్ కాల్పుల్లో గాయపడిన విద్యార్థిని మీడియా ముందు ప్రవేశపెట్టిన ప్రతిపక్షనేత**



**న్యూఢిల్లీ :** ధర్మేంద్ర ప్రధాన్ ఒక నేరపూరిత విద్యాశాఖ మంత్రి అని, ఆయన భారత విద్యా వ్యవస్థ పతనానికి ప్రతీక అని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. 20వ తేదీ నాటి నిరసనల సమయంలో భద్రతా సిబ్బంది జరిపిన పెల్లెట్ గన్ కాల్పుల్లో గాయపడిన విద్యార్థిని ఆయన శుక్రవారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. విద్యార్థులపై కాల్పులు జరిపిన, లాఠీచార్జ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని కూడా డిమాండ్ చేశారు. 'నిరసనకారులు పెల్లెట్ గన్ దాడులకు గురయ్యారని మీరు అంటున్నారు. అసలు పెల్లెట్ గన్‌లతో ఎప్పుడు కాల్పులు జరిపారో నేను వివరించాలనుకుంటున్నాను. నా సోదరుడు చేతిలో త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పుడు పెల్లెట్ గన్ దాడికి గురయ్యాడు' అని రాహుల్‌గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ నివాసం (10, జన్పథ్) బయట మీడియాతో మాట్లాడుతున్నప్పుడు, సాహిల్ అని తనను తాను పరిచయం చేసుకున్న ఆ గాయపడిన నిరసనకారుడు ఆయన పక్కనే ఉన్నారు. ఆ యువకుడి గాయాలను మీడియాకు చూపించడానికి అతని టీషర్ట్‌ను పైకి లేపుతూ, సాహిల్ కన్ను దెబ్బతిన్నదని, ఆ కంటితో అతను చూడలేకపోతున్నాడని రాహుల్ చెప్పారు. 'ఇదే మన దేశ భవిష్యత్తు. వేలాది మంది యువతకు ఇలాగే జరిగింది; వారిపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపారు, లాఠీచార్జ్‌లో కొట్టారు. వారు ఏం చేస్తున్నారు? వారు శాంతియుత నిరసనలు చేస్తున్నారు' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. పోలీసు బలగాల్లో నియామకం కోసం సాహిల్ పరీక్ష రాశాడని, అయితే ప్రశ్నపత్రం లీక్ అయిందని రాహుల్ తెలిపారు. 'అతని (సాహిల్) తల్లిదండ్రులు తమ కష్టార్జితంతో అతనికి ఈ అవకాశాన్ని కల్పించారు. ప్రభుత్వం అబద్ధాలు చెప్పడం మానేయాలి. ప్రభుత్వం మన భవిష్యత్తుపై దాడి చేసింది' అని అన్నారు. సాహిల్ కన్ను కాపాడగలమో లేదో కూడా గ్యారెంటీ లేదని ఆయన అన్నారు. ఈ సోదరుడిపై కాల్పులు జరగడానికి ప్రధానే కారణం, వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు చేయడానికి ఆయనే కారణమని మండిపడ్డారు.

**డియుపై రాహుల్ మండిపాటు**

జంతర్ మంతర్ నిరసనలకు దూరంగా ఉండాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థులను హెచ్చరించడంతో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆ విశ్వవిద్యాలయంపై విరుచుకుపడ్డారు. తమ ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటున్నందుకు విద్యార్థులను బెదిరించడానికి ఎంత ధైర్యం అని ఆయన ప్రశ్నించారు. 'జంతర్ మంతర్‌కు దూరంగా ఉండండి' అని విద్యార్థులకు సలహా ఇస్తున్న ఢిల్లీ విశ్వవిద్యాలయం సోషల్ మీడియా పోస్ట్‌ను ట్యాగ్ చేస్తూ, 'దయచేసి గమనించండి, సమయం వచ్చినప్పుడు జవాబుదారీగా ఉండవలసింది మీరే' అని అన్నారు. గురువారం రాత్రి ఢిల్లీ విశ్వవిద్యాలయం చేసిన ఒక పోస్ట్‌కు ప్రతిస్పందనగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ పోస్ట్‌లో, 'ప్రియమైన విద్యార్థులు, అధ్యాపకులారా, మీ భద్రత మాకు ముఖ్యం. దయచేసి గమనించండి, భారత సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కఠినంగా నియంత్రించబడే న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ఏవైనా చట్టవిరుద్ధమైన సమావేశాలు లేదా ప్రదర్శనలు చట్టపరమైన చర్యలకు దారితీయవచ్చు' అని ఉంది. ఇలాంటి కార్యకలాపాలు విద్యార్థుల వ్యక్తిగత భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగించడమే కాకుండా, వారి విద్యా పురోగతి, వృత్తిపరమైన అవకాశాలపై కూడా గణనీయంగా ప్రభావం చూపుతాయని విశ్వవిద్యాలయం తెలిపింది.

## రాజ్యసభలో 'వందే మాతరం'

**న్యూఢిల్లీ :** నీట్ యుజి 2026 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం' బిల్లును ప్రవేశపెట్టింది. 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ హానర్' (సవరణ)2026 పేరిట బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా తరఫున కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని సిపిఐ, సిపిఎం వ్యతిరేకించాయి. అయితే బిల్లు ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు నీట్ అంశంపై నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించడంతో సభను సోమవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపాదిత బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ ఆనర్ 1971లో సవరణలు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతం 'జనగణమన'కు ఉన్న చట్టపరమైన రక్షణను 'వందే మాతరం' గీతానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది.

**బిల్లును వ్యతిరేకించిన ప్రతిపక్షం**

బిల్లు ప్రవేశపెట్టడాన్ని సిపిఐ సభ్యులు పి. సంతోష్ కుమార్, జాన్ బ్రిట్టాస్ తీవ్రంగా వ్యతిరేకించారు. వందే మాతరాన్ని తాను గౌరవిస్తానని పేర్కొన్న సంతోష్ కుమార్, ఈ బిల్లు ద్వారా రవీంద్రనాథ్ ఠాగూర్, బంకిమ్ చంద్ర చటోపాధ్యాయ మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దీనిపై సభాపతి జోక్యం చేసుకుని బిల్లుకు సంబంధించిన అంశాలకే పరిమితమై మాట్లాడాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ఆందోళనల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. ఇతర ప్రతిపక్ష సభ్యులు కూడా ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. దేశభక్తిని చట్టాల ద్వారా సృష్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ వివాదం, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ వంటి అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు.

## మీడియా కథనాలు బాధ్యతారాహిత్యం

**సిజెఐ సూర్యకాంత్**
**తనకు అందింది వినతిపత్రమే, పిటిషన్ కాదని స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ :** జంతర్‌మంతర్ వద్ద జులై 20న విద్యార్థులపై పోలీసులు జరిపిన చర్యను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణను తాను నిరాకరించినట్లు వచ్చిన మీడియా కథనాలను భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ శుక్రవారం కొట్టిపారేశారు. ఆ కథనాలను 'బాధ్యతారహిత్యం'అని వ్యాఖ్యానించారు. అది కేవలం ఒక వినతిపత్రం మాత్రమేనని, పిటిషన్ కాదని సిజెఐ స్పష్టంచేశారు. అలాంటి పిటిషన్ ఏదీ దాఖలు కాలేదని ఆయన పేర్కొన్నారు. గత రెండు రోజులుగా, ఒక కేసు దాఖలైందని పూర్తిగా ఒక తప్పుడు ప్రకటన చేశారని, ప్రధాన న్యాయమూర్తి ఆ కేసును విచారణకు స్వీకరించడానికి నిరాకరించారని, మీడియా అన్నివిధాలుగా బాధ్యత వహించకుండా తప్పుగా ప్రచారం చేస్తోందని సిజెఐ సూర్యకాంత్ తెలియజేశారు.

## దేశంలో వైద్య విద్యను విస్తరిస్తున్నాం

**లోక్‌సభకు మంత్రి అనుప్రియ పటేల్ వెల్లడి**

**న్యూఢిల్లీ :** దేశంలో వైద్య కళాశాలల సంఖ్య 2014లో 387 నుంచి 844కు పెరిగిందని, అదే సమయంలో ఎంబిబిఎస్ సీట్ల సంఖ్య 51,348 నుంచి 1,39, 489కి పెరిగాయని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ శుక్రవారం లోక్‌సభకు తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాన్ని వెల్లడించారు. కాగా అదే కాలంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లు 31,185 నుంచి 86,360కు పెరిగాయని వివరించారు. మారుమూల, వెనకబడిన ప్రాంతాలలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, ఎంబిబిఎస్ కోర్సుల విస్తరణతో పాటు దేశవ్యాప్తంగా డాక్టర్ల లభ్యత మెరుగుపడి, ఆరోగ్య సంరక్షణ సేవలు బలోపేతం అవుతాయని ఆశిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఎంబిబిఎస్ పాఠ్య ప్రణాళికలో విలీనం చేయబడిన కుటుంబ దత్తత కార్యక్రమం (ఎఫ్ఏపి) గురించి కూడా పటేల్ ప్రముఖంగా ప్రస్తావించారు. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసి) ప్రవేశపెట్టిన జిల్లా రెసిడెన్సీ ప్రోగ్రాం (డిఆర్‌పి) ప్రకారం, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు తమ శిక్షణలో భాగంగా జిల్లా ఆసుపత్రుల్లో మూడు నెలలపాటు పోస్టింగ్ పొందడం తప్పనిసరి అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం గ్రామీణ, వెనకబడిన ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి వివరించారు.

### రేబిస్ నిరోధక వ్యాక్సిన్ కొరతపై
# కేంద్రానికి ఎలాంటి సమాచారం లేదు

**లోక్‌సభకు మంత్రి జెపి నడ్డా వెల్లడి**

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా రేబిస్ నిరోధక వ్యాక్సిన్ (ఏఆర్‌వి) కొరత ఉందని ప్రభుత్వానికి ఎలాంటి సమాచారం అందలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. శుక్రవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి.నడ్డా ఈ విషయాన్ని లోక్‌సభకు తెలిపారు. అయితే, పెరిగిన డిమాండ్, కొనుగోళ్లలో జాప్యం లేదా సరఫరా గొలుసు సమస్యల కారణంగా కొన్ని ఆరోగ్య సౌకర్యాలలో తాత్కాలిక కొరతలు ఏర్పడవచ్చని, అటువంటి పరిస్థితులను సంబంధిత రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు అందుబాటులో ఉన్నటువంటి నిల్వల పున: పంపిణీ, అత్యవసర కొనుగోళ్లు, సప్లయ్ చైన్ నిర్వహణను బలోపేతం చేయడం ద్వారా పరిష్కరిస్తాయని పేర్కొన్నారు. ఆరోగ్యం అనేది రాష్ట్ర పరిధిలోని అంశమన్నారు. ప్రజారోగ్య కేంద్రాలలో యాంటీ–రేబిస్ వ్యాక్సిన్, రేబిస్ ఇమ్యునోగ్లోబులిన్(ఆర్ఐజి)ల సేకరణ, పంపిణీ, నిరంతరాయ లభ్యతను నిర్ధారించే ప్రాథమిక బాధ్యత ఆయా రాష్ట్ర, కేంద్రపాలిత ప్రభుత్వాలదేనని ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా స్పష్టంచేశారు. 'దేశ వ్యాప్తంగా రేబిస్ నిరోధక టీకాల కొరత ఉందని భారత ప్రభుత్వానికి ఎలాంటి నివేదికలు అందలేదని ఆయన చెప్పారు.రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించడం ద్వారా జాతీయ రేబిస్ నియంత్రణ కార్యక్రమం (ఎన్‌ఆర్‌సిపి) అమలును కేంద్రం నిరంతరం సమీక్షిస్తున్నదని తెలిపారు. నేషనల్ ఫ్రీ డ్రగ్ ఇనిషియేటివ్ (ఎన్ఎఫ్‌డిఐ) కింద కేటాయించిన నిధుల ద్వారా ఏఆర్‌వి, ఆర్ఐజి సప్లయ్‌ని నిరంతరాయంగా కొనసాగించాలని అన్ని రాష్ట్రాలకు ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తున్నామని మంత్రి నడ్డా తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద రాష్ట్రాలు తమ కార్యక్రమ అమలు ప్రణాళికలలో సమర్పించిన ప్రతిపాదనల ఆధారంగా వ్యవస్థలను బలోపేతం చేయడానికి కేంద్రం సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నదని వివరించారు.

### పరీక్ష వివాదాల నేపథ్యంలో...
# అధికారుల వరుస బదిలీలు

**విద్యా శాఖ ప్రక్షాళన దిశగా కేంద్రం చర్యలు షురూ**

**న్యూఢిల్లీ :** ప్రశ్న పత్రాల లీకులు, సిబిఎస్ఇ డిజిటల్ మూల్యాంకనంలో తలెత్తిన సాంకేతిక లోపాలతో సహా విద్యా శాఖకు సంబంధించిన ఇటీవలి వివాదాల నేపథ్యంలో ఉన్నతాధికారుల వరుస బదిలీల పరంపర చోటుచేసుకుంది. అదే సమయంలో విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. 'నీట్' యుజి పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనలు ఉధృతం కావడంతో కేంద్రం గురువారం రాత్రి పొద్దుపోయాక ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి వినీత్ జోషిని తొలగించింది. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ప్రభుత్వానికి సన్నిహితుడిగా పేరొందిన వినీత్ జోషి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఏజెన్సీ (సిబిఎస్ఇ) చైర్మన్‌గా, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) మొదటి డైరెక్టర్ జనరల్‌గా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) తాత్కాలిక చైర్మన్‌గా సహా భారతదేశ విద్యా వ్యవస్థలో అత్యంత ప్రభావవంతమైన కొన్ని పదవులను నిర్వహించారు. జూన్ 30న సంజయ్‌కుమార్ పాఠశాల విద్య కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన తర్వాత, వినీత్ జోషి ఆ పదవీ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. జోషి ఎన్‌టిఏలో ఉన్న పదవీకాలంలో కీలకమైన ఆ పరీక్షలలో తలెత్తిన సాంకేతికలోపాల కారణంగా ప్రభుత్వం ఎదుర్కొన్న తీవ్ర విమర్శల మధ్య కూడా అండర్ గ్రాడ్యుయేట్ అడ్మిషన్ల కోసం కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (సియుఇటి)ని ప్రవేశపెట్టారు. ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో జాతిహింస చెలరేగినప్పుడు, 2023లో ఆయనను ఆ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా నియమించారు. ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిగా ఆయన్ను బదిలీ చేసిన తర్వాత జోషి పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా నియమితులయ్యారు. నరేష్ కుమార్ గంగ్వార్ ఉన్న త విద్యాశాఖ కార్యదర్శిగా నియమితులు కాగా, టి.కె.అనిల్ కుమార్‌ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిగా నియమించారు. గంగ్వార్ పశు సంవర్థక శాఖలో సెక్రటరీగా నియమితులయ్యాక, అక్కడ ఆయన వివిధ కారణాల వల్ల వార్తల్లోకి ఎక్కారు. మీడియా కథనాల ప్రకారం, గంగ్వార్ కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు 1994 బ్యాచ్ రాజస్థాన్ కేడర్‌కు చెందిన ఒక ఐఎఎస్ అధికారి జాతీయ ఉద్యానవన బోర్డ్ పథకం కింద ఐదేళ్లలో రూ.1.16 కోట్లకు పైగా సబ్సిడీలను అందుకున్నారు. గంగ్వార్ గతంలో పర్యావరణ. అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేశారు.అక్కడ ఆయన కాలుష్య నియంత్రణ, ప్రమాదకర పదార్థాల వ్యవహారాలను పర్యవేక్షించారు. టికె.అనిల్ కుమార్ గతంలో గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేశారు. గ త రెండునెలలుగా వివాదాల కేంద్ర బిందువుగా ఉన్నటువంటి విద్యా మంత్రిత్వ శాఖలో మొదటగా 12వ తరగతి కోసం సిబిఎస్ఇ ప్రవేశపెట్టిన ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం)లోని లోపాలపై, ఆ తర్వాత నీట్ పేపర్ లీక్ చట్టంపై చెలరేగిన వివాదం కారణంగా ఇటీవలి కాలంలో పలువురు అధికారులను తొలగించారు. గత నెలలో, మంత్రిత్వ శాఖ సిబిఎస్ఇ చైర్మన్ రాహుల్ సింగ్, సెక్రటరీ హిమాంశు గుప్తా ఇద్దరినీ బదిలీ చేసి వారి స్థానంలో లోఖండే ప్రశాంత్ సీతారామ్, వరుణ్ భరద్వాజ్‌ను నియమించారు. సిబిఎస్ఇ 12వ తరగతి బోర్డ్ పరీక్షల కోసం ఉపయోగించే ఓఎస్ఎం సిస్టమ్‌లో సాంకేతిక లోపం, అస్పష్టమైన జవాబు పత్రాలు, మూల్యాంకన లోపాలపై చెలరేగిన భారీ నిరసనల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో మీడియా, కమ్యూనికేషన్ మంత్రిత్వశాఖ చీఫ్‌గా ఉన్న ఆంచల్ కటియార్‌ను కూడా తొలగించారు. కటియార్‌ను పశు సంవర్థక మంత్రిత్వ శాఖకు బదిలీ చేయగా, ఆమె స్థానంలో రష్మీ రోజా తుషార నాయర్‌ను నియమించారు. నీట్ యుజి పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీలు, నిరసకారులపై పోలీసుల అణచివేత ఆరోపణలు, జవాబుదారీతనం కోసం కొనసాగుతోన్న డిమాండ్ల కారణంగా విద్యార్థుల నేతృత్వంలో జరుగుతున్న నిరసనలు దేశవ్యాప్త ఆందోళనలుగా మారాయి.

**వరంగల్ మహా నగర పాలక సంస్థ**

**ప్రకటన**

Roc.No. HO/F1/21871/2022-2026 దివి: 23-07-2026

విషయం : వరంగల్ మహా నగర పాలక సంస్థ - ప్రజారోగ్య విభాగం నగర పాలక సంస్థ యందు కోడి మాంస వ్యర్థాలను సేకరించుటకు (కాశీబుగ్గ సర్కిల్ / కాజీపేట్ సర్కిల్ ) యందు విడివిగా సేకరించుటకు ఆసక్తి గల వారు బహిరంగ వేలం ద్వారా దరఖాస్తులు స్వీకరించుటకు గురించి.

-000-

వరంగల్ మహా నగర పాలక సంస్థ కమీషనర్ గారు నగర పాలక సంస్థ యందు కోడి మాంస వ్యర్థాలను సేకరించుటకు గాను అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను దివి. 30-07-2026 సా.4.00 వరకు కోరుచు నిర్ణయించిన బిడ్ మొత్తము పై ఎక్కువ మొత్తం వేలం పాటలో పాల్గొనుటకు దివి. 31-07-2026 నిర్ణయించి తెలియజేయనైనది.

పై విషయముల విధి నియమాల గురించి వరంగల్ మహా నగర పాలక సంస్థ హెడ్ ఆఫీస్ (ప్రజారోగ్య విభాగం) నందు రూ.500/- చెల్లించి పొందగలరు, ఈ కార్యాలయ వెబ్‌సైట్ https://www.gwmc.gov.in/Tenders.aspx

సం/- కమీషనర్
వరంగల్ మహానగర పాలక సంస్థ

DIPR R.O. No. : 6694-PP/CL/ADVT/2026-27, Date: 24-07-2026

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS25T-0699 | Boddu Rajaiah | TATA LPT 3118 CUMMINS FBT-T | 2016 |
| 2 | TS27B 4815 | Attem Ramesh | ZEST 1.3L XT QUADRAJET 90PS DIESEL 5 SEATER | 2018 |
| 3 | TG25T 0568 | Sunchu Roja | MARUTI DZIRE BS6 PETROL-P | 2022 |
| 4 | TS04UB 6965 | Raghu Ambati | MAHINDRA BOLERO MAXI TRUCK PLUS | 2016 |
| 5 | AP29BP 4288 | Repakula Srinivas Rao | I20 I GEN MAGNA (O) DIESEL 5 SEATER | 2011 |
| 6 | TS12UA 7647 | Marati Madhu | 275IDI07ATYS04360 | 2016 |
| 7 | TS28TA-0277 | Shekar Marapaka | TATA SIGNA 4223.TK FBT | 2019 |
| 8 | TS07ER-1158 | Bonagani Raju | ZEST 1.2L XE REVOTRON 90PS PETROL 5 SEATER | 2015 |
| 9 | TS07EG-2483 | Naresh Gajula | SWIFT DZIRE VXI PETROL 5 SEATER | 2014 |
| 10 | TS10EH-8001 | Pidisilla Veerachari | SCROSS 1.6L ALPHA DIESEL 5 SEATER | 2016 |


**AUCTION DATE : 25-07-2026**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
1st Floor H.No. 6-159, Above DCC Bank Reddy Colony, Bhupalpally, Jayashankar Bhupalpally District - 506169.
Cell : 9849981545, 9949340057

# ఇరాన్‌పై కొనసాగుతున్న అమెరికా దాడులు



**జెరుసలేం :** అమెరికా–ఇరాన్ మధ్య ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్య పోరు కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికా వరుసగా 13వ రాత్రి కూడా ఇరాన్‌లోని సైనిక లక్ష్యాలపై వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడులు ముగిసిన కొద్ది గంటలకే బహ్రెయిన్‌లో క్షిపణి లేదా రాకెట్ దాడుల ముప్పు గుర్తించిన అధికారులు హెచ్చరిక సైరన్లు మోగించి, ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. గత వారం రోజులుగా గల్ఫ్ దేశాలు తరచూ దాడుల ముప్పును ఎదుర్కొంటున్నాయి. అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకారం, హోర్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణించే వాణిజ్య నౌకలు, పౌర నౌకలకు ముప్పు కలిగించే ఇరాన్ సామర్థ్యాన్ని బలహీనపరచడమే తాజా దాడుల ప్రధాన ఉద్దేశం. ఈ జలసంధి మీదుగా సాధారణ పరిస్థితుల్లో ప్రపంచ చమురు, సహజవాయు సరఫరాలో దాదాపు ఐదో వంతు రవాణా జరుగుతుంది. మరోవైపు ఇరాన్ ప్రభుత్వ మీడియా కథనాల ప్రకారం, అమెరికా క్షిపణి దాడుల్లో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఇదే సమయంలో యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు మరో కీలక సముద్ర మార్గమైన 'బాబ్ ఎల్ మండెబ్' జలసంధిని కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు.
ఎర్ర సముద్రాన్ని ఏడెన్ అఖాతంతో కలిపే ఈ మార్గం గుండా ప్రపంచ వాణిజ్యంలో సుమారు 12 శాతం, కంటైనర్ రవాణాలో దాదాపు నాలుగో వంతు జరుగుతుంది. ఇప్పటికే హౌతీలు ఎర్ర సముద్రంలో రెండు సౌదీ చమురు ట్యాంకర్లపై దాడి చేసినట్లు ప్రకటించారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, బాబ్ ఎల్ మండెబ్‌లో కూడా అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన సరఫరా, వాణిజ్య వ్యవస్థలకు తీవ్ర దెబ్బ తగలొచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో హౌతీలు నౌకలపై దాడులు కొనసాగిస్తే తీవ్రమైన సైనిక ప్రతిస్పందన ఇస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ హెచ్చరించారు.

# ప్రపంచ దేశాలపై మరోసారి ట్రంప్ టారిఫ్ దెబ్బ



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ మరోసారి తన వాణిజ్య విధానాన్ని కఠినతరం చేశారు. ప్రపంచంలోని కనీసం 60 దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువులపై 10 నుంచి 12.5 శాతం వరకు కొత్త సుంకాలను (టారిఫ్‌లు) విధిస్తున్నట్లు ప్రకటించారు. 'బలవంతపు శ్రమ'తో తయారైన వస్తువుల దిగుమతిని అరికట్టడంలో ఆయా దేశాలు తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ, ఈ నిర్ణయానికి ఆయన ప్రభుత్వం వివరణ ఇచ్చుకుంది. ఇప్పటికే అమలు చేస్తున్న టారిఫ్ గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యతను సంతరించుకుంది. అమెరికాలో దాదాపు శతాబ్దకాలంగా బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతిపై నిషేధం అమలులో ఉందని, ఇతర దేశాలు కూడా అదే స్థాయిలో చట్టాలను అమలు చేయాలని ట్రంప్ ప్రభుత్వం చెబుతోంది. ఈ కొత్త విధానం ప్రకారం, బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతిని నిరోధించే చట్టాలు లేని లేదా వాటిని సమర్థంగా అమలు చేయని దేశాలపై 12.5 శాతం సుంకం విధిస్తున్నారు. ఈ జాబితాలో చైనా, ఇజ్రాయెల్, బ్రిటన్, జపాన్ వంటి దేశాలు ఉన్నాయి. మరోవైపు, భారతదేశం, శ్రీలంక, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు ఇప్పటికే అలాంటి చట్టాలను అమలు చేస్తున్నాయని అమెరికా గుర్తించింది. అయితే, వాటి అమలులో మరింత కఠినత్వం అవసరమని పేర్కొంటూ ఈ దేశాలపై 10 శాతం సుంకాన్ని కొనసాగించింది. అందువల్ల భారతదేశంపై కొత్తగా అదనపు భారం పడలేదు. ఇప్పటికే అమలులో ఉన్న 10 శాతం సుంకమే కొనసాగుతుంది. కాగా, ఈ నిర్ణయం వెనుక మరో ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక కోణం కూడా ఉందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. వారి అభిప్రాయాన్ని అనుసరించి, అమెరికా సుప్రీం కోర్టు ఈ ఏడాది ఫిబ్రవరిలో ట్రంప్ గతంలో విధించిన 'లిబరేషన్ డే' టారిఫ్‌లను చట్టపరంగా కొట్టివేయడంతో, వాటికి బదులుగా కొత్త చట్టపరమైన ఆధారాలతో సుంకాలను కొనసాగించే ప్రయత్నం ట్రంప్ ప్రభుత్వం చేస్తోంది. బలవంతపు శ్రమ నిరోధక చట్టాలను ఈసారి ప్రధాన ఆధారంగా ఉపయోగించింది. భారత్‌కు తక్షణంగా పెద్ద నష్టం కనిపించకపోయినా, అమెరికా మార్కెట్‌కు ఎగుమతులు చేసే భారత కంపెనీలు ఇప్పటికే అమలులో ఉన్న 10 శాతం అదనపు సుంకాన్ని భరించాల్సి ఉంటుంది. ముఖ్యంగా వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు వంటి రంగాలపై దీని ప్రభావం పడే అవకాశం ఉంది. అదే సమయంలో చైనాపై 12.5 శాతం సుంకం విధించడం వల్ల కొన్ని ఉత్పత్తుల తయారీలో భారత్‌కు పోటీ ప్రయోజనం లభించే అవకాశాన్ని కూడా కొందరు ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అయితే, ట్రంప్ ప్రభుత్వం ఇక్కడితో ఆగేలా కనిపించడం లేదు. అధిక ఉత్పత్తి సామర్థ్యానికి ప్రభుత్వ సబ్సిడీలు ఇస్తున్న దేశాల నుంచి వచ్చే తక్కువ ధరల వస్తువులపై కూడా మరో విడత సుంకాలు విధించే యోచనలో ఉన్నట్లు అమెరికా వర్గాలు తెలిపాయి. ఈ చర్యలు ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో కొత్త ఉద్రిక్తతలకు దారితీసే అవకాశముంది. భవిష్యత్తులో అంతర్జాతీయ వాణిజ్య చర్చల్లో కీలక అంశంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

## 14 ఇయు సంస్థలపై చైనా ఎగుమతి నియంత్రణ

**బీజింగ్ :** రష్యాపై ఆంక్షల విషయంలో యూరోపియన్ యూనియన్ (ఇయు), చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. రష్యాకు సహకరిస్తున్నాయనే ఆరోపణలతో ఇయు తాజాగా 14 చైనా, హాంకాంగ్‌కు చెందిన సంస్థలపై ఆంక్షలు విధించగా, దానికి ప్రతిస్పందనగా చైనా కూడా 14 యూరోపియన్ సంస్థలపై ఎగుమతి నియంత్రణలు విధించింది. చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటించిన నిర్ణయం ప్రకారం, ఇకపై ఆ 14 యూరోపియన్ సంస్థలకు 'డ్యూయల్‌యూజ్' ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి చైనా కంపెనీలకు అనుమతి ఉండదు. డ్యూయల్‌యూజ్ ఉత్పత్తులు అంటే పౌర అవసరాలకు, అలాగే సైనిక అవసరాలకు కూడా ఉపయోగపడే వస్తువులు, సాంకేతిక పరిజ్ఞానం. అంతేకాకుండా, విదేశీ కంపెనీలు కూడా చైనాలో తయారైన ఇలాంటి ఉత్పత్తులను ఆయా యూరోపియన్ సంస్థలకు సరఫరా చేయరాదని బీజింగ్ స్పష్టం చేసింది. ఈ ఆంక్షలతో ప్రభావితమయ్యే సంస్థల్లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన వాహన తయారీ సంస్థ టాట్రా ట్రక్స్, ఇటలీకి చెందిన విద్యుత్ మోటార్ల తయారీ సంస్థ లాఫెర్ట్ ఎస్‌పిఎ, జర్మనీకి చెందిన సిండ్ల్ హౌజర్ మెటీరియల్స్ జిఎంబిహెచ్, ఫ్రాన్స్‌కు చెందిన డ్రోన్ తయారీ సంస్థ కావోక్ యుఎవి ఉన్నాయి. ఉక్రేన్‌పై యుద్ధం కొనసాగిస్తున్న రష్యాకు సైనిక, సాంకేతిక సామగ్రి అందుతున్న మార్గాలను అడ్డుకునేందుకు ఇయు ఇటీవల 21వ విడత ఆంక్షలను అమలు చేసింది. ఇందులో రష్యాతో పాటు చైనా, భారత్, టర్కీకి చెందిన కొన్ని సంస్థలు కూడా ఉన్నాయి.

# ఇరాక్‌లోని అమెరికా సైనిక స్థావరాల సమీపంలో వరుస పేలుళ్లు



**ఇర్బిల్ :** ఇరాక్ ఉత్తర ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరం సమీపంలో శుక్రవారం ఉదయం వరుస పేలుళ్లు సంభవించాయి. అమెరికా సైన్యం ఇరాన్‌పై వరుసగా 13వ రాత్రి వైమానిక దాడులను ముగించినట్టు ప్రకటించిన కొన్ని గంటలకే ఈ ఘటన చోటుచేసుకోవడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఇరాక్‌లోని స్వయంప్రతిపత్తి కలిగిన కుర్దిష్ ప్రాంత రాజధాని ఇర్బిల్‌లో ఉదయం సుమారు 9.30 గంటలకు కనీసం ఏడు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. అనంతరం అమెరికా స్థావరం లోపల లేదా సమీప ప్రాంతాల నుంచి నల్లటి పొగలు ఎగసిపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యం విషయంలో అమెరికా, ఇరాన్‌ల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా తాజాగా ఇరాన్‌లోని పలు సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో నలుగురు మరణించగా, తొమ్మిది మంది గాయపడినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. మరోవైపు ఈ దాడుల ఉద్దేశం హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు ముప్పు కలిగించే ఇరాన్ సామర్థ్యాన్ని బలహీనపరచడమేనని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఈ ఉద్రిక్తతల మధ్య బహ్రెయిన్‌లో క్షిపణి హెచ్చరిక సైరన్లు రెండుసార్లు మోగించగా, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. ఇరాక్ ప్రధాని అలీ అల్ జైదీ శాంతి చర్చల కోసం టెహ్రాన్‌లో పర్యటిస్తూ, ఇరాక్ భూభాగాన్ని ఇరాన్‌పై దాడులకు వినియోగించనివ్వబోమని ప్రకటించారు. ఇదే సమయంలో ఇరాన్ మరో కీలక సముద్ర మార్గమైన బాబ్ ఎల్ మండెబ్ జలసంధిలో కూడా నౌకాయానాన్ని అడ్డుకునే హెచ్చరికలు జారీ చేయడంతో ప్రపంచ వాణిజ్యానికి కొత్త సవాళ్లు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది.

## నిరశన విరమణ

(మొదటి పేజీ తరువాయి)

రాజీనామా చేయకపోవడం వల్ల విద్యార్థులకు పెద్దగా నష్టం లేదు. కానీ, ధర్మేంద్రకు ఉన్న గుర్తింపు మాత్రం పోతుంది. ఒకవేళ ఆయన రాజీనామా చేసి ఉంటే, తన పేరు చెడిపోకుండా ఉండేది' అని సోనమ్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఉండకూడదని, కేసులు నమోదైతే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే విషయం తనకు తెలుసన్నారు. నీట్ పేపర్ లీకేజీ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని సోనమ్ తెలిపారు. పేపర్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతుందన్నారు. దేశంలో పరీక్షల నిర్వహణ అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు అన్ని పార్టీలు అంగీకరించాయని ఆయన వెల్లడించారు. వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను విరమించినట్లు ప్రకటించిన తర్వాత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్'లో వైద్యుల సలహా మేరకు సోనమ్ జీ తన దైనందిన జీవనశైలిని పాటించాలని, వీలైనంత త్వరగా తన బరువును తిరిగి పొందాలని కోరుకుంటున్నాన్నారు. కాగా, ఆసుపత్రిలో వాంగ్‌చుక్ భార్య గీతాంజలి అంగ్మో, ఇతరుల సమక్షంలో నడ్డా ప్రభుత్వ హామీలను చదివి వినిపించారు. 'ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై ఈనెల 20న పార్లమెంటుకు జరిగిన పాదయాత్రలో పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేయకపోవడం పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉంది. పరీక్షలకు సంబంధించిన పేపర్ లీక్‌లు, విద్యా సంస్కరణలపై పార్లమెంటులో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చింది' అని తెలిపారు. అంతేకాకుండా, ఇటీవలి నీట్ పేపర్ లీక్ ఘటనల కారణంగా ఆత్మహత్య చేసుకున్న బాధితులకు తగిన పరిహారం అందించే అంశాన్ని కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని పేర్కొన్నారు. అయితే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మొత్తం 65 మంది పార్లమెంటు సభ్యులు తనను సందర్శించారని లేదా దీక్షను విరమించాలని కోరుతూ లేఖలపై సంతకాలు చేశారని వాంగ్‌చుక్ తెలిపారు. 'వివిధ షరతులపై సుదీర్ఘ చర్చల తర్వాత, దేశంలో హింస చెలరేగే అవకాశం ఉన్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాను. ఆ షరతుల గురించి త్వరలోనే ఒక ప్రత్యేక వీడియోలో వివరంగా వివరిస్తాను. ఈలోగా, ఎక్కడా ఎటువంటి హింసకూ తావు లేకుండా చాలా అప్రమత్తంగా ఉండాలని మీ అందరినీ కోరుతున్నాను' అని ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

**ప్రధాన్ రాజీనామా చేసే వరకు శాంతియుత నిరసన : సిజెపి**

పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తన 26 రోజుల నిరాహార దీక్షను విరమించడం పట్ల 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) శుక్రవారం కృతజ్ఞతలు తెలిపింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు జంతర్ మంతర్ వద్ద తమ శాంతియుత నిరసన కొనసాగుతుందని స్పష్టం చేసింది. వాంగ్‌చుక్ చూపిన 'అసాధారణ ధైర్యసాహసాలకు, త్యాగానికి' ధన్యవాదాలు అని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో వెల్లడించారు. 'సోనమ్ 26 రోజుల తర్వాత తన నిరాహార దీక్షను విరమించడం ఎంతో ఉపశమనం కలిగించింది, మేము కృతజ్ఞతతో ఉన్నాము. మీఅసాధారణ ధైర్యసాహసాలకు ధన్యవాదాలు సార్. మీ ప్రాణాలను పణంగా పెట్టి, యావత్ దేశ మనస్సాక్షిని మేల్కొల్పారు అని దీప్కే అన్నారు.

## రాజీ ప్రసక్తే లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. మంత్రులు తమ డిమాండ్లను విన్నారని, తదుపరి వివరాలతో సిజెపిని సంప్రదిస్తామని నడ్డా చెప్పారని, నివారం మళ్లీ సమావేశం అవుతామని దాస్ చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్ విషయంలో ఎలాంటి రాజీ లేదని కేంద్ర మంత్రులకు తెగేసి చెప్పినట్లు సమావేశం తర్వాత దాస్ విలేకరులకు వెల్లడించారు. ఈ సమావేశంలో దాస్‌తో పాటు జూన్ 20న జంతర్ మంతర్ వద్ద ప్రారంభమైన నిరసనలకు నాయకత్వం వహిస్తున్న సిజెపి తరపున ఆ పార్టీ ప్రతినిధి అశుతోష్ రంకా కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.
ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం డిమాండ్‌తో పాటు, నిరసనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలని కూడా సిజెపి డిమాండ్ చేసిందని దాస్ చెప్పారు. రెండు ప్రధాన డిమాండ్లకు కేంద్రం అంగీకరించిందన్నారు. అయితే, మరో ప్రధాన డిమాండ్ విషయంలో కేంద్రం సమయం కోరిందన్నారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ విషయంలో కేంద్రం ఒక రోజు గడువు కోరిందన్నారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వానికి రాసిన లేఖలో సిజెపి తన వైఖరిని స్పష్టం చేసింది. 'పరస్పర ప్రయోజనకరమైన పరిష్కారాన్ని కనుగొనడంలో ప్రభుత్వం చూపిస్తున్న ఆసక్తిని గుర్తించిన ఆ పార్టీ, గత కొన్ని రోజులుగా, దేశవ్యాప్తంగా ఉన్న మద్దతుదారులు, సభ్యులు, జంతర్ మంతర్ వద్ద ఉన్న నిరసనకారులతో మేము విస్తృత సంప్రదింపులు జరిపాము. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, నీట్ బాధితులకు రూ. 1 కోటి పరిహారం, నిరసనకారులపై ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం అనే మా డిమాండ్ల విషయంలో ఎలాంటి రాజీ లేదనే స్పష్టమైన ఏకాభిప్రాయానికి వచ్చాము' అని పేర్కొంది. అంతేకాకుండా, బలగాల చేతిలో దారుణంగా దాడికి గురైన విద్యార్థులకు భారత ప్రభుత్వం, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఎఎఫ్) అధిపతి, ఢిల్లీ పోలీస్ కమిషనర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ డిమాండ్లను వీలైనంత త్వరగా అంగీకరించాలని కూడా ఆ సంస్థ కోరింది. లేనిపక్షంలో, ఈ ఉద్యమం మరింత ఉధృతమై దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని హెచ్చరించింది.
అంతేకాకుండా, పరీక్షల సంస్కరణలపై మా ఐదు సూత్రాల డిమాండ్ల పత్రంపై ప్రభుత్వం స్పందించాలని ఆశిస్తున్నామని తెలిపింది. విద్యా వ్యవస్థలో అవసరమైన పెద్ద నిర్మాణాత్మక సంస్కరణలను తీసుకురావడంలో ఈ పత్రం కీలక పాత్ర పోషిస్తుంది అని ఆ లేఖలో పేర్కొన్నారు. సిజెపికి, ప్రభుత్వానికి మధ్య జరిగిన మూడవ అధికారిక సమావేశం ఇది. 20న మంత్రి నివాసంలో నడ్డా, దాస్, రాంకాలతో వరుసగా రెండు సమావేశాలు నిర్వహించారు. అదే రోజు 'సంసద్ చలో' పిలుపునకు వేలాది మంది నిరసనకారులు స్పందించి పార్లమెంటు వైపు ర్యాలీ ప్రారంభించగా, పోలీసులు లాఠీలు, బాష్ప వాయువుతో వారిని వెనక్కి నెట్టారు. ఈ ఘటనలో అనేక మంది గాయపడ్డారు.

## కేంద్రానికి సమగ్ర నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం డిపిఆర్ ప్రాసెసింగ్ ముందుకు సాగడం లేదని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డిఎస్ఎ) సూచించిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బ్యారేజీలను ఫ్రీఫ్లో (నీటి నిల్వ లేకుండా) విధానంలో నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖకు పంపే లేఖలో ఎన్డీఎస్ఎ నివేదికలోని కీలక సిఫారసులు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం నివేదికలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫోటోలు, ఇతర ఇంజినీరింగ్ ఆధారాలు అన్నింటినీ కేంద్ర ప్రభుత్వానికి సమర్పించే నివేదికకు జతచేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.
బ్యారేజీలను నీటి నిల్వకు, పంపింగ్‌కు ఎందుకు వినియోగించడం లేదనే విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి వివరించి, సమర్థ సాంకేతిక సంస్థల నుంచి అధికారిక అభిప్రాయం కోరాలన్నారు. ప్రభుత్వ నిర్ణయం మొత్తం అధికారిక రికార్డులో ఉండాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులకు వెంటనే నివేదిక అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా స్వయంగా అందజేయాలన్నారు.
కాగా ఇటీవల కేంద్ర జల్ శక్తి మంత్రి చేసిన ప్రకటనలు, మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖలు సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నప్పటికీ, ఎన్‌డిఎస్ఎ నివేదికలో స్పష్టంగా సూచించిన 'ఫ్రీఫ్లో విధానంలో కొనసాగించాలనే అంశంపై ప్రత్యేకంగా ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. దీనిపైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ కాళేశ్వరం బ్యారేజీలపై జరుగుతున్న ప్రతి శాస్త్రీయ పరిశీలన, ప్రతి సాంకేతిక పరీక్ష కేంద్ర ప్రభుత్వం,ఎన్డీఎస్ఎ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రజల భద్రత, నిర్మాణాల స్థిరత్వం, శాస్త్రీయ ప్రమాణాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని ఆయన స్పష్టం చేశారు.

**అన్నారం బ్యారేజీలో నీటి నిల్వ సురక్షితం కాదు.. నీటి పారుదల శాఖ అధికారులు**

అన్నారం బ్యారేజీ రాఫ్ట్ ఫౌండేషన్ కింద కూడా ఖాళీలు ఉన్నట్టు సూచించే సాంకేతిక ఆధారాలు లభించాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ కూడా నీటిని నిల్వ చేయడం సురక్షితం కాదని నీటి పారుదల శాఖ అధికారులు వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధ్యయనాల ఆధారంగా మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ కాన్సెప్ట్ డిజైన్ ఈ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధమవుతుందని, సెప్టెంబర్ నాటికి ప్రాథమిక వ్యయ అంచనాలు కూడా సిద్ధం కానున్నాయని అధికారులు వివరించారు.కనిపించే నీరు ఒక్కటే ప్రమాణం కాదని, పంపింగ్‌కు శాస్త్రీయ పరిస్థితులు తప్పనిసరిఅని వివరించారు. కేవలం దిగువకు నీరు ప్రవహిస్తున్నందుకే పంపింగ్ సాధ్యమవుతుందని భావించడం సరికాదని అధికారులు స్పష్టం చేశారు.

## అర్ధరాత్రి ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

చర్చిస్తాం. సహచర మంత్రుల సూచనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటాం అని పేర్కొన్నారు. సోమవారం నాడు పార్లమెంటు వర్షాకాల సమావేశాల రెండో వారం ప్రారంభం కానుందని, ఆ సమయంలో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకునేలా రూపొందించిన బిల్లును సభలో ప్రవేశపెట్టి, వీలైనంత త్వరగా ఆమోదింపజేసేందుకు ప్రయత్నిస్తామని ఆయన పేర్కొన్నారు. పేపర్ లీకేజీ అనేది చిన్న విషయం కాదని, లక్షలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇటువంటి ఘటనలు ఎంతో బాధాకరమని తనకు తెలుసని ప్రధాన మంత్రి అన్నారు. అందుకే, సుమారు రెండున్నర నెలల క్రితం నీట్ పేపర్ లీక్ ఆరోపణలు వెలుగుచూసినప్పటి నుండి అనేక కఠిన చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. 'బాధ్యులైన వారిని పట్టుకున్నాం, వారు ఇప్పుడు జైలులో ఉన్నారు. విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని కోల్పోకుండా చూడటమే మా అత్యంత ముఖ్యమైన బాధ్యత. పరీక్షను వెంటనే నిర్వహించడం అవసరం. అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించుకుని, 22 లక్షల మంది విద్యార్థులు తిరిగి నిర్వహించిన పరీక్షకు హాజరయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది' అని ఆయన చెప్పారు. వైద్య విద్య ప్రవేశ పరీక్ష (రీటెస్ట్) ఫలితాలు 19న వెలువడ్డాయని, ఇందులో విజయం సాధించిన వారి నుంచి దేశవ్యాప్తంగా సంతోషకరమైన స్పందనలు వచ్చాయని మోదీ పేర్కొన్నారు. అయితే, కేవలం ఇంతటితోనే సంతృప్తి చెందే వారిలో తాను లేనని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. 'అందుకే, వేగవంతమైన విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాలను (ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు) ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాను. ఆ మేరకు ఇప్పటికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశారు అని ఆయన చెప్పారు.

## 'ఎక్స్'లో ప్రకటనలా? (మొదటి పేజీ తరువాయి)

మాధ్యమాల ద్వారా ప్రకటన చేయడం ఏమిటని ప్రధానిని నిలదీశారు. పార్లమెంటుకు వచ్చే ముందే కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని సూచించారు. మంత్రిని డిస్మిస్ చేసిన తర్వాతే పార్లమెంటు సమావేశాలకు ప్రధాని హాజరుకావాలని అన్నారు. అదే విధంగా, విద్యార్థులపై లాఠీఛార్జి చేయడానికి, డమ్మీ తూటాలు వాడడానికి ఆదేశాలిచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సభా ముఖంగా హామీ ఇవ్వాలని కోరారు. అంతేగాక, విద్యార్థులకు మోదీ క్షమాపణ చెప్పాలని, అప్పుడే విద్యా విధానంపై చర్చకు తాము సహకరిస్తామని ఖర్గే స్పష్టం చేశారు.

## వీకెండ్ టెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

ఆలస్యంగా నడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు ధర్నా పరిసరాలలో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగిస్తున్నారు. ఢిల్లీకి చేరుకున్న వారిని జంతర్ మంతర్ వెళ్ళకుండా పోలీసులు ఇప్పటికే నిరుత్సాహపరుస్తున్నారు. ఎలాంటి వాహన, మెట్రో సౌకర్యాలు లేనప్పటికీ పెద్ద ఎత్తున ప్రజలు కాలి నడకనే వ్యయప్రయాసలకోర్చి చేరుకుంటున్నారు. ఇదిలా ఉండగా, శని,ఆదివారాల్లో పెద్ద ఎత్తున జనం వచ్చే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రే తమను అరెస్టు చేసే అవకాశం ఉందని సిజెపి అధ్యక్షుడు అభిజీత్ దిప్కే అనుమానం వ్యక్తం చేశారు. తమను అరెస్టు చేసినా, ధర్నాను కొనసాగించాలని యువతకు పిలుపునిచ్చారు.

**ఎన్నడూ లేనంత స్థాయికి ఉద్యమం: అభిజీత్ దిప్కే**

సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల తర్వాత తన నిరశన దీక్షను విరమించడం మాకు ఉపశమనాన్ని కలిగించిందని దీప్కే అన్నారు. అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. వివిధ రాష్ట్రాల్లో నిరసనలు విస్తరించాయని, ఈ ఉద్యమం గతంలో ఎన్నడూ లేనంతగా బలపడిందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని, ఆయన రాజీనామా చేసే వరకు దేశ యువత వెనక్కి తగ్గబోరని స్పష్టం చేశారు.

**ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ కెమెరాలు ఏర్పాటు**

జంతర్ మంతర్ వద్ద ముఖ గుర్తింపు కెమెరాలను ఏర్పాట్లు చేశారు. 'అసాంఘిక శక్తులు, నేరస్తులు, వాంటెడ్ నేరస్తులు జంతర్ మంతర్ నిరసన ప్రాంతంలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి, జంతర్‌మంతర్ చుటూ వివిధ ప్రదేశాలలో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఢిల్లీ పోలీసు వర్గాల సమాచారం. గతంలో కూడా ఇలా పెట్టామని, సరిహద్దు ఆవల ఉన్న ఉగ్రవాద సంస్థలు కూడా విద్యార్థుల నిరసనలను గమనిస్తున్నాయని, దేశంలో అశాంతిని సృష్టించడానికి కుట్ర పన్నుతున్నాయని ఢిల్లీ పోలీసులకు, కేంద్ర సంస్థలకు సమాచారం అందిందని అని ఆ వర్గాలు పేర్కొన్నట్లు వార్తలు వెలువడుతున్నాయి.

**పోలీసులను గుర్తించేందుకు సిజెపి వెబ్‌సైట్**

జూలై 20న విద్యార్థులపై జరిగిన దాడిలో పాల్గొన్న పోలీసులను గుర్తించి, చట్టపరమైన చర్యలను కోరేందుకు వీలుగా సిజెబి వెబ్‌సైట్‌ను ప్రారంభించనుంది.జూలై 20న జరిగిన 'సంసద్ చలో' మార్చ్ లాఠీఛార్జ్, దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బందిని గుర్తించేందుకు, నిరసనకారుల నుండి ఫోటోలు, వీడియోలను సేకరించే ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్నట్లు సిజెపి శుక్రవారం ప్రకటించింది. ఆ అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరడంతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పార్టీ తెలిపింది. న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ పోలీసులు విద్యార్థులపై దాడి చేశారని, మహిళా నిరసనకారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. తాము గతంలోనే విద్యార్థులపై దాడి చేసిన, వారిని గాయపరిచిన, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రతి అధికారిని హెచ్చరించామని, తాము ఊరుకోబోమని, ప్రతి విషయాన్నీ గుర్తుంచుకుంటామని తెలిపారు. దాడి చేసిన పోలీసు సిబ్బందికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన నిరసనకారులకు విజ్ఞప్తి చేశారు. గుర్తించిన అధికారులపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోతే, తమ పార్టీ కోర్టులను ఆశ్రయిస్తుందని చెప్పారు.

**డియు, జెఎన్‌యు విద్యార్థులపై ఆంక్షలు**

జంతర్ మంతర్ వద్ద లేదా దాని పరిసరాల్లో జరిగే నిరసన ప్రదర్శనలలో పాల్గొనవద్దని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జెఎన్‌యు) శుక్రవారం ఒక ప్రకటనలో తమ విద్యార్థులను కోరింది.
గతంలోనే ఢిల్లీ యూనివర్సిటీ (డియు) ఇలాంటి ప్రకటన చేసింది. జెఎన్‌యు పరిధిలోని విద్యాసంస్థల భాగస్వాములందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తమ వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జెఎన్‌యు ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ ప్రదర్శనలపై భారత సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా, జంతర్ మంతర్ వద్ద లేదా దాని పరిసరాల్లో జరిగే సమావేశాలలో పాల్గొనవద్దని లేదా వాటిని సందర్శించవద్దని విద్యార్థులను కోరారు.

## జనావాసాల్లోనే..

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని సిఎం అభిప్రాయపడ్డారు. అలా కాకుండా పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలన్నారు. దీని వల్ల నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారని తెలిపారు. సంబంధిత నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ సిఎస్ వికాస్‌రాజ్, డిజిపి సి.వి. ఆనంద్, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు ఎన్.శ్రీధర్, వి.శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, గృహనిర్మాణ శాఖ స్పెషల్ సెక్రెటరీ వి.పి.గౌతమ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. క్యూర్ ఏరియాలో పలు నియోజకవర్గాల పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు. దీని నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, ప్రభుత్వం ఇందులో రూ.5 లక్షల భారీ సబ్సిడీని అందిస్తోంది. మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమి ధరను మాత్రం పూర్తిగా ప్రభుత్వమే భరిస్తోంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7 వేల 680 ఫ్లాట్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాజేంద్ర నగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీ హిల్స్, కార్వాన్, బహదూర్‌పూరా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ప్రభుత్వం తొలి విడతలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనుంది.

## దాడి అమానుషం

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థి నాయకులు హైదరాబాద్‌లో భారీ ప్రదర్శన నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ఆవేదనను అణచివేయడానికి పోలీసు దాడులకు పాల్పడటం అత్యంత అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాక్రోచ్ జనతా పార్టీకి వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు ప్రకటించాయి. ఎఐఎస్ఎఫ్ అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవకతవకలు, విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన మంత్రిని ఇప్పటికీ పదవిలో కొనసాగిస్తూ ప్రధాని మోదీ ఎందుకు రక్షిస్తున్నారని ప్రశ్నించారు. ఎఐఎస్ఎఫ్ కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విశ్వసనీయత కోల్పోయిన ఎన్‌టిఎను వెంటనే రద్దు చేసి, పారదర్శకమైన, విద్యార్థులకు న్యాయం చేసే ప్రవేశ పరీక్షల వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని, ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్‌లో జరిగిన బంద్ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లాఖాద్రి, విద్యార్థి, యువజన సంఘాల రాష్ట్ర నాయకులు టి.నాగరాజు (ఎస్ఎఫ్ఐ), ఎస్.అనిల్ (పిడిఎస్‌యు), పి.మహేష్, పి.నాగరాజు (పిడిఎస్‌యు), పల్లె మురళీ, గడ్డం నాగార్జున (ఎఐఎఫ్‌డిఎస్), నవీద్ హకీమ్ (ఎఐఎస్‌బి), గోపాల్ (ఎఐపిఎస్‌యు), కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ (డివైఎఫ్ఐ), పెద్దింటి రామకృష్ణ (పివైఎల్), వనం సుధాకర్ (ఎఐఎఫ్‌డివై), ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రెహమాన్, చైతన్య అనిల్, జోసెఫ్, అన్వర్, హరీష్, అరుణ్, ఎఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. బంద్‌ను విజయవంతం చేసిన విద్యార్థులు, యువజనులు, అధ్యాపకులు, ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## పారా స్విమ్మింగ్ ఫైనల్లో కార్తీక్, ఇమామ్

# 90 కిలోలపై సందిగ్ధంలో ఒలింపిక్ విజేత



గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత స్విమ్మర్లు అదరగొడుతున్నారు. పురుషుల పారా 100 మీటర్ల ఫ్రీ స్టయిల్ ఎస్ 13 విభాగంలో కార్తిక్ బుడిగిన , అలీ ఇమామ్‌లు ఫైనల్‌కు దూసుకెళ్లారు. పురుషుల 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ పోటీలో సత్తా చాటిన శ్రీహరి నటరాజ్ సెమీస్‌లో అడుగుపెట్టాడు. అయితే.. వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరా బాయి చాను మూడోసారి పసిడి పట్టేస్తుందనుంటే.. 90 కిలోల విభాగంలో 100 శాతం తన సామర్థ్యాన్ని వినియోగించలేని పేర్కొంది. తొలిసారి కామన్వెల్త్ క్రీడల్లో పోటీపడుతున్న కార్తీక్ బుడిగిన, అలీ ఇమామ్‌లో ఈత కొలనులో మెరిశారు. చూపు సరిగా లేని ఇద్దరూ పారా స్విమ్మింగ్ పోటీల్లో ఫైనల్ చేరి పతకానికి అడుగుదూరంలో నిలిచారు. కార్తిక్ 57.10 సెకన్లలో స్విమ్ పూర్తి చేసి మూడో స్థానంలో నిలవగా.. ఎస్ 12 ఈవెంట్లో 1:05.32 టైమింగ్‌తో అలీ ఫైనల్ బెర్తు సాధించాడు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలో ఫైనల్ బెర్తు కోసంశ్రీహరి నటరాజ్ శనివారం ఉదయం 12:30గంటలకు ఈతకు సిద్ధమవ్వనున్నాడు.

## 'ఫిడే' సింహాసనంపై భారత చెస్ దిగ్గజం



భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌కు అరుదైన గౌరవం లభించింది. చదరంగం ఆటలో సుదీర్ఘ అనుభవమున్న ఆనంద్ అంతర్జాతీయ చెస్ సమాఖ్య(ఫిడే) మధ్యంతర అధ్యక్షుడిగా నియమితులయ్యాడు. ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన.. కొన్ని రోజులు తాత్కాలిక ప్రెసిడెంట్‌గా సేవలందించనున్నాడు. ప్రస్తుత అధ్యక్షుడు అర్కాడీ ద్వోర్కోవిచ్‌పై యూరోపియన్ యూనియన్ ఆంక్షలు విధించడంతో తాత్కాలిక ప్రాతిపదికన భారత లెజెండ్‌కు అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టింది ఫిడే. ఈ విషయాన్ని శుక్రవారం ఎక్స్ వేదికగా అధికారికంగా వెల్లడించింది సంస్థ.

భారత మొట్టమొదటి గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ ఫిడే తాత్కాలిక అధ్యక్షుడిగా నియమితులయ్యాడు. ప్రస్తుతం ప్రెసిడెంట్‌గా ఉన్న అర్కాడీ ద్వోర్కోవిచ్‌పై యూరోపియన్ యూనియన్ ఆంక్షలు విధించడంతో ఆనంద్ కొన్నిరోజులు ఈ పదవిలో కొనసాగనున్నాడు. ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్నందున.. రష్యా ఆటగాళ్లను అర్కాడీ లక్ష్యంగా చేసుకోవడంపై ఆగ్రహించిన యూరోపియన్ యూనియన్ ఆయనపై వేటు వేసింది.

2012 నుంచి 2018 మధ్య కాలంలో రష్యా ఉపప్రధానిగా పనిచేసిన ఆర్కాడీ.. ఆపై ఫిడే అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 2018 ఎన్నికల్లో గెలుపొందిన ఆయన.. 2022లో మళ్లీ విజయం సాధించడంలో ఆనంద్ కీలక పాత్ర పోషించాడు. దాంతో.. భారత దిగ్గజం ఫిడే ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాడు. అయితే.. అర్కాడీపై ఆంక్షల నేపథ్యంలో అధ్యక్ష పదవి ఖాళీ అవ్వడంతో.. డిప్యూటీ ఆనంద్‌ను ప్రమోట్ చేసింది ఫిడే. తనను అధ్యక్షుడిగా నియమించడం పట్ల ఆనంద్ ఫిడేకు ధన్యవాదాలు తెలిపాడు.

సైన్స్

## జీవ ఆవిర్భావ పరిశోధనల్లో ముందడుగు

అంతరిక్షంలో జీవం ఆవిర్భావ రహస్యాలను ఛేదించే దిశగా శాస్త్రవేత్తలు మరో కీలక ముందడుగు వేశారు. నక్షత్రాల మధ్య ఉన్న అంతరిక్ష వాయు మేఘాల్లో 'ఎరిథ్రులోజ్' అనే నాలుగు కార్బన్ అణువులు కలిగిన 'సుగర్'ను తొలిసారిగా గుర్తించారు. ఈ పరిశోధన ఫలితాలు 'నేచర్ ఆస్ట్రానమీ' పత్రికలో ప్రచురితమయ్యాయి. జీవం ఏర్పడేందుకు అవసరమైన రసాయన ప్రక్రియల్లో చక్కెరలకు అత్యంత కీలక పాత్ర ఉంది. ముఖ్యంగా ఆర్ఎన్ఏ వంటి జన్యు పదార్థాల నిర్మాణానికి అవసరమైన న్యూక్లియోటైడ్లు ఏర్పడేందుకు ఎరిథ్రులోజ్ వంటి చక్కెరలు ఉపయోగపడతాయని గత ప్రయోగాలు సూచించాయి. ఇప్పటివరకు రైబోజ్, గ్లూకోజ్ వంటి చక్కెరలను గ్రహశకలాలు, ఉల్కల్లో గుర్తించినప్పటికీ, నక్షత్రాల మధ్య అంతరిక్షంలో ఇలాంటి మోనోశాకరైడ్ చక్కెరను గుర్తించడం ఇదే తొలిసారి. పరిశోధకుల అంచనా ప్రకారం, సుమారు 410 కోట్ల నుంచి 390 కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై ఉల్కలు, గ్రహశకలాలు విస్తృతంగా ఢీకొన్న కాలంలో అంతరిక్ష ధూళి ద్వారా ఈ చక్కెర భూమికి చేరి ఉండవచ్చు. నీటి సమక్షంలో ఇది మరింత సంక్లిష్టమైన జీవరసాయన పదార్థాలుగా మారే సామర్థ్యం కలిగి ఉండటంతో, తొలి జన్యు అణువులు ఏర్పడటంలో ఇది పాత్ర పోషించి ఉండవచ్చు. ఈ ఆవిష్కరణతో అంతరిక్షమే జీవానికి అవసరమైన రసాయన పదార్థాల నిలయమనే అభిప్రాయానికి మరింత బలం చేకూరింది. భూమిపైనే కాకుండా విశ్వంలోని ఇతర గ్రహాలపై కూడా జీవం ఆవిర్భవించడానికి అవసరమైన ప్రాథమిక రసాయనాలు అంతరిక్షం నుంచే అందే అవకాశం ఉందని ఈ అధ్యయనం సూచిస్తోంది. భవిష్యత్తులో జీవం ఆవిర్భావానికి మరింత కీలకమైన రైబోజ్ వంటి చక్కెరలను కూడా అంతరిక్షంలో గుర్తించే అవకాశం ఉందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




## అక్కడ.. దట్టమైన వాతావరణం!



భూమికి వెలుపల ఉన్న '55 క్యాన్క్రి–ఇ' అనే అత్యంత వేడిగా ఉండే గ్రహంపై దట్టమైన వాతావరణం ఉండే అవకాశాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. జేమ్స్ వెబ్ అంతరిక్ష టెలిస్కోప్ సేకరించిన తాజా పరిశీలనల ఆధారంగా ఈ నిర్ధారణకు వచ్చారు. ఈ గ్రహంపై ఉష్ణోగ్రతలు రాళ్లు కూడా కరిగిపోయేంత తీవ్రంగా ఉంటాయి. అందువల్ల దీని ఉపరితలం ఎక్కువ భాగం కరిగిన లావాతో కప్పబడి ఉంటుందని భావిస్తున్నారు. ఇంతటి తీవ్రమైన వేడి ఉన్నప్పటికీ, ఈ గ్రహం చుట్టూ వాయువులతో సమృద్ధిగా కూడిన దట్టమైన వాతావరణం ఉండే అవకాశం ఉందని పరిశోధకులు తెలిపారు. ఈ వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, నీటి ఆవిరి వంటి అస్థిర వాయువులు ఉండవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. లావా నుంచి వెలువడే వాయువులే ఈ వాతావరణాన్ని నిరంతరం పునరుద్ధరిస్తూ ఉండవచ్చని వారు భావిస్తున్నారు. భూమికి పూర్తిగా భిన్నమైన పరిస్థితులు ఉన్న గ్రహాలు ఎలా ఏర్పడతాయి? వాటి వాతావరణం ఎలా నిలకడగా ఉంటుంది? వంటి ప్రశ్నలకు ఈ పరిశోధన కొత్త ఆధారాలను అందిస్తోంది. అలాగే సౌర కుటుంబం వెలుపల ఉన్న అతివేడి రాతి గ్రహాల స్వభావాన్ని అర్థం చేసుకోవడంలో ఇది కీలక ముందడుగుగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

## మారిన భూమి ముఖచిత్రం!




అపోలో–8 యాత్ర (1968)లో వ్యోమగామి విలియం ఆండర్స్ తీసిన 'ఎర్త్‌రైజ్' చిత్రం అంతరిక్ష చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన ఫొటోల్లో ఒకటిగా నిలిచింది. చంద్రుడి నిర్జన ఉపరితలం వెనుక నుంచి నీలిరంగు భూమి ఉదయిస్తున్న ఆ దృశ్యం ప్రపంచానికి ఒక కొత్త దృక్పథాన్ని అందించింది. మన గ్రహం ఎంత చిన్నదో, ఎంత సున్నితమైనదో ఆ చిత్రం మానవాళికి గుర్తుచేసింది. అనంతరం పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకు అది ఒక ప్రతీకగా మారి, 1970లో ప్రారంభమైన 'ఎర్త్ డే' ఉద్యమానికి కూడా ప్రేరణనిచ్చింది. దాదాపు 58 సంవత్సరాల తర్వాత, నాసా చేపట్టిన ఆర్టెమిస్ II యాత్రలో వ్యోమగాములు చంద్రుడి సమీపం నుంచి భూమి దిగువకు జారుతున్న మరో అద్భుత దృశ్యాన్ని చిత్రీకరించారు. దీనిని 'ఎర్త్‌సెట్'గా పిలుస్తున్నారు. ఈ చిత్రాన్ని మొత్తం సిబ్బంది తరఫున విడుదల చేయడం విశేషం. ఆధునిక ఉపగ్రహాలు ప్రతిరోజూ భూమి లక్షలాది చిత్రాలను పంపుతున్నప్పటికీ, ఒక మనిషి కళ్లతో చూసి తీసిన ఈ చిత్రం ప్రత్యేకమైన భావోద్వేగాన్ని కలిగిస్తుంది. ఈ రెండు చిత్రాలు కేవలం అందమైన దృశ్యాలను మాత్రమే చూపించడం లేదు. గత ఆరు దశాబ్దాల్లో భూమిపై జరిగిన పర్యావరణ మార్పులకు కూడా సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ కాలంలో వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ సాంద్రత గణనీయంగా పెరిగింది. ప్రపంచ సగటు ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెల్సియస్‌కు పైగా పెరిగింది. అడవుల నరికివేత, నగరాల విస్తరణ, వ్యవసాయ భూముల పెరుగుదల, ఆరల్ సముద్రం వంటి భారీ జలాశయాల క్షీణత వంటి మార్పులు భూమి రూపురేఖలను మార్చేశాయి. అంతేకాకుండా అంటార్కిటికాలో వేలాది చదరపు కిలోమీటర్ల మంచు ఫలకాలు కూలిపోవడం, రెండు ధ్రువాల్లో సముద్ర మంచు తగ్గిపోవడం వంటి పరిణామాలు వాతావరణ మార్పుల తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఈ మార్పుల్లో అత్యధిక భాగానికి మానవ కార్యకలాపాలే కారణం. అయినప్పటికీ, అంతరిక్షం నుంచి చూస్తే భూమి ఇప్పటికీ అందంగా, ప్రశాంతంగా కనిపిస్తుంది. కానీ ఆ అందం వెనుక దాగి ఉన్న పర్యావరణ సంక్షోభాన్ని గుర్తించడం కూడా అంతే అవసరం. అందుకే 'ఎర్త్ రైజ్', 'ఎర్త్ సెట్' చిత్రాలు కేవలం అంతరిక్ష ఫోటోలు కాదు; మన గ్రహాన్ని సంరక్షించాల్సిన బాధ్యతను గుర్తుచేసే శాశ్వత సందేశాలు. చంద్రుడి వరకు ప్రయాణించిన మనిషి చివరికి అత్యంత విలువైన ఆవిష్కరణ భూమేనని ఈ చిత్రాలు మరోసారి గుర్తు చేస్తున్నాయి.

## శ్రీ విష్ణు సరసన సాక్షి మడోల్కర్



హిలేరియస్ బ్లాక్‌బస్టర్ సామజవరగమనను అందించిన తర్వాత శ్రీ విష్ణు, దర్శకుడు రామ్ అబ్బరాజు మరోసారి జతకట్టారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో సాక్షి మడోల్కర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆమెకు టీమ్‌లోకి వెల్‌కమ్ చెబుతూ విడుదల చేసిన వీడియోలో షూటింగ్ స్పాట్‌లోని ఫన్ వైబ్‌ను చూపించారు. టీమ్ మొత్తం సరదాగా గడిపిన మూమెంట్స్‌తో ఈ వీడియో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'శ్రీ విష్ణు రామ్ అబ్బరాజు 2' కంప్లీట్ డిఫరెంట్ స్టయిల్ లో కొత్త కథాంశంతో కూడిన ఫ్రెష్ స్క్రిప్ట్. కాన్సెప్ట్, హైవోల్టేజ్ హ్యూమర్ ఎక్కువగా వుండే కథనంతో, ఈ చిత్రం నాన్‌స్టాప్ వినోదాన్ని అందించబోతోంది.నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బలమైన తారాగణం, టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సామజవరగమనకి పని చేసిన రైటర్స్ భాను భోగవరపు, నందు సావిరిగణ మరోసారి స్క్రిప్ట్ రాస్తున్నారు.

## ఆగస్ట్ 1న 'రక్త చరిత్ర 2' రీ–రిలీజ్



ఒకప్పుడు రాయలసీమ ఫ్యాక్షనిజంలో బద్ధ శత్రువులైన రెండు వేర్వేరు గ్రూపులకు చెందిన పరిటాల రవి, మద్దెల చెరువు సూరిలకు సంబంధించిన యథార్థ ఘటనల ఆధారంగా రామ్ గోపాల్ వర్మ గతంలో 'రక్త చరిత్ర' చిత్రాన్ని రెండు పార్ట్‌లుగా తెరకెక్కించిన విషయం తెలిసిందే. నటీనటులు తమ, తమ పాత్రలలో ఒదిగిపోయిన విధానం, రామ్ గోపాల్ వర్మ, అప్పట్లో ఆయన ఉపయోగించిన లేటెస్ట్ టెక్నాలజీ ఈ చిత్రాలకు ఆయువు పట్టుగా నిలిచాయి. ఈ రెండు చిత్రాలు ఒకే ఏడాది అనగా 2010లో వరుసగా విడుదలైయాయి. 16 ఏళ్ల తర్వాత 'రక్త చరిత్ర' పార్ట్1 చిత్రాన్ని ఇటీవలే రీ రిలీజ్ చేయగా...హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో మంచి స్పందన రావడంతో ఇప్పుడు 'రక్త చరిత్ర' పార్ట్2 చిత్రాన్ని ఆగస్ట్ 1న థియేటర్స్‌లో రీ– రిలీజ్ చేయబోతున్నారు. వివేక్ ఒబెరాయ్, సూర్య, రాధికా ఆప్టే, ప్రియమణి ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ చిత్రంలో రక్తసిక్త వర్ణమైన తరతరాల రక్తచరిత్ర అంటూ సాగే నేపథ్య గీతంతో పాటు కత్తులతో సావాసం నెత్తుటితో సమాప్తం అనే మరో పాటతో కలుపుకుని కథానుసారం సందర్భానుసారమైన రెండు పాటలు ఉన్నాయి. నేటితరం యూత్ కు కూడా వాస్తవిక కథతో తెరకెక్కిన ఈ చిత్రాన్ని చూపించాలనే ఉద్దేశ్యంతో రామ్ గోపాల్ వర్మ రీ–రిలీజ్ చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో హీరో సూర్య పుట్టినరోజు సందర్భంగా తాజాగా 'రక్త చరిత్ర' పార్ట్2 ట్రైలర్ ను రిలీజ్ చేశారు. వంకాయపాటి మురళీకృష్ణ, నట్టి లక్ష్మి కరుణ, నట్టి క్రాంతి నట్టీస్ ఎంటర్టైన్మెంట్స్, క్విటీ ఎంటర్టైన్మెంట్స్, త్రిపుర క్రియేషన్స్ బ్యానర్స్‌పై ఈ సినిమాను రీ– రిలీజ్ చేయనున్నారు.

## '35 – చిన్న కథ కాదు'కు జాతీయ అవార్డు సంతోషంగా ఉంది

### దర్శకుడు నందకిశోర్



2024 సంవత్సరానికి గాను '35 చిన్న కథ కాదు' చిత్రం ఉత్తమ బాలల చిత్రం విభాగంలో జాతీయ పురస్కారానికి ఎంపికైంది. అలాగే ఈ చిత్రంలో నటించిన అరుణ్‌దేవ్ పోతుల ఉత్తమ బాల నటుడు విభాగంలో జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు. 2024లో విడుదలైన '35 చిన్న కథ కాదు' చిత్రంలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ ప్రధాన పాత్రలు పోషించారు. నందకిశోర్ ఈమాని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సృజన యర్రబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. విడుదల సమయంలో ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం, ఇప్పుడు జాతీయ చలనచిత్ర పురస్కారాల్లోనూ తన సత్తా చాటింది. ఈ సందర్భంగా '35 చిన్న కథ కాదు' స్క్రీన్ ప్లే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు నందకిశోర్ మాట్లాడుతూ... 2018లో 35 చిన్న కథ కాదు ఒక ఆలోచనతో మొదలైంది. 2026కి ఇక్కడివరకు వచ్చింది. హీరో విశ్వదేవ్, దర్శకుడు సజీవ్ ,చైల్డ్ ఆర్టిస్ట్ అరుణ్ దేవ్ ,దర్శకుడు విద్యాధర్, దర్శకుడు శశాంక్, దర్శకుడు అనురాగ్, మల్లిక్ రామ్, దర్శకుడు వినోద్ పాల్గొన్నారు.

## 'శ్రీనివాస మంగాపురం'కు యు/ఎ సర్టిఫికెట్

రీల్



క్రిష్ణ మనవడు జై క్రిష్ణ నటించిన శ్రీనివాస మంగాపురం సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ఇటీవలే పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ సినిమా కు సెన్సార్ బోర్డు నుంచి యు/ఎ సర్టిఫికెట్ లభించింది. ఈ సినిమాకు అజయ్ భూపతి దర్శకత్వం వహించారు. రాష తడాని హీరోయిన్ గా నటిస్తోంది. . జీవీ ప్రకాష్ అద్భుతమైన సంగీతం ఇప్పటికే శ్రోతలను అలరిస్తోంది. యాక్షన్ నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీనివాస్, మంగ అనే ప్రేమికుల మధ్య జరిగే వైవిధ్యమైన గ్రామీణ ప్రేమ కథ చిత్రమని నిర్మాతలు చెప్పారు. కృష్ణ మనవడు కావడం, మహేష్ బాబు అన్న కొడుకు కావడంతో ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో హీరోను స్వాగతించేందుకు ఫాన్స్ సిద్ధంగా ఉన్నారని అభిమానులు అంటున్నారు. చిత్రానికి సంబధించిన అన్ని పనులు పూర్తయ్యాయని, ఈ నెల 30వ తేదీన విడుదల చేస్తున్నామని దర్శకుడు అజయ్ భూపతి తెలిపారు. ఇంతవరకు తాను తెరకెక్కించిన ఆర్ ఎక్స్ 100, మంగళవారం చిత్రాలకు పూర్తి భిన్నంగా శ్రీనివాస్ మంగాపురం సినీ ఉంటుందని తెలిపారు, మోహన్ బాబు విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ అశ్వని దత్, నిర్మాత జెమిని కిరణ్.

## వెంకటేష్‌- అనిల్ చిత్రం తొలి షెడ్యూల్ పూర్తి



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం తొలి షెడ్యూల్ పూర్తయింది. 'షైన్ స్క్రీన్స్' బ్యానర్‌పై సాహు గారపాటి భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. ఈ సినిమా తొలి షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది. ఈ షెడ్యూల్ కోసం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సెట్‌లో నిర్మించారు. వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, కీర్తి సురేష్ కృతి శెట్టి షూటింగ్ లో పాల్గొన్నారు.ఈ షెడ్యూల్‌లో కీలకమైన టాకీ పార్ట్‌తో పాటు ఓ అద్భుతమైన పాటను చిత్రీకరించారు. చాలా ముఖ్యమైన సన్నివేశాలను తెరకెక్కించారు. ఈ ఎపిసోడ్స్ సినిమాలో హైలైట్‌గా నిలవనున్నాయి. ఇప్పటికే విడుదల చేసిన కళ్యాణ్ రామ్ పోస్టర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అలాగే అనిల్ రావిపూడి తనదైన క్రియేటివ్ ప్రమోషన్స్ ఇప్పటికే అంచనాలు పెంచారు. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన కీర్తి సురేష్ కథానాయికగా నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి నటిస్తోంది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ చిత్రం 2027 సంక్రాంతికి రిలీజ్ కానుంది.ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సమీర్ రెడ్డి, ఎడిటర్: తమ్మిరాజు.

## 'రాధా రమణ' పాట రిలీజ్

సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన 'రోమాంచకం' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ ఆడియెన్స్ ను అట్రాక్ట్ చేసి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటున్నాయి. ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'రోమాంచకం' సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'రాధా రమణ' రిలీజ్ చేశారు. ఈ పాటకు ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ అందమైన సాహిత్యాన్ని అందించగా...మ్యూజిక్ డైరెక్టర్ వాసుకి వైభవ్ మెమొరబుల్ ట్యూన్ తో కంపోజ్ చేసి శ్రావ్యంగా పాడారు. హీరో హీరోయిన్స్ మధ్య బ్యూటిఫుల్ పొయెటిక్ రొమాంటిక్ మేకింగ్‌తో ఈ పాటను చిత్రీకరించారు. 'రాధా రమణ' పాట ఎలా ఉందో చూస్తే 'రాధా రమణ రాగాలు మనసున మోగే వేళలో..ఏదో తపన తాగేసి వయసులు ఊగే వేళలో..ఓ కన్నా నీ అందమే..అలలై అలలై ముంచే, కన్నుల్లో అందుకే కలలే కథలే పెంచే, ఆవేశమే తెరచాటుగా లాగగా, బిడియాల ఆదేశమే పొరపాటనీ ఆపగా, ఈ ఊగిసలో, ఊయలలో, ఉందనా లేదనా అని సాగుతూ ఈ పాట ఆకట్టుకుంటోంది.'రోమాంచకం' సినిమా ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు తెరపైకి రాబోతోంది. ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ గా సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ప్రేక్షకుల్ని థియేటర్స్‌లో రిలీజ్ చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి డిఒపి పవన్ పప్పుల, మ్యూజిక్ వాసుకి వైభవ్.





## ‘సర్’ ఫారంతో ఓటు హక్కుకు భరోసా

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సర్ ఫామ్‌లను సకాలంలో సమర్పించడం ద్వారా ఓటు హక్కుకు భరోసా కలుగుతుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 13, 21, 40 వార్డుల సర్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి అర్హత ఓటరు సర్ ఫామ్‌ను తప్పని సరిగా నింపి సమర్పించాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు సక్రమంగా నమోదై ఉండేందుకు సర్ ఫామ్‌లు కీలకమన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, దానిని ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. బిఎల్‌ఓ, బిఎల్‌ఏలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, వార్డు కౌన్సిలర్లు భూక్య కౌసల్య, వీణా బాలు గౌడ్, కొణతం రాజేష్ రెడ్డి, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలు పాల్గొన్నారు.

## రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం

డిఎస్‌పి ప్రసన్న కుమార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** హైవేలపై రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత తీవ్రతరం చేయాలని డిఎస్‌పి ప్రసన్న కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సిఐ గోదాం జంక్షన్ వద్ద బ్లాక్ స్పాట్‌ను పరిశీలించారు. అంతకుముందు డిఎస్‌పి కార్యాలయం నందు ఎస్ఐ యాదవేందర్, నేషనల్ హైవేస్ అథారిటి అధికారులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది, సూర్యాపేట టౌన్ పోలీసులతో కలిసి ఒక ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వాహనదారులు తమ వాహనాలను రహదారి పక్కన నిలపకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు పక్కన అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసే వాహనాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, అలాంటి వారిపై తక్షణమే చాలాన్లు విధించడానికి ఒక ప్రత్యేక వాట్సాప్/కమ్యూనికేషన్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు పక్కన వాహనాలను ఆపకుండా నిరంతరం నిఘా ఉంచాలన్నారు. సమావేశ అనంతరం హైవే పరిధిలోని పలు ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించారు. వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఆ గుంతలను 24 గంటల్లోపు పూడ్చివేసి, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టౌన్ పోలీస్, ట్రాఫిక్ సిబ్బంది, హైవే అథారిటి ప్రతినిధులు, హైవే పెట్రోలింగ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## ఫుడ్‌సేఫ్టీ అధికారులు, పోలీసుల విస్తృత తనిఖీలు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండలంలో ఫుడ్ సేఫ్టి అధికారులు, పోలీసులు సంయుక్తంగా శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కీతవారిగూడెం గ్రామంలో ఫేమస్ బేకరీలో కుళ్లిపోయిన కేక్ విక్రయించిన ఘటన వార్తల్లో రావడంతో అధికారులు అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. ముందుగా కీతవారిగూడెం గ్రామంలోని ఫేమస్ బేకరిని పరిశీలించిన అధికారులు, ఆహార పదార్ధాల నమూనాలను సేకరించారు. బేకరీకి ఫుడ్ సేఫ్టి లైసెన్స్ లేకపోవడాన్ని గుర్తించి రూ.5వేలు జరిమాన విధించారు. అనంతరం గరిడేపల్లి మండల కేంద్రంలోని పంజాబీ ఫ్యామిలి దాబాలో తనిఖీలు నిర్వహించార. అపరిశుభ్రత వాతావరణంలో ఆహార పదార్ధాలు తయారు చేస్తున్నట్లు గుర్తించి వారికి రెండువేల జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టి అధికారి ప్రభాకర్, ఎస్ఐ బత్తిని శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ ఆహార వ్యాపారులు తప్పని సరిగా ఫుడ్ సెప్టి నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు జానకి, నాగేశ్వరరావు, బిల్ కలెక్టర్ వెంకన్న పాల్గొన్నారు.

## మల్లమ్మ మరణం బాధాకరం



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండలం కస్తాల గ్రామానికి చెందిన బొమ్మరబోయిన మల్లమ్మ మరణం చాలా బాధకరమైన విషయం అని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మాజీ సిపిఐ నాయకులు , బిఆర్ఎస్ చండూరు మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న తల్లి బొమ్మరబోయిన మల్లమ్మ గురువారం రాత్రి మరణించారు. ఇట్టి విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శుక్రవారం కస్తాల గ్రామంలో మల్లమ్మ మృతదేహాన్ని సందర్శించి మృతదేహం పై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి మల్లమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. బొమ్మరబోయిన మల్లమ్మకు నివాళులర్పించిన వారిలో సిపిఐ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లేపల్లి ఆదిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య , గురిజ రామచంద్రం , సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, మాజీ జడ్‌పిటిసి మాదగోని విజయలక్ష్మీ, బోయపల్లి బిక్షమయ్య, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్ ,ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి జిల్లా యాదయ్య పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసనపై జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తూ, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ శుక్రవారం మిర్యాలగూడ నియోజకవర్గంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మిర్యాలగూడ ప్రతినిధులు రఫీ, అనిల్, సంతోష్, మణి, సోహైల్ పాల్గొన్నారు.

# రాజకీయ, ఆర్థిక, సామాజిక సంక్షోభం

**కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14 వరకు దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపు**



**ప్రజాపక్షం/దేవరకొండ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14 వరకు దేశ వ్యాప్త ఆందోళన నిర్వహించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం దేవరకొండలో జరిగిన సిపిఐ దేవరకొండ నియోజకవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ ఆగస్టు 6 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఐ జాతీయ పార్టీ నిర్ణయించింది మార్పు నినాదంతో నేడు దేశం తీవ్ర మైన రాజకీయ ఆర్థిక సామాజిక సంక్షోభం గుండా పయనిస్తుందని ఒక వైపు నిరుద్యోగం, ధరల పెరుగుదల, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక అసమానతలు, జీవనోపాధి సమస్య నిరంతరం పెరుగుతున్నాయని ఆరోపించారు. మరోవైపు ప్రజాస్వామ్య సంస్థలను స్వయం ప్రతిపత్తి విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ ప్రపంచలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గొప్పగా చెప్పుకుంటుందని వాస్తవంగా అభివృద్ధి ఫలాలు సమాజంలో మెజార్టీ ప్రజలకు చేరడం లేదని అర్థిక అభివృద్ధి ఫలాలు కొన్ని వర్గాలకే పరిమితమయ్యాయని ఆర్థిక వైఫల్యాలతో పాటు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా నిరంతరం ఒత్తిడికి గురవుతుందన్నారు. పార్లమెంట్ సామర్ధ్యం క్షీణిస్తుందని రాజ్యాంగ సంస్థల నిష్పక్షపాత ప్రశ్నర్థంగా మారిందని అన్నారు. ప్రజాస్వామ్య హక్కులపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని, సమాజంలో మతపరమైన విభజన ప్రోత్సహిస్తున్నారని ఈధోరణుల వలన ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ముప్పుగా మారిందని తెలిపారు. సమస్యల చుట్టూ విస్తృత ప్రచారం ప్రజా చైతన్యం ఉమ్మడి పోరాటం ఆవశ్యకత గతం కంటే ఎక్కువ పెరుగుతుందని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి రాజ్యాంగ విలువలు కాపాడటానికి సామాజిక న్యాయం లౌకికవాదం ఆర్థిక సమానత్వం సాధించడానికి ప్రజల పక్షాన సిపిఐ తన రాజకీయ సందేశాన్ని నేరుగా ప్రజలను తీసుకెళ్ళి ప్రజాపోరాటం విస్తృత పరచాలని అన్నారు. ఈమేరకు ఆగస్టు 6 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు, ప్రచార యాత్రలు జయప్రదం చేయాలని ఆయన కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, రైతాంగం అప్పుల ఊబిలో కూరుకపోయిసమస్యలతో సతమతం అవుతున్నారని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర లేక వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని యువతకు సరైన ఉపాధి లేక వలస కూలీలుగా మా రుతున్నారని, రాష్ట్రంలో అర్హులైన వారందిరికి ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. నిరుద్యోగ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఆయన అన్నారు. జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలన్నారు. మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మైనోద్దీన్, సుదర్శన్‌రెడ్డి, కనకాచారి, వెంకట య్య, రామస్వామి, వెంకటయ్య, ఆంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి, జయరాములు, రామాంజనేయులు, శైలేష్, పాండురంగారెడ్డి, వెంకట్‌రాములు, వెంకటేశ్వర్లు, శేఖరాచారి, చరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాజ్యాధికారంలో మహిళలు వెనుకంజ

రాష్ట్ర మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఈనెల 27న హుజూర్‌నగర్ పట్టణంలో జరుగు తెలంగాణ రాష్ట్ర మహిళా సమైక్య 4వ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళ సమైక్య నియోజక వర్గ మహాసభకు ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడారు. దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలు రాజ్యాధికారంలో వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కోసం జాతీయ మహిళా సమైక్య నాయకురాలు మాజీ ఎంపి గీత ముఖర్జీ గతంలో అనేక సంవత్సరాలు పార్లమెంట్‌లో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏ విధంగా వ్యవహరించిందో ప్రస్తుతం బిజెపి కూడా అదే పద్ధతులు అవలంభిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్లు వానాకాల పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టాలని ఆమె అన్నారు. ఈనెల 20న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ విద్యార్థులు ధర్నా చేస్తుంటే పోలీసులు దౌర్జన్యంగా మహిళలపై లాఠీచార్జి చేయడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులపై వెంటనే కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ పట్టణంలో జరిగే మహిళా సమాఖ్య జిల్లా మహాసభలకు సూర్యాపేట జిల్లా నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సూర్యాపేట నియోజక వర్గ నూతన కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా దంతాల పద్మరేఖ, ప్రధాన కార్యదర్శిగా పొదిలి వెంకటమ్మ, ఉపాధ్యక్షురాలుగా మోర్తాల లింగమ్మ ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉప్పుతన కోటమ్మ, దేవరం మల్లేశ్వరి, అనంతుల మల్లేశ్వరి, పొదిల వెంకటమ్మ, ఎం. లింగమ్మ పాల్గొన్నారు.

## కోడిగుడ్డు ధర వ్యత్యాసంతో వంట కార్మికుల జేబులకు గండి

ధర పెరుగుదలను కార్మికులపై రుద్దడం అన్యాయం


ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** మార్కెట్ రేటు ప్రకారంగా వంట కార్మికులకు కోడిగుడ్డు ధర చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఏఓ అంజి రెడ్డి , జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో ఒక్క కోడిగుడ్డుకు రూ.6 మాత్రమే కేటాయిస్తుండగా, ప్రస్తుతం మార్కెట్లో కోడిగుడ్డు ధర రూ.8.00 వరకు ఉందని తెలిపారు. దీంతో ఒక్కో కోడిగుడ్డుపై రూ.2.00 వరకు అదనపు భారం వంట కార్మికులపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నెలకు 3వేల వేతనంతో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, పెరిగిన ధరల కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే మార్కెట్ ధరలకు అనుగుణంగా కోడిగుడ్డు ధరను సవరించి, అవసరమైన నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల హామీ మేరకు మధ్యాహ్న భోజన వంట కార్మికులకు నెలకు రూ.10,000 గౌరవ వేతనం, సామాజిక భద్రత కల్పించాలని, ప్రతి నెల 5వ తేదీలోపు బిల్లులు, వేతనాలు చెల్లించాలని, వంట సామగ్రి, గ్యాస్ తదితర అవసరాలను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ఈ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్న భోజనం పథకం జిల్లా ప్రధాన కార్యదర్శి ముం తాజ్ బేగం నాయకులు రాజమణి, బుచ్చయ్య, శ్యామ్, గీత, బాలమణి, నీలమ్మ, పుష్ప, లలిత, అరుణ, రాజమణి, అండాలు, వాణి, సుగుణ పాల్గొన్నారు.

## పక్కాగా ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ శరవేగంగా సాగుతోందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితాను పారదర్శకమైన, తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా, డిజిటలైజేషన్ పురోగతిపై ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పలు అంశాలను వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సర్ ప్రక్రియ ఓటర్ల వివరాలను ఆన్‌లైన్ చేసే డిజిటలైజేషన్ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 10,08,252 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 9,34,581 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. అంటే దాదాపు 92.69 శాతం పని పూర్తయిందని, మిగిలిన 73,671 మంది ఓటర్ల డేటాను కూడా త్వరలోనే సిస్టమ్‌లో అప్‌లోడ్ చేస్తామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో బిఎల్‌ఓలు ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరి వివరాలు సరిగ్గా ఉండేలా చూసేందుకు క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలోని 1,205 పోలింగ్ కేంద్రాలకు గాను, ప్రతి బిఎల్‌ఓ తమ పరిధిలోని ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సరి చూస్తున్నారని, కొత్త ఓటర్ల నమోదుతో పాటు చనిపోయిన వారు, శాశ్వతంగా ఇళ్లు మారిన వారి వివరాలను ఒకటి కంటే ఎక్కువ చోటా ఓటు ఉన్న వారిని ఎప్పటికప్పుడు గుర్తించి నమోదు చేస్తున్నారని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా ఓటరు కార్డుల్లో తప్పులు దొర్లకుండా, డూప్లికేట్ ఓట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. సాంకేతికతను ఉపయోగించుకుని ఎన్నికల ప్రక్రియను మరింత సులభతరం చేస్తున్నామని వెల్లడించారు.



## రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభించకపోతే టెండర్ రద్దు

పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** మండల కేంద్రంలో ఆగిపోయిన రోడ్డు పనులను రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభించకపోతే టెండర్ రద్దు చేసి ఇతరులతో పనులు చేయిస్తాం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం నుంచి మోత్కూరు వెళ్లే ప్రధాన రహదారిలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అక్కడే ఆగి పరిస్థితిని పరిశీలించారు. మంత్రితో పాటు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కూడా రోడ్డు పరిస్థితిని పరిశీలించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, పనులు ఎందుకు నిలిచిపోయాయనే విషయంపై సంబంధిత కాంట్రాక్టర్‌కు మంత్రి ఫోన్ ద్వారా వివరణ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రోడ్డు పనులు నిలిచిపోవడానికి గల కారణాలను తెలుసుకుని, ఎట్టి పరిస్థితుల్లోనూ మరో రెండు నుంచి మూడు రోజుల్లో పనులను తిరిగి ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాంట్రాక్టర్, రెండు నుంచి మూడు రోజుల్లోనే రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు.

## బయోమెడికల్ వ్యర్థాలను పారిశుద్ధ్య చెత్తలో కలపొద్దు

మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బయోమెడికల్ వ్యర్థాలను సాధారణ పారిశుద్ధ్య చెత్తలో కలపడం చట్టరీత్యా నేరమని మున్సిపల్ కమిషనర్ బి.వంశీ కృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం నగర మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ బి.వంశీ కృష అధ్యక్షతన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులతో సాలిడ్ వేస్ట్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్2016 అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆసుపత్రులు,నర్సింగ్ హోమ్‌లు,క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లు,డెంటల్ క్లినిక్‌లు,వెటర్నరీ ఆసుపత్రులు తదితర వైద్య సంస్థల నుంచి వెలువడే బయోమెడికల్ వ్యర్థాలను మున్సిపల్ పారిశుద్ధ్య చెత్తలో కలపడం చట్ట విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.ఇటువంటి చర్యలు నిబంధనలకు వ్యతిరేకమని,ప్రజారోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారుతాయని తెలిపారు.బయోమెడికల్ వ్యర్థాలను తప్పనిసరిగా అధీకృత ఏజెన్సీల ద్వారా శాస్త్రీయ పద్ధతిలో సేకరించి,రవాణా చేసి,శుద్ధి చేసి, నిర్వీర్యం చేయాలని సూచించారు.నిబంధనలను ఉల్లంఘించి బయోమెడికల్ వ్యర్థాలను మున్సిపల్ చెత్తలో కలిపే ఆసుపత్రులు,క్లినిక్‌లు లేదా ఇతర వైద్య సంస్థలపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు, జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్.ప్రదీప్ రెడ్డి,ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ రమేష్,డాక్టర్ పుల్లారావు,డాక్టర్ ప్రదీప్, తదితర వైద్యులు పాల్గొన్నారు.

## దళిత నియోజకవర్గంపై మీ పెత్తనం చెల్లదు

ఎమ్మెల్యే మందుల సామేల్



**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** దళిత నియోజకవర్గంపై కోమటిరెడ్డి బ్రదర్స్ మీ పెత్తనం చెల్లదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తి నియోజక వర్గ రాజకీయాలపై వ్యాఖ్యానించే నైతిక హక్కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలకు లేదన్నారు. నియోజక వర్గం గురించి గాంధీభవన్‌లో రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని విమర్శించారు. ముందు నీ మునుగోడు సమస్యలు, మీ మునుగోడు మురికిని చూసుకోమని హితవు పలికారు. బిజెపి నుంచి వచ్చిన నీతోపాటు వచ్చిన నాయకులకే మండల పార్టీ అధ్యక్ష పదువులు ఇప్పించలేకపోయావని ఎద్దేవా చేశారు. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత రూ.32 కోట్లతో బిక్కేరు వాగుపై 6 చెక్ డ్యాంలను పూర్తి చేస్తే నేడు సుమారు 12వేల ఎకరాల సాగు భూమి సస్యశ్యామలం అయిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రూ.170 కోట్లతో సిసి రోడ్లు వేయించినట్లు తెలిపారు. 30 గ్రామాలకు నూతన గ్రామ పంచాయితీ బిల్డింగ్‌లను నిర్మించినట్లు వివరించారు. సుమారు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, తిరుమలగిరి మండల కేంద్రంలో జూనియర్ కాలేజి, రూ.16కోట్లతో తుంగతుర్తి మెయిన్ రోడ్డు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. తిమ్మాపురం నుండి వెంకేపల్లి గ్రామం వరకు రూ.18 కోట్లతో డబుల్ రోడ్లు వేయించామన్నారు. అదే విధంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భుదాని గాని కాలువను మంజూరి చేయించినట్లు తెలిపారు. తిరుమలగిరి మండల కమిటి అధ్యక్షుడు జనార్ధన్‌తోపాటు 8 మండలాల అధ్యక్షులు, పిఏసిఎస్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## ‘నషా ముక్త్ యువ వికసిత్ భారత్’ పోస్టర్ ఆవిష్కరణ

28న నల్లగొండలో యువతకు 8 రకాల పోటీలు : కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు,క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నషా ముక్త్ యువ వికసిత్ భారత్ కార్యక్రమ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28నుంచి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నల్లగొండ నందు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.యువతలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కల్పించడమే ఈకార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.కార్యక్రమంలో భాగంగా యువతకు 8 రకాల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. డ్యాన్స్, మ్యూజిక్,వ్యాసరచన,కవిత్వం,పెయింటింగ్,స్లోగన్స్,రీల్స్,నుక్కడ్ నాటక్జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు.కావున యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మై భారత్ జిల్లా అధికారి గౌతమ్ రెడ్డి,డివైఎస్ఓ అక్బర్ అలీ,ఎంకె నాయక్,ప్రసాద్ పాల్గొన్నారు.

## కళాశాలలు, విద్యాసంస్థల బంద్



**నర్సంపేట :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ నీ నిరసిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియు తంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ప్రభుత్వం అవలంబిం చిన తీరును నిరసిస్తూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలు పునిచ్చిన సందర్భంలో భాగంగా వామపక్ష విద్యార్థి సంఘాలతో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎఐఎస్‌బి ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. నర్సంపేట పట్టణంలోని వరంగల్ కూడలి నందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జయ్యారపు అఖిల్ ,ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్య క్షులు దిడ్డి పార్థసారథి , పిడిఎస్‌యు అధ్యక్షులు అజయ్ నరేష్ మాట్లా డుతూ నీట్ పేపర్ లీకేజీ కారణంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి నిర్లక్ష్యం వల్ల చనిపోయిన విద్యార్థులను తల్లిదండ్రులను కేంద్ర ప్రభుత్వం ఆదుకో వాలని ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐ ఎస్ఎఫ్ నర్సంపేట డివిజన్ నాయకులు శ్రీకాంత్, రాజేష్, హరీష్, చరణ్ ,వివిధ విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకుడిని అణచివేయడం సరికాదు

**ప్రజాపక్షం/గూడూరు:** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ప్రజల గొంతుకగా నిలుస్తున్న భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కేంద్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని గూడూరు పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లెపు నాగరాజు అన్నారు.ఈసందర్భంగా ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ ప్రజల హ క్కుల కోసం సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాహుల్ గా ంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలను ప్ర భుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న నాయకుడిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరా డుతుందని వల్లెపు నాగరాజు స్పష్టం చేశారు.

## ఎఐటియుసి హనుమకొండ జిల్లా రెండవ మహాసభ కరపత్రం విడుదల



**ప్రజాపక్షం/పరకాల :** హనుమకొండ జిల్లాలోని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ఎఐటియుసి హనుమకొండ జిల్లా 2వ మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆగస్టు 5న హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న ఎఐటియుసి హనుమకొండ జిల్లా 2వ మ హాసభను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ ఈ కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎఐటియుసి హ నుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్, జిల్లా ప్ర ధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్ మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరి ష్కారం, హక్కుల పరిరక్షణ, కార్మిక ఉద్యమ బలోపేతమే మహాసభ ప్ర ధాన లక్ష్యమని తెలిపారు. ఆటో కార్మికులు, వ్యవసాయ మార్కెట్ హమా లీలు, భవన నిర్మాణ కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, అసం ఘటిత రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని కోరారు.మహాసభలో కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేత నాల అమలు, ఇఎస్ఐ, ఇపిఎఫ్, సామాజిక భద్రత, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు, కార్మిక వ్యతిరేక విధానాల ఉప సంహరణ వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసిజిల్లా నాయకులు బత్తిని సదానందం, ధర్మల రామ్మూర్తి, ప్రజానాట్యమండలి నాయకులు కొట్టేపాక ర వి, పర కాల మార్కెట్ హమాలీల అధ్యక్షులు లంక దాసరి అశోక్, అనుబంధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

## 'సర్' ఫారాలపై అవగాహన



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జిల్లా కాంగ్రెస్ కమిటి కార్యదర్శి, జిల్లా ముస్లీం డెవలప్‌మెంట్ కమిటి అధ్యక్షులు, అడ్వకేట్ మహ్మద్ జమాల్ షరీఫ్ శుక్రవారం జుమ్మా నమాజ్ అనంతరం పట్టణంలోని ఏక్ మినార్ మసీదులో ప్రజలకు ఎస్ఐఆర్‌పై ఫారాలపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఓటరు ఫారం 3 ను పూర్తి వివరాలతో నింపి త్వరగా సంబంధిత బీఎల్‌వోకు సమర్పించాలని సూచించారు. ఫారాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలు నమోదు చేయాలని, విదేశాలలో ఉన్న ఓటర్ల తరుపున కుటుంబ సభ్యులు కూడా ఫారాలు సమర్పించవచ్చని తెలిపారు. సందేహాల నివృత్తికి 99083 74693 నంబర్‌లో తనను సంప్ర దించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొహియుద్దీన్, సలీం, అలీము ద్దీన్, ఫజల్, మన్నాన్ రజి, ఇక్బాల్, అజం, అఫ్జల్, అఫ్సర్, జానీ, సల్మాన్, బాబా, మెహబూబ్, ముఫ్లీ అన్సార్, ఇమ్రాన్, పాల్గొన్నారు.

## నీట్ పరీక్షల వైఫల్యంపై ఆందోళన

### కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/నర్సింహులపేట:** నీట్ పరీక్షల నిర్వహణలో అవకతవక లను నిరసిస్తూ మండల కేంద్రంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆందోళన చేపట్టారు.భారీ దర్నా నిర్వహించి కేంద్ర ప్రభు త్వానికి నిరసనగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల లీడర్లు మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్య త్‌ను ప్రభావితం చేసే నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించడంతో విద్యార్థులు,వారి తలిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొం దని పేర్కొన్నారు.నీట్ పరీక్షలకు సంబంధించిన ఆరోపనలపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సమగ్రవిచరణ జరిపి,బాధ్యులపై కఠిన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఆనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ చిర్ర సతీష్,బీఆర్ఎస్ యువ నాయకులు బండి రమేష్,కేవీపీఎస్ నాయకులు మందుల యాకుబ్,ఎన్ ఎస్‌యూఐ నాయకులు దిలీప్,కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమీటి కన్వీ నర్ అలువాల శ్రీనివాస్,యూత్ నాయకులు ఉపేందర్,శ్రీకాంత్ ,సాయి,రోహిత్,నాగరాజు,నవీన్ రెడ్డి,మురళి,మనోజ్ పాల్గొన్నారు.

# విజ్ఞాన భాండాగారం

**నూతన రూపు సంతరించుకున్న జిల్లా గ్రంథాలయం**
**3,558 మందికి శాశ్వత సభ్యత్వం**




**ప్రజాపక్షం / భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి లో చదువరులకు జ్ఞాన భాండాగారంగా ఉన్న జిల్లా గ్రంథాలయం నూతన రంగులు దిద్దుకొని కళకళలాడుతు ంది. జిల్లా కేంద్రంలోని జిఎం ఆఫీస్ పక్కన బిఎస్ఎన్ఎల్ కార్యాలయాని ఎదురుగా ఉన్న ఈ గ్రంథాలయ ప్రాంగణంలో చేపట్టిన రంగుల పనులు పూర్తి కావడం తో భవనం కొత్త శోభను సంతరించుకుంది. ముఖ్యంగా గోడలపై పుస్తకాల పేయింటింగ్స్ బొమ్మలు వేయడంతో గ్రంథాలయం మరింత రీడర్స్ ను ఆకట్టుకుంటుంది. రెం డు సంవత్సరాల క్రితం సిఎస్ఆర్ రూ.1కోటి రూపాయాల తో ప్రభుత్వం నూతన భవనం నిర్మించారు. దానికి నూతనంగా రీడర్స్‌ను ఆకట్టుకునే విధంగా నూతన సొబగు లు దిద్దారు.గ్రంథాలయం ప్రాంగణం చుట్టు గోడలపై వివిధ రకాల పుస్తకాలు విద్యార్థులు చదువు కుంటున్న చిత్రాలను చిత్రకరించడంతో చదువరులను కొత్త ప్రపంచానికి తీసుకెళ్తుంది. నూతన పేయింటింగ్‌తో పాటు శుభ్రత,వెలుతురు,కూర్చునే ఏర్పాట్లు మెరుగుపడటంతో రీడర్స్‌సంఖ్య పెరిగిందని గ్రంథాలయ సిబ్బంది తెలిపారు.

**మంచి విజ్ఞాన కేంద్రంగా గుర్తింపు:** విద్యార్థులు పోటి పరీక్షలకు పరిశోధనలకు ఉపయోగపడేల ఈ గ్రంథాలయంలో వేలాది పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. నూతన రూపు వచ్చిన నేపద్యంలో మరింత జిల్లా గ్రంధాలయానికి ప్రజల్లో మంచి ఆదరరణ పెరుగుతుంది .ఇంకా చాల మంది విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారలు కోరుతున్నారు. గ్రామీణా ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతి,యువకులు జిల్లా కేంద్రంలో ఉన్న లైబ్రెరీని ఉపయోగించుకొని కాంపిటేషన్ పరీక్షలకు,గ్రూఫ్1,2,3లపోటీ పరీక్షలు ఉద్యోగాలు పొందటం జరిగింది.

**3,558 మందికి శాశ్వత సభ్యత్వం:** జిల్లా గ్రంథాలయాలకు ప్రజల నుండి మంది స్పందన లభిస్తుంది.జిల్లాలోని 12 మండలాల్లో ఇప్పటి వరకు 3,558 మంది రూ.150 చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. జిల్లా గ్రంథాలయానికి ప్రతి రోజు సగటున 700 మంది గ్రంథాలయాలను వినియోగిస్తున్నారు.

**ప్రతి మండల ంలో రీడింగ్ రూమ్స్ :** విద్యార్థి దశలోనే విజ్ఞానం,వ్యక్తుత్వ వికాస పుస్తకాలు చదివే అలవాటు రావలనే ఉద్దేశం ప్రతి మండలానికి ఒక పబ్లిక్ రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మొదటి విడుతలో అధిక జనాబా కలిగిన గ్రామాల్లో పబ్లిక్ రీడింగ్ రూమ్‌లు ప్రారంభించేందకు ఏర్పాట్లు చేస్తున్నారు.మొదటి విడుతలో 26 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ప్రయోగాత్మకంగా గణపురం మండలం బుద్దారం, గోరి కొత్తపల్లి,మండల్లా ప్రాంభించేందకు ఏర్పాటు చేస్తున్నారు.

**గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తా :** జిల్లాలోని నిరుద్యోగులకు గ్రంథాలయాలు సమగ్ర సమాచారం అందించే విజ్ఞాన కేంద్రాలుగా మరింత అభివృద్ధి చేసేందకు కృషిచేస్తా, గ్రంథాలయాల అభివృద్ధికి ఇప్పటికే జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను కలిసి రెండు కోట్ల నిధులు కేటాయించాలని కోరడం జరిగింది.రాష్ట ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ల సహకారంతో నిరుద్యోగుల సంక్షేమానికి పాటు పడుతూ..ఇప్పటికే భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన గుండు రాధారామకృష్ణ జ్ఞాపకార్థం వారి కూతురు అ ల్లుడు సాయి పూజిత నరహరి 40 వేల రూపాయల పుస్తకాలను గ్రంథాలయానికి అందించారు.ఇంకా దాతలు ముందకు వచ్చి సహకరించాలి.



కోట రాజబాబు గ్రంధాలయ సంస్థ చైర్మన్ భూపాలపల్లి.

## దేశంలో దొంగలు పడ్డారు !

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



**ప్రజాపక్షం/జనగామ:** దేశంలో దొంగలు పడ్డారు.. రాముడి పేరుతో ఓట్లు కొల్లగొడు తుంద్రు, రాష్ట్రాల్లో చి చ్చుపెట్టి అక్రమంగా అధికారంలోకి వస్తుంద్రు, ఇప్పుడు ఆయోధ్యను సైతం వదలకుండా వారు నమ్ముకున్న గుడిలోనే దొంగతనాలకు ఎగబడ్డారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. దొంగల ముఠాకు నాయకుడు మోడీ అ యితే ఆయనకు అసిస్టెంట్ అమీత్‌షా అగ్రహం వ్యక్తం చేశారు. డిల్లీలో జరిగిన విద్యార్థుల ఉద్యమమంతోనైనా మోడీ కల్లు తెరవాలని హితవు పలికారు. సిపిఐ జనగామ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శుక్రవారం రఘునాథపల్లి మండల కేంద్రంలో ప్రారంభం అ య్యాయి. సీనియర్ నాయకులు సొంబయ్య జెండావిష్కరణ చేయగా సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారి సంస్థల దోపిడి మరింతగా పెరిగిందన్నారు. ఆర్థిక సిద్ధాంతాల విషయంలో బిజెపి కాంగ్రెస్ ఒక్కటే అని వారు పేదల గురించి, పేదల ఆర్థిక స్థితిగతుల గురించి పట్టించుకోరని, కార్మికులు సమ్మె చేస్తే, రైతుల ఆందోళన చేస్తే అరెస్టులు చేస్తారన్నారు. దోపిడి వైపు వారుంటే దోపిడిని ఎదిరించే వైపు ఎర్రజెండా ఉందన్నారు. దోపిడికి వ్యతిరేకంగా పోరాటం చేసే ఏకైక జెండా ఎర్రజెండా అని, ఎన్‌టిఆర్, మోహన్‌బాబు లాం టి వారు సీనిమాలలో ఎర్రజెండా పట్టుకొనే సీనిమాలు తీశారన్నారు. ఎక్కడ అన్యా యం ఉంటే అక్కడ ఎర్ర జెం డా ఉంటుందని, మోదీ అనేక వాగ్ధానాలు చేసి విస్మరించారని మండిపడ్డారు. బిజెపి కాలంలో రైతులు, కూ లీలు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులకు న్యాయం జరగలేదన్నారు. బిజెపి పెట్టుబడిదారులకు దాసోహం అ య్యిందని, చివరకు విద్యార్థుల పరీక్ష పేపర్లను సైతం లీ క్ చేస్తుందన్నారు. తమకు జరగిన అన్యాయాన్ని ప్ర శ్నిస్తూ సిజెపి పిలుపు మేరకు విద్యార్థులు డి ల్లీలో ఆందోళన చేస్తే వారిపై లాఠీచార్జీ చేయ డం ఎంత వరకు సరియై oదని ప్రశ్నించారు. వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేస్తున్నా స్పందించకపోగా అక్రమంగా అరెస్ట్‌లు చేయడం సరియైంది కాదన్నారు. కష్టజీవుకు అండగా ఉన్న ఏకైక పార్టీ ఎర్రజెండా అనే విషయాన్ని మర్చిపోవద్దు అన్నారు. అనేక మంది మేధావులు కమ్యూనిస్టు పార్టీలో పనిచేశారని వారి పేర్లను గుర్తు చేశారు. రోజుకో పార్టీ మారే వారికంటే కమ్యూనిస్టు పార్టీలో పనిచేసే వారే పేదల పక్షాన నిలబడే నిజమైన నాయకులన్నారు. నిత్యం పేదల పక్షాణ నిలబడే కమ్యూనిస్టు పార్టీ ఇటీవల వరంగల్ గుండ్ల సింగారంలో పేదల ఇళ్ల కోసం పోరాటం చేసి వారికి అండగా నిలబడిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్, ప్రతిపక్ష నాయకులు కెటిఆర్, హరీష్‌రావులు తిట్టుకోవడం, భూతులు మాట్లాడడం సరియైంది కాదని రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆలోలించాలన్నారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం నిర్వయించి రైతులకు నీరు అందించే విషయంపై చర్చించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస రావు, రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా నాయకులు కావటి యాదగిరి, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## అట్టహాసంగా సిపిఐ జిల్లా శిక్షణాతరగతులు



**ప్రజాపక్షం/జనగామ:** సిపిఐ జిల్లా క మిటీ ఆధ్వర్యంలో రఘునాథపల్లి మం డల కేంద్రంలో జరుగుతున్న శిక్షణా తరగతులు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఎఎస్ఆర్ పంక్షన్ హాల్‌లో ప్రారంభమైన శిక్షణ తరగతులను సీనియర్ నాయకులు సోమయ్య జెండావిష్కరణ చేయగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూ నంనేని సాంబశివరావు ప్రారంభించారు. అనంతరం జిల్లా కార్యదర్శి సిహెచ్ రా జారెడ్డి మాట్లాడగా మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు క్లాస్ బోధించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతులు జనగామ జిల్లాలోని 12 మండలాల నుండి ప్రతినిధులు హాజరయ్యారు. మొదటి రోజు శిక్షణ తరగతులు అట్టహాసంగా ప్రారంభంకాగా జిల్లా సమితి సభ్యులు, మండల కార్యదర్శి కావటి యాదగిరి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారన్నారు.

**30 మంది సిపిఐలో చేరిక**

రఘునాథపల్లి మండలం కుర్చపల్లి గ్రామానికి చెందిన 30 మంది వివిధ రాజకీయ పార్టీల నుండి రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో వారాల రాజు, మంచాల అయోధ్య ఆధ్వర్యంలో 30 మంది సిపిఐలో చేరగా వారికి ఎర్ర కండువాలు కప్పి స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారితో సాంబశివరావు అప్యాయంగా మాట్లాడారు. గ్రామంలో పార్టీ పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ కమ్యూనిస్టులుగా బతకడం అంత తేలికైన విషయం కాదన్నారు. నేడు భూర్జువా పార్టీలు డబ్బులు వెదజల్లి ప్రజల్ని ప్రలోభాలకు గురి చేస్తున్న నేపథ్యంతో కూడా ఒక గ్రామం నుండి 30 మంది సిపిఐలో చేర్చడం హర్షించదగిందన్నారు. కుర్చపల్లి నుండి పార్టీలో చేరిన వారికి మండల, జిల్లా పార్టీ సహకారం ఎప్పటికి ఉంటుందన్నారు.

## అగ్రనేతల అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన

**ప్రజాపక్షం/తాడ్వాయి:** రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాలు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు తాడ్వాయి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు నీట్ పేపర్ లీకేజీ విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను నిరసిస్తూ వారికి మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేల అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంకిడి నరసింహస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి ముఖ్య అతిథిగా హాజరై నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ రేగ కళ్యాణి మండల అధ్యక్షుడు నరసింహ స్వామి మాట్లాడుతూ దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్తేమీ కాదని త్యాగం పోరాటం వారి రక్తంలోనే ఉన్నాయని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని ఈ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్రమోదీ కేంద్రమంత్రి అమిత్ షా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్ర కోల తిరుపతి సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గడ్డం నాగభూషణం ప్రజాప్రతినిధులు వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహిళా నాయకురాళ్ళు యూత్ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'లీకేజీ'పై కేంద్రమంత్రి బాధ్యత వహించాలి

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/పర్వతగిరి :** నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ, అందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్,ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో పర్వతగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించిన ధర్నాలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,విశ్రాంత ఐపి ఎస్ అధికారి కెఆర్ నాగరాజు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు విద్యార్థులపై జరిగిన దాడులు అక్రమ అరెస్టులు లాటి చార్జీలను తీవ్రంగా ఖండించారు.కేంద్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందన్నారు.పరీక్ష వ్యవస్థపై ప్రజల్లో ఏర్పడిన అనుమానాలను వెంటనే నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులపై దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. మండల అధ్యక్షురాలు సావిత్రి,సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర రావు,చౌటపల్లి సొసైటీ చైర్మెన్ గొర్రె దేవేందర్,మాజీ జెడ్ పిటిసిబానోత్ సింగులాల్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు,పర్వతగిరి సర్పంచ్ శంకర్,గ్రామ శాఖ అధ్యక్షుడు రాంచందర్,నియోజకవర్గ,మండల,గ్రామ సీనియ ర్ నాయకులు, నాయకులు,కార్యకర్తలు మహిళలు, పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీ అక్రమ అరెస్టుపై కాంగ్రెస్ ధర్నా



**ప్రజాపక్షం / నల్లబెల్లి :** దేశ రాజదానిలో ఢిల్లీ లో కాంగ్రెస్ పార్టీ నా యకులు రాహుల్ గాం ధి నిట్ పేపర్ లీకెజీ దోషులపై చర్యలు నిరసన చేస్తుంటే పోలీసులు అ క్రమంగా అరెస్టు చేయడంపై వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆ ధ్వర్యంలో 365 జాతీయ రహదారి రుద్రగూడెం గ్రామంలో ధర్నా నిరసన కా ర్యక్రమం చేపట్టారు . ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మా లోతు చరణ్‌సింగ్ మాట్లాడుతూ కా ంగ్రెస్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గా ంధీ నిట్ పేపర్ లీకేజి పై కేంద్ర బిజెపి ప్ర భుత్వాని ప్రశ్నిస్తుంటే అక్రమ అరెస్టు చేయడం పిరికి పంథ చర్య అన్నారు . ప్ర జాస్వామ్య గొంతుకను అణిచివేయలేర ని పరీక్ష పేపర్ లీకేజీ కుంభకోణంపై విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డి మాండ్ చేస్తుందన్నారు . విద్యార్థుల భవిష్యత్తు కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వ ద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతు న్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఇతర నాయకులను అరెస్టు చేయడం బిజెపి ప్రభుత్వం అవలంబించిన అమనూష వైకరీ పట్ల తీవ్రంగా విమర్శించా రు . నిరంకుశ పాలనతో దేశాన్ని పాలించాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతిరావు ,డైరెక్టర్ మామిండ్ల రాజిరెడ్డి ,బత్తిని మల్లయ్య ,చార్ల శివారెడ్డి ,సర్పంచులు భూక్య భాస్కర్ ,ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు పరికి పవన్ ,జిల్లా కార్యదర్శి దండెం రవిందర్ , కాంగ్రేస్ మండల పార్టీ నాయకులు కుసుంభ రఘుపతి ,మోర్తాల మనోహర్‌రావు ,జంగిలి మోహన్ ,గద్దల సురేష్ ,అంబరగొండ రాజు ,మామిండ్ల అయిలయ్య పాల్గొన్నారు .

## భూసమస్యలు త్వరితగతిన పూర్తి

### అధికారులకు కలెక్టర్ ఆదేశం

**ప్రజాపక్షం / భూపాలపల్లి :** బల్క్ ల్యాండ్ సమస్యల పరిష్కారినికి చేపట్టిన సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాహల్ శర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్ర వారం ఐడిఒసి కార్యాలయంలో బల్క్ ల్యాండ్‌రీ సర్వే, సర్ ప్రకియలపై భూపాలపల్లి డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో బల్క్ ల్యాండ్ ప్రక్రియను గ్రామాల వారిగా సర్వే నిర్వహించి నివేధికలు అందజేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.సర్వే నివేదికల ఆధారంగా సంబంధితులకు నోటీసులు జారీ చేసి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని సూచించారు.జిల్లాలో రీసర్వే జరుగుతున్న నేపథ్యంలో బల్క్ ల్యాండ్ సమస్య ఉన్న గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఇప్పటికే రీ సర్వే నిర్వహించిన పైలెట్ గ్రామాల నివేదికలనే వెంటనే సమర్పించాలని ఆదేశించారు.భూ సర్వే జరుగుతున్న గ్రామాలలో టామ్ టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని పూచించారు.సర్వే జరుగుతున్న గ్రామాల రైతులు సర్వేకు సహకరించాలని ఆయన కోరారు. జిల్లాలో సాదాబైనామా కింద మొత్తం 39,300 దరఖాస్తులు అందగా ప్రస్తుతం 26,698 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ నమోదు మరింత వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 83 శాతం ఆన్‌లైన్ పూర్తందని,మొగుళ్లపల్లి,మండల్లా 99 శాతం పూర్తికాగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 70 శాతం పని జరిగిందని ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు.రెవెన్యూ అధనపు కలెక్టర్ అశోక్ కుమార్,డిఆర్‌వో వసంతకుమారి,సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడి కుసుమ కుమారి, ఆర్‌డిఒ,ఈ సెక్షన్ పర్యవేక్షకులు ,భూపాలపల్లి డివిజన్ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌పై కాజీపేట చౌరస్తాలో కాంగ్రెస్ రాస్తారోకో

**రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టులను ఖండించిన కాంగ్రెస్ నేతలు**
**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**




**ప్రజాపక్షం/కాజీపేట :** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ పేపర్ లీక్ వ్యవహారాన్ని నిరసిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కాజీపేట చౌరస్తాలో ఈరోజు కాజీపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం, రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టులను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. అలాగే నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "విద్యార్థుల పక్షాన మేమున్నాం" అనే నినాదంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పూర్తిగా కోల్పోయిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని విమర్శించారు. వరుసగా పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థుల కష్టాన్ని, వారి కలలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, వెంటనే నీట్ పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిరసన అనంతరం రాస్తారోకోలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని కాజీపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కాజీపేట సీఐ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో పోలీసులు తరలించారు.ఈ కార్యక్రమంలో 62, 63, 47 డివిజన్లకు చెందిన నాయకులు పాల్గొన్నారు. 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రాజాలి, హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆరూరి సాంబయ్య, మాజీ కార్పొరేటర్లు సుంచ అశోక్, గుంటి కుమారస్వామి, డాక్టర్ శ్రవణ్, దొంగల కుమార్, సిరిల్ లారెన్స్, షేక్ అజ్గర్, షబ్బీర్ (తబ్బు), తమ్మడి మనసా మధు, మాచర్ల జయకర్, బర్ల రాజ్‌కుమార్, పోగుల శ్రీనివాస్, మంతుర్తి బొంద్యాలు, శివరాం, రవికిరణ్, సుంచ ప్రవీణ్, ప్రశాంత్, రజియా, కొండ శివ, జై రావు, ఎండి షకీల్, బొడ్డు రామ్, గాలి శ్రీను, మాతంగి స్వామి, దార్ల రాజ్‌కుమార్, గోరుకాటి రవి, గుగ్గిళ్ల అనిల్, శ్రీనుతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

కరీంనగర్
శనివారం
25-07-2026
www.prajapaksham.in

“నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసు దాడులను ఖండిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది.”


హైదరాబాద్...

## వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో

# రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

### నీట్, సిబిఎస్ఇ పరీక్షల్లో అవకతవకలపై విచారణ జరపాలి

### కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ :** నీట్, సిబిఎస్ఇ పరీక్షల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పైసా గణేష్, ఎఐఎస్‌బి జిల్లా నాయకులు తాజ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసుల చర్యను ఖండిస్తూ దేశ వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ సందర్భంగా శుక్రవారం వరంగల్ జిల్లా వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యం లో వరంగల్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రంగశాయపేట డిగ్రీ, జూనియర్ కళాశాల తరగతులు బహిష్కరించి బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్‌బి, ఎఐవైఎఫ్ నాయకులు కంజర్ల లక్కీ, జీలకర్ర కార్తీక్, మేకల అభిరామ్, ఎస్ఎఫ్ఐ నాయకులు వసీమ్, సమీర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

**గద్వాల్ రూరల్ :** ఢిల్లీలో విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం జరిపిన లాఠీచార్జ్‌కి నిరసనగా శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రవీణ్, వామపక్ష విద్యార్థి నాయకులు దేవేందర్, శంకర్, వామన్‌పల్లి రంగస్వామి, హలీం పాషా, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీపై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వగా కరీంనగర్‌లో బంద్ విజయవంతమైంది. నగరంలో విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, ఎఐఎస్‌బి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిక రాజశేఖర్, ఎఐఆఫ్‌డిఎస్ శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి హేమంత్, సన్నీ, సందీప్, రాకేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** నీట్ పరీక్ష పత్రాల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఢిల్లీలో శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థి యువతనుపై అమానుషంగా లాఠీచార్జ్ చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతాల్లో విజయవంతం అయ్యిందని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి బైరిమల దుర్గాప్రసాద్, డివైఎఫ్ఐ కొంటు సాగర్ తెలిపారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్నకొండ సాయి ఆజాద్, తడిగొప్పుల అనుప్ సాయి, అభి, గోడిసెల ప్రణీత్, డివైఎఫ్ఐ నాయకులు ముగిలిచర్ల సురేష్ వీర సూర్య సత్య, విష్ణు ,జీవన్ తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్‌టౌన్ :** దేశంలో విద్యారంగాన్ని నాశనం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తు మరియు ప్రాణాలతో ఆడుకుంటున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పిలుపునిచ్చిన నిర్మల్ జిల్లా విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**యాదగిరిగుట్ట :** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనతో కేంద్ర ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని, న్యాయం కోసం నిరసన తెలుపుతున్న వారిపై లాఠీచార్జ్ చేయించడం అత్యంత దారుణమని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ అన్నారు. విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, ఉపాధ్యక్షులు తోటకూరి శేఖర్, నాయకులు కోనేరి శ్రీనివాస్, రవికుమార్, వెంకటేష్, రంజిత్ పాల్గొన్నారు.

**ఖమ్మం అర్బన్ :** శుక్రవారం దేశ వ్యాప్త వామపక్ష, విద్యార్థి సంఘాల బంద్ పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ సంపూర్ణమైంది. ఈ సందర్భంగా పెవిలియన్ మైదానం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్ వద్ద జరిగిన సభలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వంగూరి వెంకటేష్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి గోకినేపల్లి మస్తాన్, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు రాకేష్, ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, డివైఎఫ్ జిల్లా కార్యదర్శి మధు మాట్లాడారు. ప్రదర్శనకు సిపిఎ నాయకులు రవి మారుత్, ఐవి రమణారావు, విజయ్ సంఘీభావం తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మద్దోజు శ్రవణ్ కుమార్, భరత్, నాగరాజు, నాగులమీరా, మనోజ్, సాయి, రాజు, భాను, త్రినాథ్, లోకేష్, లక్ష్మణ్, వినయ్, సురేష్, సిద్ధు, వెంకటేష్, గాంధీ, శ్రీకాంత్, ఈశ్వరి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం :** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర సింగ్ ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ జిల్లాలో విజయవంతమైంది. ఈ సందర్భంగా అమర వీరుల స్థూపం వద్ద కేంద్ర విద్యాశాఖా మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి గణేష్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు అరుణ్, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు విజయ్,జీవన్ ప్రేమ్ వినయ్ ప్రవీణ్ మాణిక్యాల వినయ్ గుండాల సుజన్ సాయి సంతోష్ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

**తొర్రూరు :** నీట్, సిబిఎస్ఇ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు బందు మహేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎండి.అమీర్, పిడిఎస్‌యూ జిల్లా నాయకులు స్టాలిన్ అన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసుల చర్యను ఖండిస్తూ దేశవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ సందర్భంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. అనంతరం తొర్రూరు బస్టాండ్ సెంటర్ వద్ద ఖమ్మం, వరంగల్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు పేరబోయిన కిరణ్‌కుమార్, విక్రమ్, నవీన్, పవన్‌కుమార్, వినయ్, సురేందర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** నీట్, సిబిఎస్ఇ పరీక్షల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్ డిమాండ్ చేశాడు. విద్యార్థులపై పోలీసులు చేసిన లాఠీచార్జీని ఖండిస్తూ దేశావ్యాప్తంగా నిర్వహించిన విద్యా సంస్థల బంద్ జిల్లాలో విజయవంతం అయ్యింది. కార్యక్రమంలో జిల్లా నాయకులు జిల్లా గర్ల్స్ కన్వీనర్ బర్రెంకల శ్రీహారిక విద్యార్థులు పాల్గొన్నారు.

**నల్లగొండ :** నీట్, సిబిఎస్ఇ పరీక్షల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎన్ఎస్‌యుఐ, డివైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణ కేంద్రంలోని గడియారం సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మం పాటి శంకర్, ఇందూరి సాగర్, అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గాదెపాక సూర్య తేజ, జిల్లా యశ్వంత్, జాను, పవన్, కిరణ్, నవదీప్, అడిల్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు


భద్రాచలం...


నల్లగొండ...


పెద్దపల్లి...


గద్వాల...


వరంగల్...


ఖమ్మం...


నిర్మల్....


తొర్రూర్..


కరీంనగర్....


సిరిసిల్ల...


యాదగిరిగుట్ట...

## పనివేళలు, రద్దీ సమయాల్లో

# ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు



### సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక బ్యూరోను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రవాణా వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసే బ్యూరోకు సంస్థాగత నిర్మాణం ఉండాలని చెప్పారు. హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో శుక్రవారం తెలంగాణ ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై ఉన్నతాధికారులతో సిఎం సమీక్షించారు. ప్రతీ 2 లేదా 3 నెలలకోసారి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాలని ఈ సందర్భంగా అధికారులకు సిఎం చెప్పారు. ట్రాఫిక్ వ్యవస్థలో నిబంధనలకంటే క్రమబద్ధీకరణపై ఎక్కువ దృష్టి సారించాలని, వాతావరణంలో వచ్చే మార్పులు, కార్యాలయాల పనివేళలు, రద్దీ సమయాలు, స్థానిక సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం సూచించారు. కొత్తగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి ముందే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన అధ్యయనం జరగాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు పటిష్టం చేయాలని, ఓఆర్ఆర్‌పై ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా నిరంతరం పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో స్మార్ట్ సిగ్నలింగ్ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించాల్సిన అవసరం ఉందని, సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి, కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డిజిపి సి.వి.ఆనంద్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన సిపిఐ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకట రెడ్డి, కె.రామకృష్ణ, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ పాల్గొని జాతీయ రాజకీయ పరిస్థితులు వివరించినట్లు ఆయన తెలిపారు. పరీక్షా పత్రాల లీకేజీలు, యువ అభ్యర్థులను నిరాశలోకి ఆత్మహత్యలకు పురిగొల్పి, దురదృష్టకర ప్రాణ నష్టానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సాంబశివరావు డిమాండ్ చేశారు.

### ఆగస్టు 6 నుండి 14 వరకు పాద యాత్రలు, ప్రచార యాత్రలు, సెప్టెంబరు 1న ఛలో ఢిల్లీ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ అన్ని జిల్లాల్లో పాదయాత్రలతో పాటు పలు నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా పాదయాత్రలు ఆగస్టు 6 నుండి 14వ తేదీ వరకు జరుగుతాయని, సెప్టెంబర్ 1వ తేదీన చలో ఢిల్లీకి పిలుపు ఇవ్వడం జరిగిందని సాంబశివరావు తెలిపారు. ఉద్యమ కార్యక్రమం రూపొందించుకుని విస్తృతంగా పర్యటన చేయాలని, బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు.

### సెప్టెంబరు 11 నుండి 17 వరకు తెలంగాణ సాయుధపోరాట వార్షికోత్సవాలు

సెప్టెంబరు 11 నుండి 17 వరకు రాష్ట్ర వ్యాపితంగా తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని, సెప్టెంబరు 17న పెద్ద ఎత్తున సభ నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్లు సాంబశివరావు తెలిపారు.

## సైబర్ మోసాలపై సిట్

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుంది. ఈ రెండు కేసుల ఆధారంగా బ్యూరో కొత్తగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. డిఎస్‌పి కె.వి.మురళీధర ప్రసాద్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసును విచారించనుంది. సాంకేతిక ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, మనీలాండరింగ్ కోణాల్లో లోతుగా దర్యాప్తు చేపట్టాలని, ప్రతి వారం దర్యాప్తు పురోగతి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దర్యాప్తు సంస్థల ప్రాథమిక సమాచారం ప్రకారం, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాల పేరుతో నిరుద్యోగులను నమ్మించి వారి పేర్లపై బ్యాంకు ఖాతాలు తెరిపించి, ఆ ఖాతాల నియంత్రణను తమ చేతుల్లోకి తీసుకున్న నిందితులు దేశవ్యాప్తంగా జరిగిన సైబర్ మోసాల సొమ్మును ఈ ఖాతాల ద్వారా బదిలీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఖాతాల ద్వారా దాదాపు రూ.1,000 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు నిందితులను అరెస్టు చేసినట్లు సమాచారం. ప్రధాన నిందితుడిగా పోత్రు ప్రవీణ్ ఉండగా, పోత్రు కళ్యాణ్, మోరంపూడి చెన్నకేశవరావు, జన్జునూరి శివకృష్ణ, ఉడుతనేని వికాస్ తదితరులు కూడా నిందితుల జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన నిందితులు, వారికి సహకరించిన వ్యక్తులు, కంపెనీలు, బ్యాంకు ఖాతాల నెట్‌వర్క్‌పై సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. కొంతమంది నిందితులకు అధికార పార్టీకి చెందిన మంత్రి స్థాయి నాయకుల అనుచరులుగా గుర్తింపు ఉందన్న ప్రచారం కూడా జరుగుతోంది. అయితే ఈ అంశంపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

## కొత్త గనులొస్తలేవ్!

(మొదటి పేజీ తరువాయి)

రావడం లేదని ఆయన అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం 31 డిమాండ్ లతో సమ్మె నోటీసు ఇచ్చామని, దీని పై ఈ నెల 28 న చర్చలు జరుగనున్నాయని, ఒక వేళ చర్చలు విఫలమైతే ఆర్.ఎల్.సి నుండి ఫెయిల్యూర్ రిపోర్ట్ తీసుకొని ఆగస్టు 15 తర్వాత ఎప్పుడైనా సమ్మె లోకి వెళ్తామని, ఈ సమ్మె ను విజయవంతం చేయడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం గోదావరిఖని జి.ఎం ఆఫీస్ గ్రౌండ్ లో జరిగిన సింగరేణి కార్మికుల కవాతులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సింగరేణి సంస్థలో ఎనబై ఏళ్ల చరిత్ర కలిగిన సంఘం ఎఐటియుసి అని అందుకు కార్మికులు గర్వపడాలన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఎంఎండిఆర్ చట్టం వల్ల సింగరేణి కి కొత్త గనులు రాకుండా పోయిందని దీనికి అనుకూలంగా పార్లమెంటు లో ఆనాడు టిఆర్ఎస్ ఎంపి కవిత తదితరులు ఓటు వేసారని ఆయన ఆరోపించారు. అలాంటి సంఘానికి కార్మికుల గురించి, ఎఐటియుసి గురించి మాట్లాడే అర్హత లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. గోదావరిఖని లో జరుగుతున్న కార్మికుల కవాతు ద్వారా కార్మిక వర్గ ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ మాట్లాడగా, నాయకులు వై.వి.రావు, వీరభద్రం, కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, బాజీసైదా,గంధం సాంబశివరావు, మందల రాంచంద్రారెడ్డి, సిపిఐ నాయకులు గౌతం గోవర్ధన్, కే.కనకరాజ్, కార్పొరేటర్ సూర్య, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం ఎ గౌస్,వర్కర్స్ యూనియన్ నాయకులు విజయలక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు కన్నం లక్ష్మి నారాయణ, క్రాంతి కిరణ్ లు పాల్గొన్నారు. ఈ కవాతు కార్యక్రమానికి అర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఆహ్వానం పలికారు. అంతకు ముందు అమరజీవి కామ్రేడ్ మాదిరెడ్డి భాస్కర్ రావు గారి విగ్రహం కు నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించి, ప్రదర్శన గా జి.ఎం.కాలనీ గ్రౌండ్ కు వచ్చారు. కవాతు లో అర్జీ వన్, టూ, త్రీ బ్రాంచి ల ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.సభా కార్యక్రమానికి ముందు కళాకారులు ఎజ్జ రాజయ్య, చీకటి అంజన్న, వై.లెనిన్ లు కార్మిక గేయాలు ఆలపించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com